# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక సెప్టెంబర్ 2011 ₹ 20



అలసిన వేళ

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 22 సెప్టెంబరు 2011 సంచిక 9**


*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*
అన్నపరెడ్డి బుద్ధఘోషుడు
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ జయధీర్ తిరుమల రావు
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
ముంగర జాషువ

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**


*Printed & Published by*

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

| | | | |
|---|---|---|---|
| ప్రతి : ₹20 | | సంవత్సరానికి | : ₹200 |
| విదేశాలకు ప్రతి : | $ 2.50 | సంవత్సరానికి | : $ 25 |

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.

# ఈ నెల...

కమ్మతెమ్మెరలు ............................................ 3

పాశ్చాత్యులు ప్రస్తుతించిన జానపద సాహిత్యం ......... 5
– *మోకా ప్రతాప్*

ఫిడేల్ రాగాల పతాభి .................................. 10
– *నందన*

వినయశీల మల్లెమాల .................................. 16
– *పరిణతవాణి*

సాంస్కృతిక పునరుజ్జీవనం: రావిపూడి వెంకటాద్రి..... 22
– *నరిసెట్టి ఇన్నయ్య*

కర్షక కవి ఏటుకూరి వెంకట నరసయ్య ............... 25
– *సూర్యదేవర రవికుమార్*

ముప్పులో రామప్ప ...................................... 29
– *కుర్రా జితేంద్రబాబు*

నా ఆధునిక కవితా నేపథ్యం................................32
– *వేగుంట మోహనప్రసాద్*

కవిత్వం అసంపూర్ణ యాగం ............................ 37
– *సీతారాం*

ప్రాచీన శాసనాలు–విద్యావిధానం....................... 42
– *గల్లా చలపతి*

విశ్వనాథ వారితో మధురవాణి ........................... 46
– *పురాణం సుబ్రహ్మణ్య శర్మ*

గెలీలియో (ఆరోహణ–7)..................................56
– *ముక్తవరం పార్థసారథి*

కొండ కింది కవిత్వ రాయుడు వాడు ................... 59
– *జూలూరు గౌరీశంకర్*

చదవండి (పుస్తక పరిచయం) ............................... *61*


| | | |
|---|---|---|
| *ముఖచిత్రం* | : వినాయకుడు | : కె.లక్ష్మాగౌడ్ |
| *రెండవ అట్ట* | : అలసినవేళ | : శీలా వీర్రాజు |
| *మూడవ అట్ట* | : దిక్కు తోచని రైతు | : ” |
| *చివరి అట్ట* | : ఎదురు చూసేది ఎవరికోసం | : ” |

*(వివరాలు 45 వ పేజీలో)*

మనిషి జీవితంలో తొంభైయేళ్ళు చాలా దీర్ఘప్రయాణమే. ఈ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులకు, సిద్ధాంత రాద్ధాంతాలకు లోనవుతాం. ఎన్ని తుఫానులు వచ్చినా తొణకకుండా ఒక హేతుబద్ధమైన ఆలోచనకు, ఆచరణకు నిష్ఠగా నిలబడిన వ్యక్తి రావిపూడి వెంకటాద్రి. ఆయన ఆలోచననే ఆచరించి ప్రచారం చేశారు. ఈ ఒరవడిలో ఇప్పటికీ యువకులకు స్ఫూర్తిగానే తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. వారి జీవితాన్ని ఇన్నయ్య రేఖా మాత్రంగా తెలియజేశారు.

దీపాలకాంతి వెలియకమునుపే, పూలదండల పరిమళం మరుగవకపూర్వమే, పురస్కారాల సందడి సద్దుమణగక ముందే, మనకు విషాదం మిగిల్చి 'మో'గా మనకు తెలిసిన వేగుంట మోహనప్రసాద్ వెళ్ళి పోయారు – ఆయన జ్ఞాపకాలు సీతారాం, జూలూరు గౌరీశంకర్ మనతో పంచుకుంటున్నారు.

ఆలపాటి రవీంద్రనాథ్ ఆలోచనలో నుంచి పుట్టిన "విశ్వనాథవారితో మధురవాణి", విశ్వనాథ జయంతి సందర్భంగా, మాటామంతితో అలరిస్తుంది. వాలుజడ పూలచెండుతో అదిలిస్తుంది కూడా.

మనకు అపారమైన శిల్పకళా వారసత్వం వుంది. వేల సంవత్సరాల నాటి కళానిధులైన ఆలయాలున్నాయి – వాటిలో అద్భుతమైన శాస్త్రవిషయాలు నిక్షిప్తమైవున్నాయి. అటువంటి వారసత్వ సంపదను నిధులకోసం తవ్వి తీయకుండా కాపాడు కోవలసిన బాధ్యత మనందరిదీ.

ఇప్పుడు రామప్ప గుడికి 'దేవాదుల' సొరంగ మార్గం వలన ముప్పు ముంచుకొస్తున్నది. మరి ఎలా రక్షించుకోవాలో అందరూ ఆలోచించ వలసిన విషయము.

**మిసిమి** పాఠకులకు వచ్చే నెల నుంచి క్రొత్త శీర్షిక అందిస్తున్నాము. గాంధీని 'Light of Asia' పుస్తకం ఎంతో ప్రభావితం చేసినట్లు ఆయనే వ్రాసుకున్నారు. అలాగే ప్రతి ఒక్కరిని పుస్తకాలు ప్రభావితం చేస్తాయి. ఈ విషయమై రచయితలను తమ జీవితాలపై, రచనలపై ముద్రవేసిన పుస్తకాల గురించి వ్రాయవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో
**మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు
మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'సిద్ధార్థ'**
పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

★ "....*మిసిమి* సంపాదకులకు, జూలై *మిసిమి* సొగసుకు దృష్టి దోషము తగల కూడదనేమో సంపాదక వర్గము దానికి నాలుగు దిష్టి చుక్కలు పెట్టారు. అవేనండి అట్టల మీది బొమ్మలు. పిచ్చి గీతలు వెర్రి రంగులు పులిమి అర్థం పర్థం లేని సమూహాన్ని నవ్యచిత్రకళ అని ఒక పికాసు అన్నప్పటి నుంచి అదొక intellectual mania గా మారింది. జీవకళ ఉట్టి పడుతున్నట్లు చిత్రించే చిత్రకారులు రవివర్మ, మైఖేల్ ఏంజెలోలు రెండవ, మూడవ తరగతి వారైపోయారు. పికాసురుల వికారాలు మొదటి తరగతికొచ్చాయి. వీటినర్థం చేసుకోవాలంటే చేతిలో పుస్తకం పెట్టుకొని చదువుతూ చూడాలి ఎట్లాగంటే "ఆకలేస్తుంది అప్పచ్చి పెట్టమ్మా" అనకుండా డిక్షనరీ చూసి "lo sono madre fame, dammi uno spuntino" అంటే క్లాస్స్ గదా!..."

**– సముద్రాల వేమ్కట కృష్ణ,** వైజాగ్.

✶ "....*మిసిమి*ని ప్రతినెల 'విశాలాంధ్ర' బుక్‌హౌస్ నుండి కొనుగోలు చేస్తున్నాను. 'సారస్వత సంచిక'లో సరసంకు చోటు తక్కువ చేయనవసరం లేదు. 'భారతీయత'ను ప్రతిబింబించడం *మిసిమి*కి సొంతం కావాలి సొంతం... *మిసిమి* కవర్‌పేజీలపై ఉండే ఆర్ట్ చూసి 18 సంవత్సరముల నుంచి *మిసిమి*ని చూసి మురిసిపోతున్నాను. చింతనాత్మక సారస్వతం మాసపత్రిక రాను రాను మూస పత్రికగా మార్పు చెందడం చాలా బాధా కరం. 'ఆనందకుమార స్వామి' గురించి శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావుగారి వ్యాసం బాగుంది. నిరాశ, నిస్పృహలు తెలియని శ్రీ స్వామిగారి గురించి వారికిగల భారత, సింహళ దేశ కళాభిమానం గురించి చదివి ఆనందించా...

....ముఖ్యంగా, పదాలు పథాలు ఓ పదేళ్ళు లాంటి 'పరిశీలన' వ్యాసాలు ప్రచురించడానికి ఎన్నో పత్రికలు 'తెలుగు'నేలపై వుండనే వున్నాయి. *మిసిమి*కి తగిన వ్యాసం కాదు. అదియు కాక ప్రతి సంచికకు దానిని తీసుకు పోవడం మరీ విడ్డూరం. అంటే ఎప్రిల్‌లో నుంచి జూన్‌కు. ఏవిషయమైనా ఒక సంచికకే పరిమితం చేయడం బాగుంటుంది.

....గానగంధర్వ బాలమురళీకృష్ణ వ్యాసం బాగుంది. కాని దానిలో 'చింతనాత్మకత' ఏముందో అర్థం కాలేదు. వి.ఎ.కె.రంగారావుగారితో 'మంచి' సంగీత కళావిశేషాలు కలిగిన వ్యాసాలు ప్రచురించగలరు. శ్రీ కాండ్రేగులవారి వ్యాసాలు పుస్తకంగా ప్రచురించారా? ప్రచురణలులభ్యం అయినట్లయితే ఆ వివరాలు ప్రచురించగలరు. 'మేధావుల' పత్రికను 'మేధావుల' రాతలతోనే నింపండి..."

**– ఎమ్. ప్రభాకర రావు,** హన్మకొండ.

✶ "....ఆరు నెలల నుండి *మిసిమి* చింతనాత్మక మాస పత్రిక చదువుతూ ఏ నెలకా నెల అభిప్రాయాన్ని వ్రాయాలనుకుంటూ కాలం గడిపేసాను. ఎందుకంటే ఏ శీర్షిక చదివి విశ్లేషిద్దామన్నా మరలా అదొక పుస్తకం అయ్యేలా ఉంది.

....వ్యాపారప్రకటనలు ఏమీ లేకుండా, ఆకర్షణీయమైన కవర్ పేజీలతో మంచి పేపర్ క్వాలిటీ మరియు ప్రింటింగ్‌తో *మిసిమి* ఒక వినూత్న పత్రికలా అనిపిస్తుంది. మీకెంత వ్యాపారధోరణి లేకపోయినా నలుగురి చేత పత్రిక చదివింపబడాలన్నా, సర్కులేషన్ పెంచుకోవాలన్నా, పత్రికకు చందాదారులుగా చేర్పించినవారికి పుస్తకాలు బహుమతులుగా అందజేస్తామంటూ ప్రకటనలు ఇచ్చేకంటే నేటితరం పాఠకుల్ని ఆకర్షించే శీర్షికలు ఇంకా ఓ కథో ఓ కార్టూనో లాంటివి ప్రవేశపెడితే బాగుటుందేమోననిపిస్తుంది...."

**– వి.యస్.నాయుడు,** ఉక్కునగరం.

★ "....పెద్ది సత్యన్నారాయణ గారు జాషువాగారితో తమ అనుబంధాన్ని, అనుభవాలనూ గుర్తు చేసుకొంటూ మన కళ్ళముందు జాషువాగారిని మళ్ళీ నిలబెట్టారు..."

**– శివరాజు,** బాపట్ల.

✶ “....*మిసిమి* సంపాదకులకు :

మహాశయా, జూలై సంచికలో యార్లగడ్డ బాలగంగాధర రావుగారి వ్యాసంలో ‘పామిడి’ గురించి వ్రాసిన దానికి నా స్పందన.

ఈ పదానికి సముద్రాల లక్ష్మణయ్యగారు చెప్పిన అర్థం – “ ‘అడ్డమాడ లేక ఉద్ధండముగా’ సంచరించు గుఱ్ఱము గల పాదము” (అన్నమాచార్య సంకీర్తనామృతము, తితిదే, 2008, పుట 26). ‘పామిడి తురగపు పాద’మని సంకీర్తన (బ్రహ్మ కడిగిన), సముద్రాల వారు ఉదాహరణముగా యిచ్చిన మరొక సంకీర్తన ‘పామిడి కోరికలకు బంట్లైనవారలు’ (7-27). ఈ పంక్తిలోనూ పైన చెప్పినది సరిపోతుంది. అర్థం చెప్పక మరొక సంకీర్తనంలోని (22-43) రెండు పంక్తులు శ్రీహరి నిఘంటువులోనివి: ‘బూమెల నీవాడుకొన్న బొమ్మచారితనమెల్ల, పామిడి గొల్లెతలందే పచ్చిదేరీ బదరా’. ఇక్కడా గొల్లెతలకు విశేషణముగా ఆ అర్థం పొసగుతుంది.

“రంగారావుగారు చెప్పిన యితర రెండు ప్రయోగాల్లోనూ అనువర్తించాలి. కాని అదే లోపించింది” అన్నారు బాలగంగాధరరావుగారు. ఏమిటి లోపించింది? ‘అడ్డమాడ లేని ఉద్ధండమైన కోరికలకు లోబడినవార’లంటే జంకూ బెదురూ లేని గొల్లెత లంటే ఎందుకు చెల్లదు?

ఇక వారు చెప్పిన అర్థం పరిశీలిద్దాము. “పాము పాపమునకు సంక్షిప్త రూపము. కల్మషాలను పోగొట్టే కల్మషరహితము.” ఈ అర్థాలలో మొదటిదాన్ని ‘పామిడి తురగపు పాద’ మన్నదానికి కిట్టించవచ్చు. కాని కల్మషరహితమైన / కల్మషాలను పోగొట్టే కోరికలకు బంట్లైన వారలంటే ఎలా నప్పుతుంది? కల్మషాలను పోగొట్టే అన్నది గోపికలకు విశేషణం కాజాలదు. వారు కల్మషరహితులని సాగదీసి చెప్పుకోవచ్చు కాని ఆ పాటంతా చూస్తే సముద్రాల వారి మాటే సమంజసమనిపిస్తుంది. బాలగంగాధరరావుగారు తమ అభిప్రాయాన్ని సమర్థించే వేరే ఉదాహరణలు చూపేవరకూ సముద్రాల వారి మాటే స్వీకారయోగ్యం.

మరి రెండు మాటలు. గుఱ్ఱం ముఖంతో వుండేవారు హయగ్రీవుడు, తుంబురుడు, అశ్వినీదేవతలు. కల్కికి రెండు రూపాలు. గుఱ్ఱపు రౌతుఒకటైతే, గుఱ్ఱంముఖం, మానవ దేహం గలది రెండవది. ఈ రెండు రూపాలూ శిల్పాలుగా వేర్వేరు ఆలయాలలో వున్నవి. అశ్వినీదేవతలైతే యిద్దరుంటారు. చేతుల్లో ఔషధ సూచకాలుంటాయి. తుంబురుడైతే రెండు చేతుల్లో వీణలాంటి వాద్యం. హయగ్రీవుడైతే విజ్ఞాన సూచకాలైన అక్షమాల, తాళపత్రాలు యిత్యాది. కల్కికి విధిగా కుడి ఎడమ చేతులలో కత్తి, డాలు వుండాలి. మరి రెండు చేతులుంటే (అశ్వినీ దేవతలు తప్ప తక్కిన మూర్తులన్నిటికీ) వాటిలో శంఖచక్రాలుంటాయి. ఒక ఆరుచేతులున్న కల్కికి మోకాళ్లకిరుపక్కలా ఉన్న చేతులలో గద, పద్మం గమనించాను. నేను శ్రీమతి వక్కలంక సరళ చూపిన దారిలో దాదాపు యాభై తాళ్లపాక దశావతార సంకీర్తనలు పరిశీలించాను. అందులో సూచనలు రెండు విధాలుగానూ – రౌతు, అశ్వముఖుడు – కల్కికి ఉన్నవి. బాలగంగాధరరావుగారు చెప్పినట్లు “హయగ్రీవుడే కల్కి” అని పూర్వగాథాలహరిలో, ఏ పదము కింద, ఏ పుటలో వుంది? అలాగే పాము పాపమునకు సంక్షిప్త రూపమున్నట్లు ప్రయోగాలెక్కడెక్కడ వున్నవి? నా దగ్గరున్న శ.ర., సూ.ని., శ్రీ.ని., తె.ప.ని.లో కనబడలేదు. వీటికి వారు జవాబిస్తే నా మిడిమిడి జ్ఞానంలో ఒక మిడి తగ్గవచ్చు! **– వి.ఎ.కె. రంగారావు,** చెన్నై

✶ “....మీరు ప్రచురిస్తున్న బ్రోనొస్కి ఆరోహణాక్రమం విజ్ఞానదాయకంగా ఎంతో సమాచారాన్ని అందిస్తున్నది. మాచు పీచు నిర్మాణం ఇంకాస్ వారి నిర్మాణ కౌశల్యం చక్కగా తెలియజేశారు.” **– రవితేజ,** హైదరాబాదు.

✶ “....పొట్టకూటికై రోడ్ల ప్రక్కన ప్రదర్శనలిస్తున్న చిన్నపిల్లలు, కన్నతల్లుల గురించిన వ్యాసం సిగ్గుతో తలవంచుకునేట్లు చేసింది. వీరి ఉద్ధరణకు ప్రభుత్వం, మనము ఏమి చేయలేమా?” **– శంకర శాస్త్రి,** హైదరాబాదు.

✶ “....‘ఒక శకం ముగిసింది’లో కారణజన్ముడు నటరాజ రామకృష్ణకు నివాళి చాలా ఆర్ద్రంగా ఉన్నది. వారు ప్రారంభించిన కార్యక్రమాలను శిష్యులు కొనసాగిస్తారని ఆశించవచ్చా?” **– ఒక అభిమాని,** చిక్కడపల్లి.

పాశ్చాత్యులు ప్రస్తుతించిన

# జానపద సాహిత్యం

- మోకా ప్రతాప్

సాహిత్యం మానవ జీవిత ప్రతిబింబం. జానపద సాహిత్యంలో జానపదుల జీవితం ప్రతిబింబించుచుండును. నిత్యజీవితంలో సామాన్యుడనుభవించే సుఖదుఃఖాలు, అనుభూతులు ఇలాంటివన్నీ ఒక్కమారుగా పొంగిపొరలి వచ్చిన 'రసమాధురి'యే జానపదగేయ సాహితి. నాటి సంఘచరిత్రను, చారిత్రక విశేషాల్ని, భాషాపరిణామాన్ని తనలో ఇముడ్చుకున్న "చైతన్య స్రవంతి"యే జానపద సరస్వతి. నెలవంక చంద్రికలుగా సంగీత సాహిత్యాలతో మేళవించిన "కవితా ప్రకృతి"యే జానపద సాహిత్య చమత్కృతి. ఉవ్వెత్తున లేచే గోదావరీ తరంగిణిలా డెందంలో చిందులు తొక్కే "నాట్యమయూరి" జానపద సాహితీ కళామతల్లి. రాత పూతల సహాయం లేకనే శుద్ధమైన వాక్పరంపరలో పుట్టి, పెరిగి సజీవమైన సాహిత్యం "జానపదుల సాహిత్యం."

ఈ సాహిత్య మంతా జానపదుల నోట నేటికిని నానుతున్నది. ఈ సాహిత్య విలువల్ని చాలాకాలం వరకు గమనించిన వారే లేరు. సనాతన పండితులీ సాహిత్యాన్ని ఉపేక్షించారు. అందువల్ల ఈ సాహిత్యాన్ని మల్లంపల్లి సోమశేఖరశర్మ అనాదృత సాహిత్య మన్నారు. జానపద సాహిత్య విలువల్ని ప్రప్రథమంగా గమనించి సేకరించిన వారు పాశ్చాత్యులు. వారే జానపద సాహిత్యాన్ని పరిరక్షించి ప్రస్తుతించారనడంలో అతిశయోక్తి లేదు. ఈ విషయంలో వారికి మనమెంతో రుణపడియున్నాం.

విలియంజోన్సు ప్రయత్నంవల్ల బెంగాలులో క్రీ.శ. 1784 సం॥లో ఏషియాటిక్ సొసైటీ స్థాపించబడింది. అప్పుడు విలియంజోన్సు కలకత్తా సుప్రీంకోర్టు న్యాయాధీశుడు. ఈయన ఈ సంస్థకు తొలి అధ్యక్షుడు. ఈ సంస్థ నుంచి వెలువడే పత్రిక ద్వారా సంస్థ స్థాపనోద్దేశ్యాలు వెలువరించారు. ఆసియాచరిత్ర, ప్రాచీనసంస్కృతి, సంరక్షణ, కళాశాస్త్ర వాఙ్మయ పరిశోధనయే దీని ప్రధాన లక్ష్యం. క్రీ.శ 1804లో బొంబాయిలో లిటరరీ సొసైటీ స్థాపించబడింది. 1829లో బ్రిటన్‌లో రాయల్ ఏషియాటిక్ సొసైటీ స్థాపించబడింది.



కలకత్తా, బొంబాయి, శాఖలు ఈ సంస్థకు అనుబంధ సంస్థలు. 1845 సం॥లో సిలోన్‌లో ఒక శాఖ స్థాపించబడింది. ఈ రాయల్ ఏషియాటిక్ సొసైటీ అధ్యక్షులుగా మొట్టమొదట యూరోపియనులే వ్యవహరించే వారు. భారతీయ విద్వాంసులకు ఏ విధమైన అవకాశమిచ్చే వారు కారు. రాయలు ఏషియాటిక్ సొసైటీ ద్వారా జానపద సాహిత్య సేకరణ విషయంలో ప్రయత్నా లేమీ జరుగలేదు. ఆనాడు జానపద సాహిత్యశాఖను పురాతన మానవ శాస్త్రంలో చేర్చేవారు. 19వ శతాబ్దంలో పలువురు ఆంగ్లేయ సివిలియన్లు భారతదేశాన్ని పరిపాలించుటకు వచ్చారు. వీరిలో పెక్కుమంది పరిపాలనాదక్షులే గాక ఉద్దండ పండితులు కూడా. వారికి భారతీయ సంస్కృతి పట్ల మక్కువ ఎక్కువ. భారతీయ సాహిత్యమన్న వారికి గౌరవాభిమానాలు కలవు. అందువల్ల వీరు ప్రాచీన చరిత్ర, సంస్కృతిని గురించి చేసిన పరిశోధనాకృషి పండితుల మన్ననలందుకుంది.

భారతీయ జానపద సాహిత్యాన్ని మొట్టమొదట సేకరించి, పరిశోధించి ప్రస్తుతించిన వారు రెండు వర్గాలకు చెందినవారు. 1) ఆంగ్ల సివిలియను అధికారులు 2) క్రిస్టియన్ మిషనరీలు. సివిలియను అధికారులు మనదేశాన్ని పాలించడానికి, క్రైస్తవమత ప్రచారం చేయడానికి క్రిస్టియన్ మిషనరీలు వచ్చారు. ఆనాడు భారతదేశానికి వచ్చిన

విదేశీయులు తప్పనిసరిగా భారతీయభాషా సాహిత్యాల్ని నేర్చుకునేవారు. దీనితో ఆయాభాషల్ని నేర్చుకుని స్థానికులతో మాట్లాడుట అత్యవసరమైంది. ఈ ప్రయోజనాల్ని గుర్తించి పై రెండు వర్గాలవారు భారతీయ భాషల్ని నేర్చుకున్నారు.

ఆంగ్ల సివిలియను అధికారులు భారతీయ జానపదసాహిత్యాన్ని సేకరించి ఎనలేని సేవచేశారు. కర్నల్ జేమ్సు టాడ్ ఈ పవిత్రకార్యానికి నడుంబిగించారు. ఈయన రాజస్థాన్‌లోని సంస్థానాలందు రెసిడెంటుగా వుండేవారు. అందువల్ల రాజస్థాన్ ప్రాంతంలోని ఆచార వ్యవహారాల్ని, వేషభాషల్ని గూర్చి తెలిసికోగలిగారు.

అనేక సంవత్సరాలు శ్రమించి 1829 సం॥లో ‘Annals and antiquary of Rajasthan’ అనే పుస్తకాన్ని వెలువరించారు. దీనిలో రాజస్థాన్ లోని భిన్నభిన్న స్వదేశ సంస్థానాల్ని గూర్చి వివరించారు. దీనిలో జానపదగీతాల్ని గూర్చిగాని, జానపద కథల్ని గూర్చిగాని వివరించలేదు. కాని జానపదగాథల్ని బట్టి జానపదగీతాల్ని ఆధారంగా తీసుకొని టాడ్ ఈ గ్రంథాన్ని రచించారనడం నిస్సందేహం. భారతీయ జానపద సంస్కృతిని గూర్చి ప్రప్రథమంగా తెలిసికొని వెలువరించిన వారు టాడ్.

సి.పి బ్రౌను శిష్ట సాహిత్యో ద్ధరణానికి పూనుకొని చెదలు పట్టున్న సాహిత్యసంపదను పరిరక్షించారు. ఈయన కన్ను జానపద సంపదపై పడింది. 1842 సం॥లో ఒక జంగమ వ్యక్తిని నెలరోజులపాటు తమ ఇంట్లో వుంచుకొని అతని చేత కుమార రాముని కథ, బొబ్బిలికథ, కాకమ్మకథ మొదలైన గేయగాథల్ని పాడించు కున్నారు. అంతేకాక పెక్కు జానపదగేయాల్ని, యక్షగానాల్ని సేకరించి ఆంధ్రులకు అందించారు. పల్నాటివీరగాథలు, కాటమరాజు కథలకు సంబంధించిన తాళపత్ర గ్రంథాల్ని సేకరించారు.

బ్రౌను సేకరించి భద్రపరిచిన పల్నాటి వీరకథాచక్రం, పింగళిలక్ష్మీకాంతం, అవసారాల సూర్యారావు సంపాదకత్వంలో పరిష్కరించబడి 1961 సం॥లో ప్రచురించబడింది. బ్రౌను తెలుగు జానపద సాహిత్య గొప్పదనాన్ని గూర్చి Asiatic Journal లో వ్యాసం ప్రచురించారు. ఈయన ఏషియాటిక్ జర్నల్ వాల్యూం 34లో 1841 సం॥లో యక్షగానాల్ని చెబుతూ జానపద సాహిత్య మహిమను కొనియాడారు. జె.ఐబట్ 1854 సం॥లో ‘On the Ballet and Legends of the Punjab’ అనే వ్యాసాల్ని రాశారు. దీనిలో పంజాబు వీరగాథల్ని గూర్చి తెలిసికొని ఆయావీరుల్ని గూర్చి రాశారు. రెవరెండ్ ఎస్.హిస్లపు మధ్యప్రదేశ్‌లో నివసించు ఆటవిక జాతుల్ని గూర్చి రాశారు. 1866 సం॥లో రాసిన వ్యాసాల్ని సేకరించి టెంపుల్ పుస్తకరూపంలో తీసుకువచ్చారు. 1868 సం॥లో మిస్.ఫ్రేయర్ అనే ఆంగ్లవనిత ‘Old Deccan Days’ అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో దక్షిణ భారతదేశ జానపదకథలు వున్నాయి.

కెప్టెన్ ఎం.డబ్ల్యూకార్ తెలుగుసామెతలు కొన్నింటిని ‘ఆంధ్రలోకోక్తిచంద్రిక’ అనే పేరుతో 1868 సం॥లో ప్రచురించారు. అంతకు ముందే కొంతమంది సామెతల పుస్తకాల్ని ప్రచురించారనీ ఆ గ్రంథపీఠిక నుంచే తెలుస్తుంది. ఆయితే అవి అందుబాటులో లేవు. ఉన్న పుస్తకాల్లో తెలుగులో ‘ఆంధ్రలో కోక్తిచంద్రిక’ మొదటిదని టేకుమళ్ళ కామేశ్వరరావు గారి అభిప్రాయం. ఈ పుస్తకాన్నే నందిరాజు చలపతి రావు 1906 సం॥లో ప్రచురించారు. ఈ మధ్య కాలంలో ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు ఈ పుస్తకాన్ని పునర్ముద్రించారు. జె.బీమ్సు 1868 సం॥లో బెంగాల్ ఏషియాటిక్ సొసైటీ పత్రికలో భోజపురి భాషను గూర్చి రాశారు.

ఈయన భోజపురీ వ్యాకరణవేత్త. ఈయన రాసిన హిందీ (భోజపురి) వ్యాకరణం ప్రామాణిక గ్రంథమనవచ్చు. భోజపురీ భాషను గూర్చి రాస్తూ అనేక జానపదగీతాల్ని సోదాహరణంగా కూర్చారు. ఛార్లెస్ ఇ.గోవర్ 1871 సం॥లో ‘Folk songs of the Southern India’ అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది భారతీయ జానపదగీతాల ప్రథమ సంకలనం. ఈ సంకలనంలో తమిళం, కన్నడ, మలయాళ, బడగ, కూర్గు భాషల్లోని జానపదగేయాల్ని ప్రచురించారు. అయితే ఇందులో తెలుగుభాషకి సంబంధించిన జానపదగీతాలు లేకపోవడం శోచనీయం. జానపదగీతాలకు బదులుగా వేమన పద్యాల్ని ఈ గ్రంథంలో చేర్చడం జరిగింది. ఈ విషయాన్ని గ్రహించిన జె.ఏ బోయల్ Indian Antiquaryలో Telegu Bailed Poetry పేరుతో వ్యాసం రాస్తూ గోవర్ తన గ్రంథంలో తెలుగు జానపదగేయాల్ని పేర్కొనకపోవడాన్ని ఆక్షేపించారు. గోవర్ తనకు భాష రాకపోవడం మూలంగా జానపద గేయాలకు బదులు వేమన పద్యాల్ని పేర్కొన్నాడనడం సమంజసం. ఏమైనా గోవర్‌కు తెలుగు భాషా సాహిత్యాల పట్ల వున్న అభిమానం అనంతం.

డాల్టన్ 1872 సం॥లో 'Descriptive Anthology of Bengal' అనే గ్రంథాన్ని రాశారు. ఇందులో బెంగాల్‌లో నివసించే విభిన్న జాతుల్ని వివరించారు. 1872 లోనే ఆర్.సి. కాల్డ్‌వెల్ 'Tamil Popular Poetry' అనే వ్యాసాల్ని Indian Antiquary భాగంలో ప్రచురించారు. దీనిలో తమిళ జానపదగీతాల్ని గూర్చి వివరించారు.

బ్రౌన్ పండితుడు తెలుగు సాహిత్యోద్ధరణ చేసినట్టుగానే తెలుగు జానపద గీతాల వైశిష్ట్యాన్ని గుర్తించి, లోకానికి వెల్లడించిన ఘనత బోయల్ మహాశయుడికి దక్కుతుంది. ఈయన 1874 సం॥లో రాయలసీమలో రాజకీయోద్యోగిగా నియమించబడ్డారు.

బోయల్ తెలుగు జానపద సాహిత్యాభిమాని. ఈయన తన అధికారిక పర్యటనల కాలంలో గ్రామసీమల్ని సందర్శించినపుడు రాత్రి వేళల్లో పల్లీయులు పాడే పాటల్లోని సంగీతాన్ని వింటూ మైమరచేవారట. సంగీతంలోని మాధుర్యాన్నే కాక భాష రాకపోయినా ఆ గేయాల్లో తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి చెందిన విశేషాలెన్నో వున్నాయని గ్రహించారు. ఈయన మొత్తం ఆరుగేయాల్ని సేకరించారు. అందులో ఒకటి చారిత్రక గేయం, తక్కినవి శృంగార గేయాలు. ఈ చారిత్రక గేయం సర్వాయిపాపడికి సంబంధించినది. బోయల్ దీన్ని బళ్ళారిలో సేకరించారు.

బళ్ళారిలో సేకరించడంవలన ఈ గేయం రాయలసీమకు చెందిందనీ, పాపడు రాయలసీమ వాడని అభిప్రాయపడ్డారు. అయితే పాపడు తెలంగాణా ప్రాంతానికి చెందిన వాడన్న విషయాన్ని మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు తమ పరిశోధనలో తేల్చి చెప్పడం జరిగింది. ఏమైనా బోయల్ మహాశయుడికి తెలుగు జానపద గీతాల మీదవున్న ఆసక్తి వల్ల ఒక చారిత్రక పురుషుడ్ని లోకానికి చాటడానికి దోహదం చేసింది. తెలుగు జానపద సాహిత్య విలువల్ని గుర్తించి, జానపదగీతాల మాధుర్యాన్ని చవిచూపించిన బోయల్ మహాశయుడ్ని స్మరించుకోవడం మన కర్తవ్యం.

ఎఫ్.టి.కోల్ 1876 సం॥లో రాజమహల్ కొండల్లో నివసించే కొండజాతుల్ని గూర్చి ' The Rajmahal Hill men's songs' అనే వ్యాసాన్ని Indian Antiquaryలో ప్రచురించారు. జి.హెచ్ డెమెంట్ 'Bengal folklore from Dinajpur' అనే పుస్తకాన్ని రచించారు. దీనిలో బెంగాలీ జానపదకథలు పొందుపరచబడినవి. ఈయన 1879 సం॥లో మరణించారు. అప్పటివరకూ Indian Antiquaryలో జానపదసాహిత్య సంబంధమైన వ్యాసాలు రాసేవారు. హ్యూజ్‌ఫ్రేయర్ (1885) ఆంగ్ల సివిలియను గోరఖ్‌జిల్లా మేజిస్ట్రేటు. బెంగాల్ ఏషియాటిక్ సొసైటీ పత్రికలో ఈయన గోరఖ్‌పూర్ జిల్లాలో లభించిన భోజపురీ గీతాల్ని ప్రచురించారు. మొత్తం గీతాలు పదమూడు. వీటిలో ఆరుగీతాలు శృంగారగీతాలు, ఒకటి విసురురాయిపదం, మిగిలినవన్నీ విభిన్న విషయాలకు సంబంధించినవి.

ఈ గీతాలు ఆంగ్లభాషలోకి అనువదించబడ్డాయి. గ్రియర్సన్ ఈ గీతాల్ని సేకరించి వెలువరించారు. దీనిలో అనేక విషయాల్ని గూర్చి వివరించారు. 1884 సం॥లో ఆర్.సి.టెంపుల్ 'Legends of the Panjab' అనే పుస్తకాన్ని ప్రకటించారు. ఇందులో పంజాబు వీరగీతాలు పొందుపరచబడ్డాయి. పంజాబీ జానపదకథల్ని సేకరించే ప్రథమ ప్రయత్నమిది. శ్రీమతి స్టీల్ 1885 సం॥లో 'Wide Stories' అనే పుస్తకాన్ని రాశారు. ఈ సేకరణలో ఆర్.సి.టెంపుల్ సహకరించారు. ఈ కథల సంపుటి విశేషించి పేర్కొనదగింది. ఆనాటికి నోనోట నానుచున్న కథలన్నింటిని వీరిద్దరు సేకరించారు. ఆయా సంఘటనల్ని బట్టి కథల్ని ఏర్చి కూర్చారు. ఈ.జె.రాబిన్సన్ 'Tales and Poems of South India' అనే గ్రంథాన్ని వెలువరించారు. ఇందులో దక్షిణ భారతదేశంలోని జానపదగీతాలు, జానపదకథలు ఆంగ్లభాషలోనికి అనువదింపబడ్డాయి.

భారతీయ జానపద సాహిత్య సేకరణలో ప్రముఖపాత్రను వహించివారు సర్. జార్జి గ్రియర్సన్. ఈయన భాషాశాస్త్రానికి చేసిన సేవ ఎనలేనిది. 'Linguistic survey of India' ఆయన సంపాదకత్వంలో వెలువడిన మహాగ్రంథం. జానపద సాహిత్యాన్ని సేకరించి దాని పరిరక్షణకు ఎంతగానో తోడ్పడినారు. 1848 సం॥లో 'Some Bihari folk songs' అనే వ్యాసాన్ని రచించారు. ఇందులో బీహారి జానపదగీతాలు ఉదహరించబడినవి. 1886 సం॥లో 'Some Bhojpuri Folk songs' అనే బృహద్ వ్యాసాన్ని ప్రచురించారు. దీనిలో భోజపురీ ప్రేమగీతాలు, విసురురాయి పదాలు, జన్మగీతాలు సేకరించబడ్డాయి. ఇందులో మూల గీతాల నుంచే గ్రియర్సన్ ఆంగ్లానువాదం చేశారు. వ్యాసం చివర భాషాశాస్త్ర సంబంధమైన టిప్పణిని జోడించారు. భోజపురీ జానపదగీత

సంకలన కార్యానికిది నాందని చెప్పవచ్చు. 1884 సం॥లో గ్రియర్సన్ 'విజయమల్లు' జానపద గాథను సేకరించారు. ఇది బెంగాలు ఏషియాటిక్ సొసైటి పత్రికలో ప్రచురించారు. 1885 సం॥లో వీరు 'The song of Alpas Marriage' అనే వ్యాసాన్ని 'Indian Antiquary' పత్రికలో ప్రచురించారు. ఇందు ఆల్పా వివాహ వర్ణన వివరింపబడింది. దీని మూలగీతం గూడ ప్రచురింపబడింది. అంతేకాక 'Two versions of the song Gopichand' అనే రూపంలో గోపీచంద్ కథకు సంబంధించిన భోజపురీ, మగధీ భాషల్లోని వేర్వేరు రూపాల్ని సంకలనం చేసి ప్రచురించారు.

1889 సం॥లో జర్మనీలో సుప్రసిద్ధ పత్రికలో గ్రియర్సన్ 'నయ కాబన్ జరవా' అనే గీతాల్ని ప్రచురించారు. ఇది కథాత్మక గీతం. భోజపురీ ప్రాంతంలో బహుళ ప్రచారంలో వున్న గీతమిది. డాక్టరు గ్రియర్సన్ సంకలన కావ్యంలో పేర్కొనదగిన విశేషాలనేకంగలవు. గ్రియర్సన్ మూల గీతాల్ని పొందుపరిచేవారు.

తర్వాత దానికి ఆంగ్లానువాదం జోడించేవారు. అంతేకాక ఆ గీతాలకు గల చారిత్రక ప్రసిద్ధిని పేర్కొంటూ భాషాశాస్త్ర సంబంధమైన టిప్పణిని గావించేవారు. వీరు 'బీహార్ పీజెంట్ లా ఇఫ్' అనే గ్రంథాన్ని రచించారు. జానపదుల నోట నానుతున్న పదాలిందు సేకరించబడ్డాయి. భారతీయ జానపద సంస్కృతీ సంరక్షణకు సాహిత్య సంకలనానికి తోడ్పడిన మహనీయుడు విలియమ్ క్రూక్. ఈయన బ్రిటీషు సివిలియను మీర్జాపూర్ కలెక్టర్‌గా పనిచేశారు. ఈయన ఉత్తరప్రదేశ్‌లోని జానపదగీతాల్ని సేకరించారు. భారతీయ జానపద సంస్కృతిని గూర్చి ఆపోశనం పట్టారు.

1891 సం॥లో భారతీయ జానపద సంస్కృతీ పరిరక్షణకు 'North Indian notes and Queries' అనే పత్రికను స్థాపించారు. ఈ పత్రిక ద్వారా భారతీయ జానపద సాహిత్యానికి ఎనలేని సేవచేశారు. ఈ పత్రిక అయిదారేండ్లు నడిచింది. ఈ పత్రికలో అమూల్యమైన జానపదగీతాలు, కథలు ప్రచురించారు. 1896 సం॥లో క్రూక్ 'Popular religion and culture of North India' అనే మహత్తర గ్రంథాన్ని రచించారు. ఇందులో వివిధ విషయాల్ని గూర్చి వివరించారు. గ్రుడ్డి నమ్మకాలు, మందుమాకులు, భూతవైద్యం, గ్రామదేవతలు, భూతపిశాచాలు, ఆచారవ్యవహారాలు మొదలైన విషయాల్ని గూర్చి చర్చించారు. భోజపురీ ప్రజల ఆచారవ్యవహారాల్ని గూర్చి విశ్లేషించి ఈ గ్రంథంలో వివరించారు.

ఇంకను 'Casts and Tribes of North West Province' అనే పుస్తకాల్లో నాలుగు భాగాలు కలవు. ఇందులో క్రూక్ ఉత్తర భారతీయ జాతుల్ని గూర్చి వివరించారు. క్రూక్ ప్రోద్బలంతో పండిత రామగరీబ్‌చేబే అనే ప్రైమరీ స్కూలు అధ్యాపకుడు ఉత్తర ప్రదేశ్ జానపదగీతాల్ని సేకరించారు. ఈ గీతాలు 1893 సం॥లో 'North Indian notes and Queries' అనే పత్రికలో ప్రచురించబడ్డాయి.

**ఇ.థర్స్టన్ 1912 సం॥లో 'Women and Superstitions of Southern India' అనే అమూల్య గ్రంథాన్ని వెలువరించారు. దక్షిణ భారతీయుల ఆచారవ్యవహారాలు, శకునాలు, అంధవిశ్వాసాలు, తంత్రాలు, మంత్రాలు, చేతబడులు మొదలైన వాటిని గూర్చి ఈ గ్రంథంలో వివరించారు.**

జె.డి.అండర్సన్ 1895 సం॥లో అస్సాంరాజ్యంలోని కఛారీ జాతివారి జానపద కథల్ని, శిశుగీతాల్ని సేకరించి 'Collection of Kachari folk tales and Rhymes' అనే పేరుతో వెలువరించారు. 1899 సం॥లో ఆర్.ఎమ్.లాఫ్రెనెస్ 'Some Songs of the Portuguese Indians' అనే వ్యాసాన్ని 'Indian Antiquary' అనే పత్రికలో ప్రచురించారు. దీనిలో గోవానివాసుల జానపదగీతాలు పొందుపరచబడ్డాయి. 1903 సం॥లో స్విన్నర్టను పంజాబీ జానపదకథల్ని సేకరించి 'Romantics from the Punjab' అనే పుస్తకాన్ని ప్రచురించారు. దీనిలో 'రసాలు' రాజు కథను కూడా జోడించారు. 1905 సం॥లో ఎఫ్.హాన్ 'Curubh folklore in original' అనే పుస్తకాన్ని వెలువరించారు. దీనిలో ఉరవల జానపదగీతాలు మొత్తం రెండు వందలు సేకరించబడ్డాయి.

ఇ.థర్స్టన్ 1905 సం॥లో "Endographic notes in Southern India" అనే పుస్తకాన్ని వెలువరించారు. ఈయన దక్షిణ భారతీయ జాతుల్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వీరే 1909 సం॥లో 'Castes and Tribes of Southern India' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇ.ఎమ్ గోర్డన్ 1908

సం॥లో 'Indian Folk Tale' అనే పుస్తకాన్ని ముద్రించారు. 1909 సం॥లో సి.హెచ్.బొంపాస్ 'Folklore of Sandhal Paragana' అనే పుస్తకాన్ని ప్రకటించారు. క్రోఫోర్డు ఆర్థరు 'Legends of the konkana' అనే పుస్తకాన్ని రాశారు. ఇ.థర్స్టన్ 1912 సం॥లో 'Women and Superstitions of Southern India' అనే అమూల్య గ్రంథాన్ని వెలువరించారు. దక్షిణ భారతీయుల ఆచారవ్యవహారాలు, శకునాలు, అంధవిశ్వాసాలు, తంత్రాలు, మంత్రాలు, చేతబడులు మొదలైన వాటిని గూర్చి ఈ గ్రంథంలో వివరించారు. డబ్లు.టి.జేమ్సు 'Popular poetry of the bellow cheese' అనే పుస్తకాన్ని రాశారు. ఇందులో వీరగాథలు, ప్రేమగీతాలు, పొడుపుకథలు మూలరూపంలో వున్నాయి.

1908 సం॥లో ఈస్టేక్ అస్సాం ప్రాంతంలోని మికిరజాతి ఆచారవ్యవహారాల్ని గూర్చి 'The Micars' అనే పుస్తకంలో రాశారు. సిహెచ్. బోంపస్ 1909 సం॥లో బోడింగ్ ద్వారా సేకరించబడిన సంథాలీ కథల్ని ఇంగ్లీషులోనికి అనువదించారు. 1911 సం॥లో సలిగ్ మాన్ 'నేద్దు' జాతిని గూర్చి వివరించారు. 1912 సం॥లో షేక్స్పియర్ అస్సాం ప్రాంతానికి చెందిన 'లూశాయాకూకీ' జాతి సాంఘిక వ్యవస్థను గూర్చి వివరించారు. ఎం.జి. ఆగకర్ బరోడా స్వదేశ సంస్థానంలో నివసించు జాతుల్ని గూర్చి 'A Glossary of Castes, Tribes and Reseage in Baroda State' అనే పుస్తకాన్ని రాశారు. ఎం.కులక్ 'Bengali Household Tales' అనే పేరుతో జానపద కథల్ని సేకరించి ప్రచురించారు.

రసెల్, డా॥హీరాలాల్ కలిసి 1916 సం॥లో మధ్య ప్రదేశ్‌లోని జాతుల్ని గూర్చి 'The Tribes and Castes in Central Province of India అనే పేర నాలుగు భాగాలు వెలువరించారు. ఇందులో మధ్యప్రదేశ్ జాతుల జానపదగీతాల్ని, జానపదకథల్ని పొందుపరిచారు. 1917 సం॥లో సి.ఏ.బక్ 'Faiths and Festivals of India' అనే పుస్తకాన్ని రచించారు. ఇందులో జానపదుల పండుగలు, పబ్బాలు, నమ్మకాలు మొదలైన వానిని గూర్చి వివరించారు.

1918 సం॥లో బీహారు గవర్నమెంట్ వైద్యుడు గ్రియర్సన్ గ్రంథమైన 'బీహార్ పీజెంట్ లాఇఫ్' ను మరల ముద్రించారు. ఈ పుస్తకాన్ని ప్రచురించిన తర్వాత భారతీయుల్లో నోనోట నానుతున్న పలుకుబళ్లను సేకరించవలెనన్న కుతూహలం జనించింది. ఆర్.ఇ.ఎందోలిను 'The folklore of Bombay' (1924) 'Tribes and Castes of Bombay' (1926) అనే పుస్తకాల్ని ప్రచురించారు. 'Dance and Drama in Bali' అనే గ్రంథాన్ని 1930 సం॥లో డిజోట్ మరియు స్పైన్‌వాల్పరు ప్రచురించారు. ఎ.జి షరీఫ్ ఆంగ్ల సివిలియను జౌనపూర్‌లో జిల్లా మేజిస్ట్రేటు (1936) పండితరామనరేశ్ త్రిపాఠీగారితో పరిచయమేర్పడిన తర్వాత భోజపురీ జానపతగీతాలపై వీరి దృష్టిపడింది. ఈయన హిందీ 'Folk Songs' అనే పుస్తకాన్ని ముద్రించారు. డెక్సటరీ విలియమ్ 1938 సం॥లో 'Marathi Folk Tales' అనే పుస్తకాన్ని లండన్‌లో ప్రచురించారు. ఎల్విన్ వెరియరు 1944 సం॥లో 'Folk Tales of Mahakoshala' అనే పుస్తకాన్ని 1946 సం॥లో ప్రచురించారు. అదే సంవత్సరంలో ఎల్విన్ మరియు హైవెల్ అనేవారు 'Folk Songs of the Maichal Hills' అనే పుస్తకాన్ని వెలువరించారు.

ఎల్విన్ వెరియరు మధ్యప్రదేశ్‌లో ఆటవిక జాతుల మధ్య నివసించి వారి ఆచారవ్యవహారాల్ని కూలంకషంగా పరిశీలించారు. వీరి సలహా ప్రకారం జవహరలాల్ నెహ్రూ ఆదివాసుల సంస్కృతిని పరిరక్షించడానికి పూనుకున్నారు. ఈ విధంగా భారతీయ జానపద సంస్కృతిని పరిరక్షించిన పాశ్చాత్యులను ప్రస్తుతించారు. భారతీయ జానపదసేకరణలో వీరే ప్రథములుగా, ప్రముఖులుగా దర్శనమిస్తారు.

వారు మనం వదిలివేసిన పెన్నిధిని సేకరించి తర్వాతి తరాలకు అందించారు. వీరి శ్రమ, శ్రద్ధ గర్వించదగింది. పాశ్చాత్యుల ప్రోద్భలంతో భారతీయులు భారతీయ జానపద సాహిత్యాన్ని సేకరించడం ప్రారంభించారు. పలునోట్ల నానుతున్న సాహిత్యాన్ని పరిరక్షించు బాధ్యత నేడు మన భారతీయులపై పడింది. నాగరికత సన్నగిల్లుతున్న ఈ రోజుల్లో జానపద సాహిత్య సంపదను పరిరక్షించి భద్రపరచుట మనందరి ప్రధాన కర్తవ్యం.

పాశ్చాత్య వేషభాషల్ని మనం అనుకరిస్తున్నాం. వారి కఠోరదీక్షను, కార్యనిర్వహణ శక్తిజూచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సివుంది. భారత ప్రభుత్వాలు, రాష్ట్రప్రభుత్వాలు సహకరించిననాడు మనం జానపద సంపదను రక్షించుకోగలుగుతాం. లేనిచో వున్న సంపద, సంస్కృతి మరుగున పడిపోతాయి.

# ఫిడేల్ రాగాల పఠాభి

- నందన

(గత సంచిక తరువాయి)

"నాకు జీవితంలో రెండు ఇష్టాలున్నాయి. అవి నా ఎలిమెంటరీ స్కూలు రోజులనుంచీ నాతోనే వున్నాయి. అవి కవిత్వమూ, గణితశాస్త్రమూను. మొదటిది భావావేశానికి, రెండోది రీజన్‌కు ప్రతినిధులు. గణితంలోని అంతర్



క్రమశిక్షణ, కవిత్వంలోని క్రమశిక్షణారాహిత్యం నాకిష్టమైనవి. గణితంలోని పై నిజాన్ని శోధిస్తూపోతే నీకో నిజం కాని ప్రపంచం దర్శనమిస్తుంది."

"శూన్యాన్ని, పదార్థాన్ని అనంతమైన విభాగాలుగా చేయవచ్చునేది నాకర్థం కాని విచిత్రం. అది మనల్ని దేవుడు, శక్తి అనేవాటికన్నా ఉన్నతమైన నిజం వున్నదనే నమ్మకానికి నన్ను నడిపించింది. ఆ విధంగా హేతువు, హేతువు కాని దాన్నీ, హేతువుకానిది హేతువును నమ్మేట్టు చేసింది."

ప్రతి కాగితపు ముక్క వొదిలేసి కవర్లు, పాతపుస్తకాల మార్జిన్లు, వార్తాపత్రికలు, పాతబిల్లులు, కాలెండర్లు, కాగితపు సంచులు మొదలైనవన్నీ గణితశాస్త్రపు గీతలతో నిండిపోయాయి. ఫెర్మాట్ ఆఖరి థీరంకి సమాధానం కనుక్కునే ప్రయత్నం ఆయనకు మంచి సంతృప్తినిచ్చేది. సమయం దొరికినప్పుడల్లా దాని మీద పని చేస్తూండేవారు. ప్రతి మూడు నాలుగు సంవత్సరాలకోసారి ఫెర్మాట్ థీరంకి సమాధానం సాధించేశాననేవాడు. అందువల్ల రాబోయే ప్రైజ్‌మనీతో చేయబోయే ప్రయాణాన్ని ఊహించుకునేవాడు. మళ్ళీ కొన్ని వారాల తరువాత తన సమాధానంలో తప్పు దొర్లిందని తెలుసుకుని ఊహా ప్రపంచం నించి ఈ ప్రపంచంలోకి వొచ్చేవాడు. ఆయన చివరి రోజుల్లో కూడా డా॥ విజయ్ చందు అనే గణిత శాస్త్రవేత్తతో ఆ థీరం మీద చర్చించేవాడు.

పఠాభికి వ్యాపారమంటే అయిష్టం. అయిష్టంగానే తన కుటుంబ వ్యాపారమైన గూడూరు మైకా ఎగుమతిలోకి అడుగుపెట్టాడు. ఆ పనిలో గూడురు మద్రాసుల మధ్య తరచుగా తిరుగుతుండేవాడు. అతనికి వ్యాపారం ఏమాత్రమూ యిష్టం లేదు. అయితే అమెరికావెళ్ళే అవకాశం వొస్తుందన్న ఆశతో దానికి అంటిపెట్టుకుని వున్నాడు.

ఆ వ్యాపారపు పనిమీదే అమెరికా వెళ్ళాడు. కొలంబియా విశ్వవిద్యాలయంలో సాహిత్యంలో ఎమ్.ఏ. చేసేందుకు పేరు నమోదు చేసుకున్నాడు. అంతేగాక సినీమాటోగ్రఫీలో కోర్సు చేసేందుకు న్యూయార్కులోని 'మ్యూజియం ఆఫ్ మోడర్న్ ఆర్ట్'లో కూడ పేరు నమోదు చేసుకున్నాడు. తను చేసే వ్యాపారం ఏదైనా దానికి కవిత్వం, సాహిత్యం సినిమా పరిశ్రమతో సంబంధించినదై వుండాలని భావించాడు.

ఇండియాకి వొచ్చాక ఇష్టంలేని ఎన్నో వ్యాపారాల్లో వేలు పెట్టాడు. అవన్నీ విఫలమయ్యాయి. చివరికి సినిమా పరిశ్రమలో కుదురు కున్నాడు. ప్రెసిడెన్సీ కాలేజీలో చదివిన రోజుల్లో మద్రాసు విక్టోరియా హాస్టల్లో తన రూమ్‌మేట్ శ్రీ కె.వి.రెడ్డి తరువాతి రోజుల్లో అతను బాక్సాఫీస్ హిట్ సినిమాల దర్శకుడిగా, గుణసుందరి కథ, మాయబజారు సినిమాలతో ప్రసిద్ధుడయ్యాడు. కె.వి. రెడ్డి, మరో సహాధ్యాయి శ్రీ పి.ఎస్.

ఆంగ్లం నుంచి అనువాదం : బి.వి. రామిరెడ్డి : 9928856530

రెడ్డిలతో కలసి 'జయంతి పిక్చర్స్' స్థాపించాడు. కె.వి. రెడ్డి దానికి నిర్మాత, దర్శకుడు. పఠాభి అసోసియేట్ ప్రొడ్యూసర్, వారి మొదటి సినిమా పెళ్ళినాటి ప్రమాణాలు. ఇది రాష్ట్రపతి వెండిపతకాన్ని గెలుచుకుంది. రెండోది 'కృష్ణార్జున యుద్ధం' ఇదీ సూపర్ హిట్. మూడోది 'భాగ్యచక్రం' అట్టర్ ఫ్లాఫ్. దాంతో ఆ సంస్థ మూలపడింది.

పఠాభి తన ఆప్తమిత్రులతో సహా చాలామందిచేత మోసగించబడ్డాడు. డబ్బు విషయంలోనేగాక అతను సాధించుకున్న వేరే విషయాల్లోను ఇది జరిగింది. మోసగించబడ్డానని ఆయనకి తెలుసు. ఎప్పుడైనా మా అమ్మ ఇంట్లో ఈ విషయాన్నెత్తితే, "అతని అవసరం నా అవసరం కంటె ముఖ్యమయింది కావొచ్చు" అని ముగించే వాడు. కవిత్వం విషయంలోనూ అంతే. పఠాభి కన్నా ముందే అభ్యుదయ కవిత్వం వ్రాశామని కొందరు బుకాయించినా పట్టించుకునే వాడు కాదు. "సంస్కార" సినిమా విషయంలోను అదే జరిగింది. మాకు కోపం వచ్చేది.ఆయన మాత్రం మామూలుగా వాళ్ళ అవసరం నా అవసరంకన్నా ముఖ్యమయిందేమో అనేవాడు. మా అమ్మ విషయం లోను అదే జరిగింది. మద్రాసు నటుల 50 వసంతాల పండుగ సందర్భంగా వెలువరించిన బ్రోచర్‌లో ఆ నాటక సమాజానికి మా అమ్మ చేసిన సేవల్ని గురించి ఒక్క మాట కూడా వ్రాయలేదు!

పఠాభి ఎప్పుడూ వీటితో సంతృప్తి చెందలేదు. ఆయనకు ఫలితం కన్నా అతనిలోని సాహసం, ఉత్సాహం, ముఖ్యం. తప్పుల్ని క్షమించేవాడు. అత్యవసరాల్లో ఎదుటి వారికి సాయంచేసేవాడు. ఆయనకు పబ్లిసిటీ గిట్టదు. ఆయనకు గమ్యం కన్నా గమనమే యిష్టం. దీన్నించి ఆయన ఏ పాఠాలూ నేర్చుకోలేదు. "నేను జీవితం విషయంలో మంచి విద్యార్థిని కాదనుకుంటాను. ఇప్పటికీ నేను అవే పొరపాట్లు చేస్తూనే వున్నాను. ఎన్ని చేదు అనుభవాలున్నా నేను అందర్నీ నమ్ముతాను. ఈ వరం నాకు లభించినందుకు కృతజ్ఞతలు."

మేము ఆళ్వారుపేటలో పై అంతస్తులో ఉండేవాళ్ళం. నేను జన్మించాక ఇది మా ఆరో ఇల్లు. ఇల్లు మారడం మా జీవన విధానమయింది. మేం దానికి అలవాటు పడ్డాం. సామాన్లు మూటలు కట్టడం, క్రొత్త పెయింట్ వాసనలు, కొత్త యింటిని సర్దుకోవడం, పొరుగువాళ్ళని పరిచయం చేసుకోవడం, కొత్త పరిసరాల్ని అలవాటు చేసుకోవడం మాకు ఆనందంగా వుండేది. మా తల్లిదండ్రులు రాజకీయాల్లో లేరు. కాని, సోషలిస్టుపార్టీలో వారికి చాలామంది మిత్రులుండేవారు. డా॥లోహియా, మధులిమయె, బద్రివిశాల్‌పిట్టి, మురహరి, మృణాల్‌గోరె, మధుదండావతె మొదలైనవారు మాకు ఆత్మీయులు. అది రాజకీయాలకతీతమైన బంధం. కళ, సంగీతం మమ్మల్ని దగ్గరికి చేర్చాయి. 1967లో ఓ రోజు మా డిన్నర్ టేబుల్ దగ్గర గోపాల్‌గౌడ "సంస్కార" కథను డా॥లోహియా, మధులిమయేకు వినిపించారు. నేను అవాక్కయాను. ఆ నవలను యు.ఆర్. అనంతమూర్తి అనే లోహియా అభిమాని వ్రాశారని చెప్పారు. అమ్మ నాన్న యిద్దరు ఆ కథవిని తన్మయులయ్యారు.

నవలా నాయకుడు ప్రాణేశాచార్యుల మనసులోని ధర్మ సందేహం వారిని బాగా ఆలోచింపజేసింది. ఆ నవల సమాజంలో, సాంప్రదాయంలో పాతుకుని వున్న కుహనా విలువల్ని ప్రశ్నించింది. అవి కులతత్వాన్ని ప్రశ్నించిన తీరు సాహసవంతం, అపూర్వం. పఠాభి తన సినిమాగా ఆ నవలను మలుచుకోవాలని నిశ్చయించాడు. డా॥లోహియా నాన్నను ప్రోత్సహించారు. తాను సినీ నిర్మాతగా మారిన కవినని పఠాభి ఎప్పుడూ చెప్పు కునేవాడు. సాహిత్యమే మా నాన్నను సినిమా ప్రపంచంలోకి నడిపించింది. ఆ క్రమంలోనే అనంతమూర్తి నవలను సినిమాగా తీయాలని నాన్న సంకల్పించాడు. తమ కలను నిజం చేసుకోవడానికి మా అమ్మ నాన్నలకు నాలుగేళ్ళు పట్టింది. ఈలోపున మేము ఖాదర్ నవాజ్‌ఖాన్ రోడ్డు, నుంగం బాకంకి ఇల్లు మారాం. మా అమ్మ సహకారంతో ఆవిర్భవించిన మద్రాసు నాటక సమాజం మంచి ఊపులో వుంది. అందులో కర్ణాటకకు చెందిన మంచి కళా కారులున్నారు. వారిలో ఆక్సుఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్సుకు పనిచేస్తున్న క్రొత్త కుర్రాడు నాటక రచయిత గిరీష్ కర్నాడ్ ముఖ్యుడు. అనంతమూర్తి నవల కన్నడ రూపాన్ని నాన్న అతనికి వినిపించాడు. దాన్ని అతను నాటకీకరించారు. దాని ఆంగ్లరూపం 1976లో వొచ్చింది. ఆ నవలను ముందుగా నాటకీకరించాలి. ఆ తరువాత నాన్న స్క్రిప్టు వ్రాయాలి. సాహిత్యం, సినిమా రెండు మాధ్యమాలు.

నాన్న అనేవారు–సినిమాని కళ్ళతో చూస్తాం. సాహిత్యాన్ని మనసుతో చూస్తాం. రెంటికి మధ్య తేడా కన్నుతో చూడ్డం, మనసుతో చూడ్డం. నాటకం సినిమాకన్నా స్థిరమైనది. నాటకం సినిమాకి, సాహిత్యానికి మధ్య వుంటుంది. వీటిలో



పఠాభి, స్నేహలత

విజయం సాధించాలంటే ప్రత్యేకమైన అవగాహన అవసరం. అందుచేతనే, ఎక్కడో తప్ప నవలా రచయితలు, నాటక రచయితలు గొప్ప సినిమాల్ని నిర్మించలేరు. పఠాభి స్క్రీన్‌ప్లే బాగా వ్రాసేవాడు. ప్రతి షాట్‌నీ కాగితం మీద సృజించేవాడు. ప్రతి కట్, ప్రతిమార్పు, ప్రతి దృశ్యం ముందే తయారుచేసి వుంచుకునేవాడు. నవలలో మార్పులు చేర్పులు చేసేవాడు. 'సంస్కార'లో నారాయణప్ప శవానికి 'దహనం చెయ్యడమా? చెయ్యక పోవడమా?' అనే సమస్యతో ప్రారంభమౌతుంది. సినిమాలో ఆ సమస్యకు పరిష్కారం చివర్లో చూపించ బడుతుంది. ప్రాణేశాచార్యులు గ్రామానికి తిరిగొచ్చి దహనక్రియకు సిద్ధపడడంతో ముగుస్తుంది. నవలలో ప్రాణేశాచార్యులు బాగా ముసలివాడు. అందుచేతనే సరైన నిర్ణయం తీసుకోలేక డోలాయ మానుడౌతాడు. సినిమాలో పుట్టడికి తన మనసును విప్పడం ద్వారా అతని వ్యక్తిత్వం ఇనుమడిస్తుంది. అలాగ నాయకుడిగా గుర్తించబడతాడు. గిరీష్ కర్నాడ్‌ని ప్రాణేశాచార్యుల పాత్రకు ఎంచుకోవడంలోనే అతణ్ణి నాయకుడిగా చిత్రించేందుకు రంగం సిద్ధం చేయబడింది. మొదట్లో గిరీష్ కేవలం స్క్రిప్టు వ్రాయడానికి మాత్రమే వొప్పుకున్నాడు. ప్రాణేశాచార్యుల పాత్రను ధరించడానికి అతనొప్పుకోలేదు. కారణం ప్రాణేశాచార్యులు బాగా ముసలివాడు. అతనికి ఎంతగానో చెప్పి వొప్పించవలసి వచ్చింది. అతనెంత గొప్పగా నటించాడో! సంస్కార నవలలో ఎన్నో అంతర్మథ నాలున్నాయి. సరైన నిర్ణయం తీసు కోవడానికి ప్రాణేశాచార్యులుపడ్డ మానసిక క్షోభను సినిమాలో చూపించడం కష్టతరం. నవల చర్చిస్తుంది. సినిమా వర్ణిస్తుంది. ఈ సమన్వయం ప్రాణేశాచార్యులు పుట్టణ్ణి కలుసుకోవడం. ఆ తరువాత నిత్యజీవితంలోకి ఆయన్ని తీసుకురావడం ద్వారా పరిష్కరించడం జరిగింది. అందుకోసమే చచ్చిన పాము దృశ్యం ప్రవేశ పెట్టబడింది. ఆ పామును పుట్టడు దహనం చెయ్యడం ప్రతీకాత్మకం. బ్రాహ్మణులు, పాములు ద్విజులు, అంటే రెండుసార్లు జన్మించేవారు. ఇది నవలలో లేదు.

ఒక మాధ్యమాన్ని మరొక మాధ్యమం లోకి మార్చిన మరెన్నో ఉదాహరణలున్నాయి. చంద్రి, ప్రాణేశా చార్యులు, పక్షి ప్రతీక, ప్లేగువ్యాధి వ్యాపించిన శూద్రుల గుడిసెల్ని తగలబెట్టడం వంటివన్నీ అలాంటివే. మా నాన్న సెప్టెంబరు 24-26 1992 తన "ఇంటర్నేషనల్ సెమినార్ అనే ఇండియన్ లిటరేచర్ అండ్ ఫిల్మ్స్" అన్న అంశం మీద ఈ వివరాల్ని వ్రాశారు. మరెన్నో సమస్యల్ని పరిష్కరించు కోవలసి వచ్చింది. మా నాన్న డబ్బంతా పోగొట్టుకున్నారు. సినిమా తీసి డబ్బు సంపాయించాలనే ఆలోచన ఆయనకు లేదు. సినిమా తీయడమే ఆయన ధ్యేయం. ఆయన వ్రాశారు – "నేను చాలా రకాల వ్యాపారాలు చేసి నష్టపడ్డాను. ఆ రంగంలో నేను సాధించింది శూన్యం. అందుకే ఆ రంగాన్ని పూర్తిగా వొదిలేశాను. ఆ రంగంలో ధన సంపాదన ప్రయత్నం వృధా ప్రయాస అని గ్రహించాను. దాన్ని ప్రక్కన పెట్టాక నా పరిస్థితులు మెరుగుపడ్డాయి."

ఈ సినిమాను లక్షరూపాయల్లో పూర్తి చేయాలని పఠాభి నిర్ణయించుకున్నాడు. ఆ మొత్తం కన్నడ సినిమాకు కర్ణాటక ప్రభుత్వం యిచ్చే సబ్సిడీ. అందుకే ఆ సినిమాను తక్కువ సమయంలో పూర్తి చేయవలసి వచ్చింది. తక్కువ షాట్లతో దాన్ని పూర్తి చేయడం తప్పని సరి అయింది. మా నాన్న ఈ సినిమాను లొకేషన్లలో షూట్ చేయాలని నిర్ణయించారు. సినిమా సహజంగా వుండాలని, అందుచేత దాన్ని చేతికెమెరాతో, డాక్యుమెంటరీ పద్ధతిలో తీయాలనీ నిర్ణయించారు. సెట్స్ వేసి సినిమా తీయడం ఖర్చుతో కూడినపని. అదృష్టవశాత్తు మా కళాదర్శకుడు వాసుదేవ్‌కి చోళమండల్ బీచిలో బాధపడుతున్న ఓ వ్యక్తి దొరికాడు. అతనే టామ్ కోవన్. అతనొక ఛాయాగ్రాహకుడు. అమ్మ అతనికి మందులిచ్చి, భోజనం పెట్టి ఆరోగ్యవంతుణ్ణి చేసింది. అతని దగ్గర అతను తీసిన దృశ్యాలను నాన్న చూశాడు.

వాళ్ళిద్దరు డైనింగ్ టేబుల్ దగ్గర గంటల తరబడి షూటింగ్ స్క్రిప్టుని గురించి చర్చించుకునేవాళ్ళు. ఈ సినిమాకోసం అమ్మ, నాన్న తమకున్న విలువగల వస్తువులన్నింటిని అమ్మివేశారు. నేను, తమ్ముడు బెంగుళూరులోని అమ్మమ్మ గారింటికి వెళ్ళిపోయాము. నేను ఫైనల్ పరీక్షకు చదవవలసి వుంది. ఆ సినిమాకోసం 'కోప్ప' దగ్గరవున్న అనువైన ప్రదేశాలను గుర్తించారు. షూటింగ్ డేట్స్ నిర్ణయించబడ్డాయి. తక్కువ ఫిల్మ్‌తో ముప్పై రెండు  రోజుల్లో షూటింగ్ పూర్తి చేయాలి. మద్రాసు నాటక సమాజ నటుల్ని, కర్నాటక నాటక సమాజపు నటుల్ని, నిజమైన బ్రాహ్మల్ని అందులో వినియోగించు కున్నారు. ఇది అతి తక్కువ బడ్జెట్ సినిమా. లొకేషన్లో ఎన్నో ఒత్తిళ్ళుండేవి. సినిమా నిర్మాణ వృత్తిలో వున్నారు–మా నాన్న, టామ్ కోవన్ , సింగీతం శ్రీనివాసరావు అనే జయంతి పిక్చర్ అసిస్టెంట్, నవలను బాగా ఎరిగిన కన్నడిగులుండే వారు. గిరీష్ నటులందర్నీ గంటలకొద్దీ రిహార్సల్స్ చేయించేవాడు. ఆలస్యం అవుతుందని నాన్న వీటిని ఆపు చేయించాడు. అందువల్ల నాన్న తమమీద అధికారం చెలాయిస్తున్నాడని గిరీష్, అతని మిత్రులు భావించారు. ఎన్నో కష్టాల తరువాత షూటింగ్ పూర్తయింది. తరువాత మెట్టు ఎడిటింగ్, టామ్ ఆస్ట్రేలియాకు చెందిన యువ సృజనాత్మక ఎడిటర్ని గుర్తించాడు. అతని పేరు స్టీవెన్ కార్ట్యూ. ఎడిటింగ్ పూర్తిచేసి, మొదటిసారి మద్రాసులో మా కంపెనీ కోసం సినిమాని ప్రదర్శించారు. దానికి గొప్ప రెస్పాన్స్ రాలేదు. గిరీష్‌కి మరికొందరికి మా నాన్న అంతా గందరగోళం చేసేశాడనిపించింది. ఆ నిర్మాణం నుంచి బయటికి వెళ్ళి పోవాలని నిర్ణయించుకుని, సినిమాలో తమపేర్లు తీసివేయమని అడిగారు. మా అమ్మకు కోపం వచ్చింది. మా నాన్న మౌనంవహించాడు. అంతా చక్కబడుతుందని అమ్మకు భరోసా యిచ్చాడు. ఆయనకు తన పనిమీద నమ్మకం వుంది. అప్పటికి డబ్బంతా అయిపోయింది. ఇల్లు ఖాళీచేసి మద్రాసు కాస్మో పాలిటన్ క్లబ్బులో నివసించడం ప్రారంభించాం. బెంగుళూరులో మా తాత, అమ్మమ్మల దగ్గర నివసించేందుకు నిర్ణయించాం. అక్కడే డా॥ రాజీవ్ తారానాథ్ సంస్కార సినిమాకు మరుపురాని సంగీతాన్ని సమకూర్చారు.

**లొకేషన్లో ఎన్నో ఒత్తిళ్ళుండేవి. సినిమా నిర్మాణ వృత్తిలో వున్నారు. మా నాన్న, టామ్ కోవన్ , సింగీతం శ్రీనివాసరావు అనే జయంతి పిక్చర్ అసిస్టెంట్, నవలను బాగా ఎరిగిన కన్నడిగులుండే వారు. గిరీష్ నటులందర్నీ గంటలకొద్దీ రిహార్సల్స్ చేయించేవాడు. ఆలస్యం అవుతుందని నాన్న వీటిని ఆపుచేయించాడు.**

అవి చిత్రమైన రోజులు. ఆ పాత బంగళా టెర్రెస్ మీద ఓ జంపఖానా పరుచుకు కూచుని, తన సరోద్ వాయిద్యంతో ఆసీనుడై రాజీవ్ వెన్నెల రాత్రిలో ఎన్నో రాగాలు వినే భాగ్యం కలిగించాడు. మా తమ్ముడు వికసిస్తున్న సంగీత కళాకారుడు – లీనమై వినేవాడు. భైరవి రాగాలాపన జరుగుతుండగా నిద్రలోకి జారిపోయేవాళ్ళం. రాజీవ్ మానసికంగా మమ్మల్ని ఆరోగ్యవంతుల్ని చేశాడు. సంస్కార సౌందర్యానికి అతను కొత్త నమ్మకాన్నిచ్చాడు. సినిమా సిద్ధమయింది. ఎ.కె.రామానుజం ఒకప్రయివేటు ప్రదర్శనలో ఆ సినిమాని చూశారు. "సంస్కార"ని చూశాక ఆనందంతో వీధుల్లో డాన్స్ చేయ్యాలని పించింది అన్నారు. దీనితో అందరి దృష్టి మారడం ప్రారంభమయింది. తమ పేర్లు సినిమాలో చూపితేనే బావుంటుందనే దశకు వచ్చారు.

అచ్చయ్యాక 'సంస్కార' పుస్తకం ఎన్నో విమర్శల నెదుర్కున్నది. సినిమా విడుదల కాకముందేఅది నిషేధింప బడింది. మద్రాసు సెన్సార్‌బోర్డు దాన్ని నిషేధించగా సెంట్రల్‌బోర్డు దాన్ని సమర్థించింది. మా సినిమాను సమర్థించుకునే అవకాశం కూడా మాకివ్వలేదు. దేశమంతటా ఎందరో ప్రసిద్ధులు సినిమాకు అండగానిలిచారు. అప్పటి కేంద్ర సమాచారశాఖామాత్యులు శ్రీ ఐ.కె.గుజ్రాల్‌గారికి మా సినిమా నచ్చింది. ఆయన నిషేధాన్ని తొలిగించారు. సగం రోజంతా లోకసభలో మా సినిమా మీదే చర్చ జరిగింది. విడుదల చేయడానికి మరికొన్ని ఇబ్బందులెదురయ్యాయి. కొందరు ఆ సినిమాను ప్రదర్శిస్తే ఆ సినిమాథియేటర్లని తగలబెడతామని హెచ్చరించారు. కోర్టు ఈ సినిమా మీద చర్యతీసుకోబోతుందని రూమర్లొచ్చాయి. కోర్టు సినిమా ప్రదర్శనను నిషేధించ బోతుందని చెప్పుకున్నారు. ఇవన్నీ మా సినిమాకు మృత్యుఘంటికలే. అదృష్టవశాత్తు అవేవీ జరగలేదు. సినిమావిడుదలై విమర్శాపరంగాను, వ్యాపారపరంగాను అఖండ విజయాన్ని సాధించింది. సంస్కార నవల ప్రచురించినపుడు భయంకరమైన విమర్శల నెదుర్కుంది. సినిమా విడుదలతో అవన్నీ మూతబడ్డాయి. అదీ సంస్కార

సినిమాగొప్పదనం. మేం అప్పటికి కాస్మోపాలిటన్ క్లబ్బులోనే నివసిస్తున్నాం. 1970లో సంస్కార విడుదలయిన తరువాత సెయింట్ మార్క్స్ రోడ్డు యింటికి మారాం. సినిమా విడుదల రోజున థియేటర్ ముందు జనసముద్రం. ఆ సినిమాలో నాయకుడు ప్రాణేశాచార్యులు పాత్రను గిరీష్‌కర్నాడ్, నాయిక చంద్రి పాత్రను మా అమ్మ చేశారు. జనం వాళ్ళని చుట్టుముట్టేవారు. వాళ్ళని సూపర్‌స్టార్స్‌ని చేశారు. టిక్కెట్లు మొత్తం అమ్ముడైపోయేవి. సినిమా డిస్ట్రిబ్యూటర్ సురేంద్రనాథ్ బెనర్జీ చాల సంతోషించారు. ఆయన మా టెర్రెస్ మీద మాకందరికీ పార్టీ యిచ్చారు. తరువాత తెలిసింది ఆ బిల్లు మామీదే వేశాడని!

పత్రికలు, అంతర్జాతీయ విమర్శకులు అత్యంత ఉత్తేజంగా మా సినిమా గురించి మాట్లాడారు. 'సంస్కార' జాతీయ బంగారు పతకాన్ని సాధించింది. అది 'లొకర్నా'లో కాంస్యపతకంతో బాటు ఎన్నో అంతర్జాతీయ అవార్డులు గెలుచుకుంది. కన్నడ సినిమాకు చరిత్రను సృష్టించిన మొదటి సినిమా అది. "పఠాభి చేతిలో నిర్వచనాలు కొత్త అర్థాల్ని సంతరించుకున్నాయి. ఆయన సినిమాలు జ్ఞానేంద్రియాలకు ఛాలెంజీ విసరడమే కాదు, కళకు ప్రాణం పోశాయి. నేటి సినిమా నిర్మాతల్లా కాకుండా అతని సృజనలు భ్రమకు, నిజానికి మధ్య దూరాన్ని చెరిపేశాయి" అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వ్రాసింది. "సంస్కార" గొప్పసినిమా. సాదాసీదాగా చేదునిజాన్ని చిత్రించి పవిత్రమైంది. దీని ప్రభావం, నిజాయితీ తిరుగు లేనివి. ఆధునిక సినిమాల్లో ఆణిముత్యం" అన్నారు మృణాల్‌సేన్. ఆ సినిమా విడుదలై నలభై ఐదు ఏళ్ళయింది. దానిమీద యిప్పటికీ చర్చ నడుస్తూనేవుంది. మా నాన్నగారి సినిమా గొప్పదనంలో తమదే ప్రధానపాత్ర అంటున్న వాళ్ళూ గొప్పసినిమాలు తీసినవాళ్ళే. అయినప్పటికీ సంస్కార ప్రత్యేకత అందరికీ ఆశ్చర్యకరం. బహుశా ఆ సినిమాలో బ్రాహ్మలు ఎదుర్కున్న, ఎదుర్కొంటున్న, గొప్ప సందేహమే అందుకు మూలంకావచ్చు. ఆ బ్రాహ్మలు దహన సంస్కారం గురించి పడ్డ ధర్మ సందేహం లాంటిదే పఠాభికి ఆ సినిమా గొప్పదనాన్ని దక్కనీయాలా, వద్దా అనేది. మా నాన్న ఇలాంటి వాటికెన్నిటికో అలవాటు పడిపోయారు. సంవత్సరాలుగా గిరీష్‌కర్నాడ్ ఆ సినిమా గొప్పదనమంతా తనదేనని చేస్తున్న వాదనకు సమాధానాన్నిచ్చే ప్రయత్నం కూడా మానాన్న చేయలేదు. ఆయన ఓ చిర్నవ్వుతో "నా కన్నా అతని అవసరమే గొప్పది కావచ్చు" అంటుంటారు. మా నాన్న తరువాత సినిమా "చండమారుత!" ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించకముందే ఆ పరిస్థితుల్ని గురించి జోస్యం చెప్పిన సినిమా.

**'సంస్కార' గొప్పసినిమా. సాదాసీదాగా చేదునిజాన్ని చిత్రించి పవిత్రమైంది. దీని ప్రభావం, నిజాయితీ తిరుగు లేనివి. "ఆధునిక సినిమాల్లో ఆణిముత్యం" అన్నారు మృణాల్‌సేన్. ఆ సినిమా విడుదలై నలభై ఐదు ఏళ్ళయింది. దానిమీద యిప్పటికీ చర్చ నడుస్తూనే వుంది. మా నాన్నగారి సినిమా గొప్పదనంలో తమదే ప్రధానపాత్ర అంటున్న వారూ వాళ్ళూ గొప్పసినిమాలు తీసినవాళ్ళే. అయినప్పటికీ సంస్కార ప్రత్యేకత అందరికీ ఆశ్చర్యకరము.**

ఇది మరొక ప్రయోగాత్మక చిత్రం. ఆ సినిమా షూటింగ్ ఆఖరిరోజే ఎమర్జెన్సీకి మొదటి రోజు దీన్ని కూడా టామ్ కోవన్ చిత్రీకరించాడు. దీనికి గౌరీశంకర్ ఛాయాగ్రాహకుడు. ఇందులో ప్రధాన పాత్రను మూలా భక్తవత్సలం పోషించారు. మా అమ్మ నాయిక పాత్రను పోషించింది. అశోక్ మందన్న రెండో ప్రధాన పురుషపాత్ర. హులి చంద్రు సహదర్శకుడు. ఈ సినిమా కూడ ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంది. ఎమర్జెన్సీలో పోలీసులు ఆఫిల్ముని తీసుకెళ్ళి అజాగ్రత్తగా పడేశారు. అది మళ్ళీమాకు చేరేసరికి అంతా శిథిలావస్థలోవుంది. అది మా జీవితంలో అతిభయంకరమైన సమయం. మా అమ్మను జైల్లో ఉంచారు. మా తమ్ముడు బోస్టన్‌లోని సంగీతకళాశాలలో చదువుకునేందుకు అమెరికా వెళ్ళాడు. వెళ్ళమని మా అమ్మ ఒత్తిడి చేసింది. వాడు జైల్లో ఉన్న మా అమ్మ దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు. వాళ్ళిద్దరికీ అదే ఆఖరి కలయిక అని తెలుసు. ఎమర్జెన్సీ ఎత్తివేయకముందే ఆమె చనిపోయింది. ఆ మరురోజే మానాన్న ఆమెకు పెరోల్ తీసుకునేందుకు నెల్లూరులోవున్న భూమిని అమ్మేందుకు వెళ్ళాడు.

అంతర్జాతీయ చలనచిత్ర ప్రదర్శనలో పాల్గొనే నెపంతో నేను ఢిల్లీలోవున్నాను. నిజానికి నేనక్కడ అమ్మను జైలు నుండి విడుదల చేయించే ప్రయత్నాల్లో ఉన్నాను. ఆ తరువాత రోజునే తిరిగొచ్చాను. తమ్ముడు అమెరికాలోనే వున్నాడు.

తనను ప్రేమించిన వారు, మిత్రుల మధ్య ఆమె మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోయింది. నా కజిన్ డా॥ విజయారెడ్డి, మా ఆప్తమిత్రులు దీపధనరాజ్, డా॥ జార్జి వర్గీస్ ఆ సమయంలో అక్కడే వున్నారు. నేను ఇంటికొచ్చాను. గేటుదగ్గర నాన్న నన్ను కలుసుకున్నాడు. నన్ను నెమ్మదిగా లోపలికి నడిపించుకువెళ్ళి దగ్గరికి తీసుకుని ఓదార్చాడు. “చూడు, అమ్మ ఎంత ప్రశాంతంగా వుందో. ఆమె ఎంత అందంగా వుందో చూడు. ఆమె చెంపల్ని స్పృశించు. ఆమె చర్మం ఎంత చల్లగా వుందోచూడు” అన్నారు. ఆయనకిది భయంకరమైన దెబ్బ. ఆయన తన జీవితభాగ స్వామిని, సహచరిని, సహరహస్యోద్యమకారిణిని, తనకత్యంత ప్రియమైన వ్యక్తిని కోల్పోయాడు.

అయినప్పటికి ఆయన నన్ను ఓదార్చాడు. చివరికంటా ఆయన అమ్మతోబాటు మమ్మల్ని జాగ్రత్తగా పెంచి పెద్ద చేశారు. తన సినిమా పూర్తయ్యాక ఆదీ నిషేధింప బడింది. రావెల సోమయ్య అనే మిత్రుడికి ఆయన వ్రాశారు– “నందన, నేను సెన్సార్ బోర్డును కలిసేందుకు బొంబాయి వెళ్ళాము. చివరికి వాళ్ళు, మా సినిమాను నిషేధించారు. ఎంత హాస్యాస్పదం!

**రావెల సోమయ్య అనే మిత్రుడికి ఆయన వ్రాశారు – “నందన, నేను సెన్సార్ బోర్డును కలిసేందుకు బొంబాయి వెళ్ళాము. చివరికి వాళ్ళు, మా సినిమాను నిషేధించారు. ఎంత హాస్యాస్పదం! “ఇదివరకు కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో హింసకు లోనయ్యాము. ప్రస్తుతం జనతా ప్రభుత్వంలోను నాకు అదే హింస తప్పలేదు. జనతావాళ్ళు స్నేహలత మృత్యువును ఎలక్షన్ ప్రచారానికి ఉపయోగించు కున్నారు. ప్రస్తుతం ఆమె అభిప్రాయాలతో రూపొందించిన సినిమాను నిషేధించారు.”**

“ఇదివరకు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో హింసకు లోనయ్యాము. ప్రస్తుతం జనతా ప్రభుత్వంలోను నాకు అదే హింస తప్పలేదు. జనతావాళ్ళు స్నేహలత మృత్యువును ఎలక్షన్ ప్రచారానికి ఉపయోగించుకున్నారు. కానీ ఆమె అభిప్రాయాలతో రూపొందించిన సినిమాను నిషేధించారు.” ఇది మాకు మరింత క్రూరమైన దెబ్బ. ఇప్పుడు ‘చండమారుత’ నిషేధాన్ని గురించి ఢిల్లీలో పోరాడాలి. మా అమ్మ జైల్లోవుండగనే మానాన్న ‘శృంగారమాస’ అనే సినిమా తీయడం ప్రారంభించారు. అది ప్రేమ–రాజీపడ్డానికి సంబంధించిన కథ. ఒక స్త్రీ పురుషులజంట తమ జీవన ప్రయాణంలో తమ మధ్య బంధాన్ని ఆరు ఋతువుల్లో తెంచుకుని, పునర్నిర్మించుకోవడం. ఇది స్త్రీకి సంబంధించిన ప్రేమ. ఇది మా అమ్మకు మానాన్న యిచ్చుకున్న బహుమతి. ఆమెకు వ్రాసిన ప్రేమ కవిత. ఆ ప్రేమ కథా నిర్మాణంలో వాళ్ళిద్దరూ పాలుపంచుకున్నారు. ఆమె జైల్లో ఉంది. ఆయన బైట వున్నారు. అయినా వాళ్ళిద్దరూ ఏకత్వంతో పనిచేశారు. వారానికొక్కసారి మాత్రమే ఆమెను చూసేందుకు అనుమతి వుండేది. మా అమ్మ ఆరోగ్యం క్షీణిస్తోంది. ఆమెకు అవసరమైన వైద్యం అందలేదు. అందువల్ల ‘శృంగారమాస’ గురించి స్నేహలత జైలు నుంచే పఠాభికి ఎంతో సవివరమైన నోట్సు వ్రాసింది. వాటిలో ఒకటి “నిశ్శబ్దం అత్యంత మొద్దు బారిన పనికిరాని పనిముట్టు. అది నిన్ను భూమిలోతుల్లోకి దిగగొడుతుంది. అది నీలోలోపలి అపరాధ భావపు అగాథాల్లోకి తీసుకెడుతుంది. నీలోలోపలి శబ్దాల్ని అది తప్పు పడుతుంది. బాహ్య విమర్శకంటె అది విషపూరితమైంది.”

నాయిక దీపధనరాజ యొక్క శీతాకాలపు మౌనభావాన్ని సృజించ డానికిది ఉపయోగ పడుతుంది. ప్రతి భావమూ, రుతువుల్ని బట్టి వైవిధ్యమైనది. అయినప్పటికి మొత్తాన్ని కలిపి వుంచుతుంది. ఏ భావమూ సినిమా నుండి విడదీయ బడలేదు. ఎప్పుడూ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అనుభూతి చెందడాన్ని గుర్తుంచుకో –ముక్కలు చెక్కలుగా కాదు. “ప్రేమ ఇద్దరి మధ్య అంగీకారమైనప్పుడు అదొక డ్రామా. అలాకానప్పుడు అదొక గీతం. శరీరాలు కలవలేనపుడు హృదయాలు ఐక్యమవ్వాలి.” మళ్ళీ రాజీవ్ తారానాథ్ దివ్య సంగీతం. ఈ సినిమా కవితాత్మక చిత్రం. ఇందులో రెండే పాత్రలు. ఋతువులు అతి ముఖ్యమైన భూమికను పోషిస్తాయి. స్త్రీ పురుష బంధంలోని సున్నితమైన, లోతైన, గూఢమైన, ఎడాన్ని గుర్తించలేని, చెప్పుకోలేని విషయాలను ఈ సినిమా వ్యక్తీకరిస్తుంది. ఇది ‘జెండర్’ సెన్సిటివ్ సినిమా.’ అది స్వేచ్ఛను, సమానతా నీతిసూత్రాల్ని, వాటి అంతరంగిక బంధాలను విశదపరుస్తుంది. ఈ సినిమా మా నాన్నకు ప్రేమ, కామానికి సంబంధించిన ఆయన నమ్మకాలను విశదీకరిస్తుంది.

*(ఆగష్టు నెల 35 వ పుటలో ఉన్న చిత్రం కీర్తన (పఠాభి కోడలు))*

*చివరిభాగం వచ్చే సంచికలో....*

# వినయశీల మల్లెమాల



యం.ఎస్. రెడ్డి

నేను రెండు విధాలుగా అదృష్టవంతుణ్ణి! ఒకటి: పిత్రార్జితమైన ఆస్తిపాస్తులకు వారసుణ్ణి కాకపోవటం. రెండు: బహుముఖాలుగా వికసించిన మానవమేధకు వారసుణ్ణి కావడం.

ఇక నా గురించి చెప్పాలంటే, చెప్పుకోదగ్గ సాహిత్య నేపథ్యమేం లేదు. చెప్పుకోదగిన ఏమిటి! అసల్లేదు. కారణం మాది ఒక మారుమూల గ్రామం నెల్లూరు జిల్లాలో. పేరు అలిమిలి. నెల్లూరు అంటే మీ అందరికి తెలుసు. కవి తిక్కననూ, ఖడ్గతిక్కననూ కనిపెంచిన పట్టణం. ఆ జిల్లాలో నేనూ పుట్టినానన్న దొక్కటే నా ప్రత్యేకత. అంతకు మించి మరేం లేదు.

'గోవులేని వూళ్ళో గొడ్డు గేదే శివాలక్ష్మి' అన్నట్లుగా ఆ వూళ్ళో మాదే మోతుబరి కుటుంబం. మా నాన్నగారి పేరు రామస్వామిరెడ్డి, అమ్మ రంగమ్మ.

ఇద్దరూ శ్రమజీవులే. మా నాన్నకు వ్యవసాయం అంటే ప్రాణం. పేదా సాదా అంటే వల్లమాలిన అభిమానం. ఊళ్లో ఏ ఒక్కరూ పస్తుండగూడదనేది ఆయన సిద్ధాంతం. అంతేకాదు. పొరుగూరు నుంచి ఎవరొచ్చినా మా ఇంట్లోనే ఆతిథ్యం. అందుకోసం ఆదాయానికి మించి అప్పులైనాయి. ఆ అప్పులు చివరకు ఆస్తిమొత్తాన్ని హరించాయి. అప్పటికి నాకు పదహారేళ్ళు. ఆప్తులు కూడా అపరిచితుల్లాగా ప్రవర్తించసాగారు. ఆ కారణంగా సింహసదృశుడైన మా నాన్న గారి ధైర్యం పూర్తిగా సన్నగిల్లింది. అయినా ఆయనలో నిజాయితీ మాత్రం చెక్కు చెదరలేదు. ఆ నిజాయితీయే నన్నొక మనిషిగా తీర్చిదిద్దింది. నా చదువు గురించి ఏదో చెప్పాలనుకుని ఎక్కడికో వెళ్ళిపోయాను. మన్నించండి.

నేను రెండేళ్ళ వయసులో ఉండగా ఎవడో ఒక మాల దాసరి నా చెయ్యి చూచి, ఈ అబ్బాయి మూలంగా మీ కుటుంబం పేరు దేశంలో నిల్చిపోతుందమ్మా, బాగా చదివించండి అన్నాట్ట. ఆ జోస్యాన్ని గుడ్డిగా నమ్మిందా పిచ్చితల్లి. అప్పటినుంచీ నాకు అయిదో ఏడు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసింది.

ఆ మంచిరోజు రానే వచ్చింది. అక్షరాభ్యాసం చేయించాలంటే మా వూళ్ళో నాలుగు గోడలైనా వుండే బడుంటేగా! మా వూళ్ళోనే కాదు, ఆ రోజుల్లో మా చుట్టుపక్కల పది పన్నెండు ఊళ్ళలో కూడా బడి వుండేది కాదు. బడి మాట దేవుడెరుగు. కాస్త అక్షరజ్ఞానం వున్న అయ్యవారైనా లేదు. ఒక ఆలయపూజారి మాత్రం నాలుగక్షరమ్ముక్కలు తెలిసినవాడు. ఆయన బ్రహ్మచారి. అప్పటికే వయసు అరవై దాటింది. మా అమ్మకు ఆయన గుర్తొచ్చాడు. నా అక్షరాభ్యాసం ఆయన చేత చేయించింది. ఆయన నన్ను బిడ్డలా చూసేవాడు. ఆరు నెలల్లో గుణింతం వరకూ నేర్పాడు. అంతలో నా దురదృష్టం వల్ల ఆయన అర్థాంతరంగా చనిపోయాడు. కానీ నా చదువుపట్ల మా అమ్మ చూపే శ్రద్ధవల్ల అయితేనేం, నా చేత అక్షరాలు దిద్దించిన పంతులుగారు "ఒరే సుందరం! నాది వానాకాలపు చదువురా! నాకు తెలిసింది ఇప్పటికి చాలమటుకు నీకు చెప్పాను. ఒక్కసారి చెప్తే గ్రహించే బుద్ధి నీకు పుట్టుకతోనే అబ్బింది. నవ్వు చాలా గొప్పవాడివి అవుతావు" అని ఉత్సాహపరచడం వల్లనయితేనేం నాకు

చదువుపట్ల ఆసక్తి మరింత పెరిగింది. కానీ ఆయన కన్ను మూయడంతో నా చదువు గుణింతాల దగ్గరే ఆగిపోయింది. అప్పట్నుంచీ మా అమ్మ నా చదువు విషయంలో రోజూ మా నాన్నతో పోరు పెట్టేది. కానీ ఆయన "మనం భూమిని నమ్ముకున్న వాళ్ళం. అదే యింత అన్నం పెడుతుంది. పోనీ నీ పోరు పడలేక చదివిద్దామంటే ఊళ్ళో బడివుంటేగా" అని ఎప్పటికప్పుడు దాటేసేవారు. ఆ దాటవేత నా ఏడో ఏట వరకు సాగింది. మధ్యమధ్యలో నేనూ చదువుకోవాలి, చదువుకోవాలి అని ఏడ్చేవాడ్ని. ఏమయితేనేం నా అదృష్టం కొద్దీ మా నాన్న ఒక భట్రాజుని వెతికి పట్టుకున్నాడు. ఆయన భారత భాగవతాలు క్షుణ్ణంగా చదువుకున్న వాడు. భోజనం పెట్టి నెలకు 12రూ.లు జీతం ఇచ్చే ఒప్పందం మీద నేను గాక, మరో పది, పన్నెండు మంది పిల్లల్ని పోగు చేసి రచ్చబండే బడిగా ఒక వీధి బడి ఏర్పాటు చేశారు. భోజనం, విడిదీ మా యింట్లోనే నా వంతు జీతం నెలకొక్కరూపాయి. అలా పదమూడు నెలలు గడిచాయి. అప్పటికే సుమతి శతకం, కృష్ణశతకం, బాల రామాయణం నా చేత కంఠస్థం చేయించాడు. పద్యం ఎలా చదవాలో నేర్పడంతో పాటు మధ్య మధ్య అర్థ తాత్పర్యాలు కూడా చెప్పేవారు. ఆ కారణంగా పద్యం పట్ల నాకు ఆసక్తి పెరిగింది. నా అంత నేనుగా పద్యాలు వ్రాయటం మొదలు పెట్టాను.

మా కుటుంబపరిస్థితి నా చదువుకు అడ్డుగా నిలిచింది. అప్పుడు మా అమ్మ, "నెల్లూరులో పెద్ద పెద్ద రెడ్లున్నారంట. నవ్వు వెళ్ళి ఏ పెద్ద రెడ్డికో నీ పద్యాలు వినిపిస్తే, తప్పకుండా నీకు సహాయం చేస్తారు'' అని నాకు ధైర్యం చెప్పి, సాగనంపింది. కానీ గూడూరులో ఒక్క రెడ్డి కూడా నాకు ఆశ్రయమివ్వలేదు. అప్పటికే విస్తరాకుల కట్టలు అమ్మిన డబ్బులు "హరీ" అన్నాయి. ఒక రోజంతా గూడూరులోనే అనాథలా తిరుగుతూ నెల్లూరి రెడ్ల దగ్గరికి వెళ్లాలా వద్దా అని ఆలోచించాను. నా మనసు ఒకటే చెప్పింది. ధనికుల మనస్తత్వాలు ఎక్కడైనా ఒక్కటేరా... అని, లక్ష్యమే గురువుగా. పట్టుదలే పరంజ్యోతిగా, నేను ఇంటిముఖం పట్టాను. జరిగింది మా అమ్మకు చెప్పాను. అమ్మ బోరున ఏడ్చి, నెల్లూరికి పోయుంటే అక్కడ నీకు తప్పకుండా ఆశ్రయం దొరికేది. చిన్నప్పుడు నీకూ మీ నాయనలాగే రోషం ఎక్కువ. మన రోజులు బాగాలేనప్పుడు రోషం మంచిది కాదు. నెల్లూరికి పొయ్యుంటే బాగుండేది!" అన్నది. 'కోతి అనకాపల్లెలో పుట్టినా, అమలాపురంలో పుట్టినా, అలిమిలిలో పుట్టినా కోతులన్నిటికీ మూతులొకటే...' నాకు ఏకలవ్యుడు ఆదర్శం. హైస్కూల్‌లో చదివిందే చదువుగాదు. నేను చదువుతాను. 'లోకమే నా పాఠశాల. ఇప్పటి వరకు నాకు ఎదురైన అనుభవాలే బోధగురువులు.'

మా అమ్మ చిన్నతనంలోనే ఒక పద్యం నేర్పింది.

**"తల్లిదండ్రులందు దయలేని పుత్రుండు,**

**పుట్టనేమి వాడు గిట్టనేమి..."**

నా ఇంటిపేరే నా పద్యాలకు మకుటమయ్యింది. "మహిత వినయశీల మల్లెమాల". మల్లెమాల మా ఇంటిపేరు. ఆ మకుటం బాగా నచ్చడంతో కవిగా నా కలంపేరు "మల్లెమాల" అని పెట్టుకున్నాను. తర్వాత నా దృష్టి తేటగీతల మీద పడింది. పూర్వకవులు రాసిన తేటగీతుల్ని అధ్యయనం చేసేవాణ్ణి. ఆ నడక కూడ నాకు సులభంగానే పట్టుబడింది. తేటగీతయినా, ఆటవెలదయినా అది ముందు ప్రజల నాల్కల మీదికెక్కాలనేది నా అభిప్రాయం.

నెల్లూరు వి.ఆర్.కాలేజిలో చదువుతూన్న మా బంధువుల అబ్బాయి ఒకడు ప్రతినెలా నాకు ఉత్తరాలు రాసేవాడు. నాదైన శైలిలో నేను బదులు రాసేవాణ్ణి. నా జాబు చేరిన వెంటనే అతను తోటి విద్యార్థులకందరికీ చదివి వినిపించేవాడట. అలా కొంత మంది విద్యార్థులు పరోక్షంగా నాకు అభిమానులయ్యారు. ఒకసారి అతను పద్యాలతో నాకు ఉత్తరం రాశాడు. ఆ పద్యాలు చదివి నేను నవ్వుకున్నాను. నా పద్యాలతో పోల్చి చూసుకున్నాను. నేను పద్యాలలోనే జవాబు రాశాను ధైర్యంగా. ఎప్పుడెప్పుడు జవాబు వస్తుందా అని ఎదురు చూశాను అభినందనల కోసం. అభినందనలకు బదులు చీవాట్లతో వచ్చింది ఉత్తరం. ఉత్తరం సారాంశం ఏమిటంటే... "నీ పద్యాల్లో ఏ ఒక్కదానికి ఛందస్సులేదు. పద్యానికి ఛందస్సు ప్రాణవాయువు. ముందుగా నేను చదువబట్టి సరిపోయింది. ఇంకెప్పుడూ పద్యాలజోలికి వెళ్ళొద్దు" అని. నాకు తల తీసినంత పనయ్యింది. ఈ విషయం మా అమ్మకు కూడా చెప్పలేదు. కానీ నాలో పట్టుదల పెరిగింది.. నా పద్యాల్లో లోపమేమి...? అసలు ఛందస్సు అంటే ఏమిటి? అని తర్కించుకున్నాను. వెంటనే పోతన భాగవతం 'రుక్మిణీ కల్యాణం' లోని కొన్ని పద్యాలను ఏరుకుని వరుసగా అక్షరాలను కొలుచుకుని సరిచూసుకున్నాను. నేను పద్యం మొదలెట్టగానే శారదా కటాక్షం వల్ల పదాలు నేను

నేను అంటూ వచ్చి వాటి స్థానంలో అవి కూర్చుంటాయి. నా మిత్రునికి పద్యాలలోనే రాశాను జవాబు. ఆ ఉత్తరం నాకు అనేకమంది అభిమానులను సంపాదించి పెట్టింది. అలా ప్రారంభమైంది నా పద్యరచన నిర్దుష్టంగా.

అవి **జమీన్ రైతు** ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న రోజులు. **జమీన్ రైతు** ఉద్యమంలో భాగంగా మా నాన్న మా ఊళ్లో ఒక పెద్ద సభ ఏర్పాటు చేశాడు. ఆ సభలో ఆచార్య రంగా, వారి సతీమణి భారతీదేవి **జమీన్ రైతు** సంపాదకులు వెంకట్రామానాయుడు మొదలగువారు పాల్గొన్నారు. ఆ దినం వారి ఉపన్యాసాలు నా హృదయం మీద చెరగని ముద్రవేశాయి. చిన్నచిన్న మాటలతో సామాన్యుడికి అర్థమయ్యేలా పద్యాలు రాసి, పల్లెపల్లెకూ తిరిగి కొంతమంది యువకుల్ని ఉద్యమంవైపు మళ్ళించాను. ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. పర్యవసానంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభలో జమీందారి రద్దు బిల్లు ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైంది. నేను **జమీన్ రైతులు** ఎదుర్కొంటున్న కష్టాలను, రద్దు బిల్లు యొక్క అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని గేయాలు రాశాను. చుట్టుపక్కల పల్లెల్లో నుండి దాదాపు వందమంది రైతు యువకులను పోగు చేసుకుని ఆ గేయాలు పాడుకుంటూ కాలినడకన మద్రాసుకు బయల్దేరాము.

సరిగ్గా బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టేనాటికి మేం అక్కడకు చేరుకున్నాం. ఏ మహానాయకుడినైతే స్ఫూర్తిగా తీసుకున్నానో ఆ టంగుటూరి ప్రకాశంపంతులు గారు అప్పటికి "మాజీ" ముఖ్యమంత్రి అయ్యారు. కళా వెంకట్రావు గారు రెవిన్యూ మంత్రి. వారే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడుతున్నారు. ఆ సందర్భంగా మా బృందం రాజాజీ హాలు మెట్ల మీద ఇరువైపులా నిల్చుని కరపత్రాలను ప్రతి శాసనసభ్యుడికి అందిస్తూ గేయాలు ఆలపిస్తున్నాం. అప్పుడు ప్రకాశం పంతులుగారు, **జమీన్ రైతు** నాయుడుగారు అదే మెట్లమీదుగా అసెంబ్లీకి వెళ్తున్నారు. మా పాట విని ఆగారు. ఇద్దరికీ నేను కరపత్రాలందించాను. అందులో నా గేయాలతో పాటు రెండు మూడు పద్యాలు కూడా వున్నాయి. ప్రకాశం పంతులుగారు ఓపిగ్గా చదివి "బాబూ, ఎవర్రాశారివి" అని నన్నే అడిగారు. "నేనే రాశాను మాస్టారు, వెంకట్రామానాయుడిగారి స్ఫూర్తితో" అన్నాను తడబడుతూ. "స్ఫూర్తి ఎవరిదైతేనేం, నీ రచనలో జాతీయ భావాలు నిండుగా వున్నాయి" అని మెచ్చుకున్నారు. "ఏదో పల్లెటూరి భాష" అన్నాను. "కావచ్చు నువ్వు పుట్టుకతో కవివి. (బోర్న్ పొయెట్). ప్రతి పద్యంలోనూ సహజత్వం వుంది. నీ వాక్కు చాలా బలిష్ఠమైంది. నవ్వు నాకొక మాటివ్వాలి. నీ కవిత్వాన్ని జాతి శ్రేయస్సు కోసమే ఉపయోగించాలి" అంటూ ఒట్టు వేయించుకున్నాడు. ఆ మరసటి వారమే వెంకట్రామానాయుడుగారు **జమీన్ రైతు**లో నన్ను "సహజకవి"గా పరిచయం చేశాడు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ సాహిత్య రంగం మీద ఎక్కువగా దృష్టి పెట్టలేకపోయాను. నా ధ్యాసనంతా చితికిపోయిన మా కుటుంబం భవిష్యత్తు మీదే పెట్టాను. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా శ్రమించి పైసా పైసా కూడబెట్టి మా నాన్నగారి హయాంలో పోగొట్టుకున్న ఆస్తిపాస్తులన్నీ తిరిగి సంపాదించుకున్నాను. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాను.

దాంతో మా నాన్న నాకు పెళ్ళి సంబంధాలు చూడడం మొదలు పెట్టాడు. 1951 అక్టోబరు పదో తేదీ నా వివాహం జరిగింది. నా శ్రీమతి నాకంటే ఎక్కువ చదువు కున్నది. "మొదటి రాత్రి" అనే కావ్యఖండికను రాసి ఆమెకు పెళ్ళికానుకగా ఇచ్చాను అది మా ఇద్దరి మధ్య చక్కని అవగాహనకు, ఆత్మీయతకు పునాది వేసింది. ఆ తర్వాత కొంతకాలానికి వ్యాపారరీత్యా నా మకాం గూడూరుకు మారింది.

అక్కడ నాకు కొందరు సాహితీవేత్తలతో పరిచయం ఏర్పడింది. అందులో విద్వాన్ ముదిపర్తి కొండమాచార్యులు వారు ముఖ్యులు. ఆయన అటు సంస్కృతంలోనూ, ఇటు తెలుగులోనూ కవిగా, పండితుడుగా లబ్దప్రతిష్ఠుడు. అప్పటివరకూ నేను రాసిన అముద్రిత రచనలన్నీ ఆయనకు చూపించాను పరిశీలించి మీ అభిప్రాయం చెప్పమని. ఆయన ఓ వారం రోజుల పాటు నా రచనలన్నీ పరిశీలించి నన్ను మరింతగా ప్రోత్సహించారు. అంతకు ముందే నేను ఉండేల మాలకొండారెడ్డి తన పధ్నాలుగో ఏట రాసిన 'నేతాజి' అనే పద్యకావ్యాన్ని చదివాను. అందులోని చాలా పద్యాలు నాకు బాగా నచ్చాయి. ఆయన వయసులో నాకంటే ఏడెనిమిది సంవత్సరాలు చిన్న అయినా అడ్రసు తెలుసుకుని మరీ నా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ పద్యాల్లోనే రాశాననుకుంటా జాబు. ఆ ఉత్తరం ఒకరినొకరు చూసుకోకుండానే ఇద్దరి స్నేహానికి బాట వేసింది. ఆ తర్వాత గుంటూరు శేషేంద్ర శర్మ గూడూరు

మున్సిపాలిటీకి కమీషనరుగా రావడం జరిగింది. ఆయనా నెల్లూరు జిల్లా వాడే. ఆయనను కలుసుకోవాలని వెళ్ళాను. ఆప్యాయంగా లేచి కౌగలించుకుని, 'మీ పద్యాలు పత్రికల్లో చదువుతున్నాను. నేను 'ఋతుఘోష' అనే కావ్యం రాశాను. విశ్వనాథ వారు పీఠిక రాశారు. దాన్ని మీకు అంకితం ఇవ్వాలనుకుంటున్నాను' అన్నాడు. 'అంకితం తీసుకునే స్థాయి నాకు లేదు. మనం మంచి సాహితీ మిత్రులుగా వుందాం' అన్నాను. ఆ రోజు నుంచి ప్రతి రోజూ సాయంత్రం ఆరు నుండి ఎనిమిది వరకూ కలుసుకునే వాళ్ళం మా యింట్లో. పద్యం ఎలా చదవాలి అన్నది నేను ఆయన నుంచి నేర్చుకున్నాను.

అప్పటికే నేను డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి 'కర్పూర వసంతరాయలు' చదివాను. అందులోని ప్రతి వాక్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. తర్వాత నారాయణరెడ్డిగారితో ప్రత్యక్ష పరిచయం సినిమా రంగంలోనే. అప్పటికే ఆయన సుప్రసిద్ధ కవిగానే గాక, సినీ గేయ రచయితగా కూడా తనకంటూ ఒక ప్రత్యేకతను సముపార్జించుకుని వున్నారు. 'గులేబకావళి కథ' చిత్రం కోసం ఆయన రాసిన అన్ని పాటలూ నాకు ఎంతగానో నచ్చాయి. ఫలితంగా మా 'శ్రీకృష్ణ విజయం'లో కొన్ని పాటలు ఆయన చేత రాయించాను. అందులోని "జోహారు శిఖిపించమౌళి..." అన్న నృత్యగీతం ఆ చిత్రానికే మకుటాయమానం. అలాగే "పిల్లనగ్రోవి పిలుపు..." అనే పాట సంగీత ప్రియులందర్నీ విశేషంగా అలరించింది. అప్పటి నుంచి ఆయనతో నాకు ఆత్మీయమైన మైత్రీ బంధం ఏర్పడింది.

ఫలితంగా హైదరాబాద్‌లో మా ఇద్దరి ఇళ్ళూ పక్కపక్కనే కొలువుతీరాయి. నా కవిత్వం అంటే ఆయనకెంత ఇష్టమో, ఆయన కావ్యాలంటే నాకూ అంతకన్నా ఇష్టం. నారాయణరెడ్డి గారిలో వున్న గొప్పతనం-ఎవరి కవిత్వంలోనైనా ఒక మెరుపు కనిపిస్తే చాలు వెంటనే స్పందిస్తాడు. ఫోన్ చేసి మరీ అభినందిస్తాడు.

నా బాల్య స్నేహితులు చాలామంది అంటారు అప్పుడప్పుడు-మీరు సినిమా పరిశ్రమకు పోకుండా వుంటే ఇంకా ఎంతో సాహిత్య సృష్టి చేసుండేవాళ్ళని. నేను వాళ్ళతో ఏకీభవించను. నిజానికి సినిమా పరిశ్రమ నా సాహితీ వ్యాసంగానికి మరింత తోడ్పడింది. మహాకవి శ్రీశ్రీ, దేవులపల్లి, దాశరథి, ఆరుద్ర, ఆత్రేయ, సముద్రాల, పింగళి వంటి దిగ్గంతులతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరిచింది.

అంతకు ముందే నేను శ్రీశ్రీ గారి రచనలన్నీ చదివాను. కవిగా ఆయనంటే నాకు అపారమైన గౌరవం. కె.యస్.ప్రకాశరావు దర్శకత్వంలో నేను 'భార్య' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నాను. తెలుగులో అదే నా మొదటి చిత్రం. అప్పట్లో మా ఆఫీసు మద్రాసు సెయింట్ మేరీస్ రోడ్లో వుండేది. బయట 'కౌముది' కార్యాలయం అని పెద్ద బోర్డుండేది.

ఒకరోజు శ్రీశ్రీగారు మా ఆఫీసుకొచ్చి మీరు తీస్తున్న పిక్చర్లో ఒక్క పాట నా చేత రాయిస్తారా అని అడిగారు. అప్పుడే తెలిసింది ఆయన శ్రీశ్రీ అని. నేను ఆశ్చర్యపోయాను. అప్పటి నుంచి మా సినిమాలకు ఆయన పాటలు రాసినా రాయకపోయినా ఊర్లో వున్న ప్రతి రోజూ మా ఆఫీసుకు వచ్చేవారు. వారితో మాట్లాడడమే గొప్ప సాహితీ అనుభవం.

శ్రీశ్రీ కవిగా ఎంత విప్లవవాదో, వ్యక్తిగా అంత సున్నితమైన వాడు. పసిపిల్లవాడి మనస్తత్వం, ఒక విధంగా అల్ప సంతోషి కూడా, అందుచేతనే అనిర్వచనీయమైన సాహితీ సంపదను సమాజానికిచ్చి కూడా కుటుంబానికి ఏమీ ఇవ్వలేకపోయాడు. మద్రాసు ఆకాశవాణిలో ప్రసారమైన నా "ఫలవిలాపం" పద్యాలను విని, మరుసటి రోజు స్వయంగా వచ్చి, "మీ ఆకాశవాణి పద్యాలు నా కవిత్వమంత గొప్పగా వున్నాయి'' అన్నారు. అది నాకొక మరపురాని మధురానుభూతి. అలాగే, నా ఉగాది కవితలో కొన్ని పంక్తుల్ని ఆయన అప్పుడప్పుడూ ఉదహరించేవాడు. మచ్చుకు-

**పంచాంగంలో వుండే వర్షం పంటలకుపయోగిస్తుందా?**
**పున్నమి ఘనతను వల్లెవేసితే అమవస చీకటి పోతుందా?**

ఇలా ఎన్నో మార్లు నా వెన్ను తట్టాడు. అలాగే కృష్ణ శాస్త్రిగారు చాలా కాలం మా పక్క వీధిలో వుండేవారు. ఆయన కూడా నా చిత్రాలకు చాలా పాటలు రాశారు. నేను సినిమా పరిశ్రమకు పోకముందు నుంచే కృష్ణశాస్త్రి గారి కవిత్వంతో పరిచయం వుంది. 'మల్లీశ్వరి' చిత్రంలో వారు రాసిన పాటలు చిరస్మరణీయాలు. వారు నాకు పరిచయం అయ్యేనాటికే ఆయన గొంతు మూగబోయింది. శాస్త్రిగారు ప్రతి అక్షరాన్ని కన్న బిడ్డలా చూస్తాడు. అందుకే పాటలో ప్రతి అక్షరాన్ని ఆచితూచి పొదుగుతాడు. నేను కేరళ అందచందాల గురించి రాసిన పద్యాలు 'ఆంధ్రప్రభ' లో వచ్చాయి. అవి చదివాడట ఆయన. సంతోషం పట్టలేక నడిచి మా ఇంటికొచ్చి ఆయన

ఆనందాన్ని అక్షరరూపంలో వెలిబుచ్చాడు. "రెడ్డిగారూ ఉదయాన్నే చదివాను. మీ పద్యాలు పత్రికలో–" అని రాసి, అందులో కొన్ని పంక్తులు ఉదాహరిస్తూ 'ఇలాంటి మాటల్ని మరో వెధవాయి రాయలేదు' అని అభినందించాడు. అలాగే ఆత్రేయ, ఆరుద్ర, దాశరథి... వీళ్ళందరి నుంచి నేనెంతో నేర్చుకున్నాను. తర్వాత నా మకాం హైదరాబాదుకు మారింది. ఇక్కడ కూడా నా చుట్టూ సాహితీ వాతావరణాన్ని ఏర్పరుచుకున్నాను. సజ్జన సాంగత్యం సర్వశ్రేయోమూలం కదా. నా బాల్యమంతా పల్లెటూరిలో గడవడం వల్ల పల్లెతల్లి నాకు ఎన్నో విషయాలు నేర్పింది. అందులో ముఖ్యంగా సమయపాలన, నాకు పల్లెకోడి గురువు. ప్రతినిత్యం వేకువన ఒకే సమయానికి నిద్రలేస్తుంది. దాని కమ్మని గొంతుతో పల్లెను మేలుకొలుపుతుంది. ముత్యాల పల్లకిలో "తెల్లవారకముందే పల్లె లేచింది." అనే పాటకు ప్రేరణ ఆ కోడే.

పాట ఏదైనా సందర్భానికి తగిన సాహిత్యాన్ని వాడాలన్నదే నా అభిప్రాయం. అందుకు ఉదా: "ఇదే చంద్రగిరి–శౌర్యానికి గీచిన గిరి". అలాగే తలంబ్రాలు, ఆహుతి, అంకుశం, అమ్మోరు, ఏకలవ్య... యిలా ఏ సినిమాలో కూడా నా పాటలు ఔచిత్యానికి దూరంగా లేవు. ఇది గర్వంతో అంటున్న మాట కాదు. వినమ్రంగా నిజం చెప్పడమే. అలవోకగా అప్పుడప్పుడు నేను చెప్పిన పద్యాలు 'నిత్యసత్యాలు' పేరుతో కొంతకాలం క్రితం. ప్రతి ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సంపాదకీయం సరసన వచ్చేవి. ఇక్కడ మరో విషయం చెప్పాలి. బాల్యం నుండి నా ఆరాధ్యదైవం శ్రీరాముడు.

నేను అక్షరాలు దిద్దుకున్నది కూడా ఆయన సన్నిధిలోనే. శ్రీరాముడి వ్యక్తిత్వం నా హృదయం మీద చెరగని ముద్ర వేసింది. అలాగే నాలో అతి చిన్న వయసులోనే జాతీయభావాలు చోటు చేసుకోవడానికి కారణం మహాత్మాగాంధీ. పన్నెండేళ్ళ వయసులోనే గాంధీగారి ప్రభావం నా మీద పడింది. ఆయన సందేశాలను నేను పత్రికల్లో చదివి స్పందించి, పూజ్యభావాన్ని ఏర్పరుచుకున్నాను.

**"ధరను నల్వది కోట్ల భరత ప్రజల నెల్ల**
**నవ్వుచు ఒక త్రోవ నడిపినావు"**

అని ఎవరో రాసిన పద్యం చదివి జీవితంలో ఒక్కసారైనా ఆయన దర్శనం చేసుకోవాలన్న అభిలాష ఆ వయసులోనే నాకు ఏర్పడింది. ఆంధ్రదేశ పర్యటన సందర్భంగా మహాత్ముడు వెంకటగిరికి వస్తున్నాడని తెలిసింది. రెండు గంటల ముందే వేదిక దగ్గరగా ఒక పక్క కూర్చున్నాను. బాపూజీ అక్కడకు రాగానే పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆయన పాదాలు కళ్ళ కద్దుకున్నాను. అది దైవదర్శనంగా అన్పించింది.

1956 నవంబర్ 1తేదీ నీలం సంజీవరెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ మరుసటి రోజు దైవదర్శనానికి తిరుపతిపోతూ దార్లో వెంకటగిరిలో మేము ఏర్పాటు చేసిన సభకు హాజరయ్యారు. ఆ సభలో ఉపన్యాసమంతా మొత్తం పద్యాలతోనే సాగింది. మా తాలూకా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పద్యరూపంలో ఆయన దృష్టికి తెచ్చాను. వెంకటగిరి నుండి కార్లో తిరుపతికి పోతూ, వాటికి పరిష్కారాలు కూడా సూచించాను. అందులో కొన్ని చురకలున్నాయి. ముఖ్య మంత్రిగారు ఒక పైపు నన్ను అభినందిస్తూనే అందులో అంతర్లీనంగా వున్న విమర్శను కొంత తప్పుపట్టారు. నేను అది తప్పుకాదని పద్యరూపంలో జవాబిచ్చి ఆయన చేతనే భేష్ అనిపించుకున్నాను. అలా 1960 వరకు ఆయన అనుచరుడిగా రాజకీయాల్లోనే కొనసాగాను. ఆ తరువాత తెలిసింది రాజకీయాలు నాలాంటి ఆవేశపరునికి అచ్చిరావని. అందుకు సవాలక్ష కారణాలు! అప్పటి నుండి సంజీవరెడ్డి అనుచరుడిగా గాక ఆయన అభిమానిగా మిగిలి పోయాను. అప్పటికే కాంగ్రెస్‌వాదిగా గాక, గాంధేయవాదిగా బ్రతుకుతున్నాను. ఏ రంగంలోనైనా నాకంటూ గుర్తింపు తెచ్చిపెట్టింది పద్యం.

శ్రీరాముడు నా ఆరాధ్య దైవమని ముందే చెప్పాను. నా ఎదుగుదలకు కారణం ఆయన ఆశీస్సులేనని నా నమ్మకం. రామాయణ సందేశాన్ని నాదైన శైలిలో మరో మారు సినిమాద్వారా చెప్పాలనుకున్నాను. అయితే సంపూర్ణ రామాయణమే గాకుండా రామాయణం లోని ప్రతి ఘట్టం తెరకెక్కడం జరిగింది. అవన్నీ తెలుగు జాతి గర్వించదగిన కళాకారులు నటించినవే. మరి అంతకు మించి మరేం తీయగలం మనం అనుకున్నాను. అలాగని నా సంకల్పాన్ని వదులుకోవటానికి మనసంగీకరించ లేదు. పర్యవసానంగా భారమంతా రాముని మీద వేసి చిన్నారుల శిల్పారామం బాల బాలికలతో 'రామాయణం' చిత్ర నిర్మాణానికి సాహసించాను. ఆ చిత్రం నాకు ఆర్థికంగా పరిమిత లాభాన్ని యిచ్చినా,

జాతీయస్థాయిలో ఉత్తమ బాలలచిత్రంగా రాష్ట్రపతి అవార్డు సాధించిపెట్టింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా నంది అవార్డుతో మా చిత్రాన్ని సత్కరించింది. నా చిత్రం ఏకలవ్యను చూపి బెజవాడ గోపాలరెడ్డిగారు "తెలుగు చిత్రంలో ఇంతగా సాహిత్య విలువలుండటం మొదటిసారిగా "ఏకలవ్య"లోనే చూశాను" అని అభినందించారు. నాకు ఒక దురలవాటు ఉంది. గ్రంథస్థం మీదున్న శ్రద్ధ కంటే కంఠస్థం మీదే ఎక్కువ మక్కువ. అందువల్ల అలవోకగాను, ఆశువుగాను చెప్పిన పద్యాలు నా బుర్రలోనే భద్రపరుచుకున్నాను. ఇతివృత్తం ప్రాతిపదికగా నేను రాసిన ఖండ కావ్యాలు మాత్రమే ఇప్పుడు వ్రాత ప్రతులుగా నా వద్ద ఉన్నాయి. *అవి ఫల విలాపం, తేనెటీగలు, ఆణిముత్యాలు, అక్షరశిల్పాలు, పల్లె పరాయిదయ్యింది మొదలైనవి. నా తొలి పుస్తకంగా దేన్ని ముద్రించాలి అని ఆలోచిస్తే తిరిగి తిరిగి నా కలం రామాయణాన్నే సూచించింది.* 'నువ్వు రాయి' అని రాముడే నన్ను ప్రోత్సహించాడేమో కలము అందుకున్నాను. అయితే నా రామాయణ రచనకు నేటి భారతమాత విలాపమే నేపథ్యంగా తీసుకున్నాను.

అయినా నాకు మరచిపోలేని మధురానుభూతు లందించిన సంఘటనలలో కొన్ని మాత్రమే చెబుతాను. అందులో ఒకటి అన్నామలై యూనివర్సిటీ నుంచి నేను కవిగా 'డాక్టరేట్' అందు కోవటం. ఆ రోజు నాతోపాటు జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వైజయంతిమాల కూడా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆ ఆనవాయితీ ప్రకారం అప్పటి తమిళనాడు గవర్నర్ డా.మర్రిచెన్నా రెడ్డి గారు నేనందుకున్న డాక్టరేట్ బిరుదు మీద స్పందనగా పద్యం చెప్పమన్నారు.

> **"ఎక్కడో మారుమూల జనియించిన నిత్యకృషీవలుండ నా**
> **ప్రక్కన జేర మోజుపడి వచ్చినదీ బిరుదమ్ము గాన నే**
> **నక్కున జేర్చుకొంటి యిక అక్షర శిల్పములొక్క టొక్కటే**
> **చెక్కెద నెల్లవారరసి చెక్కిలి ముద్దిడి మెచ్చుకున్నట్లుగా**

అన్నాను రాగయుక్తంగా.

మద్రాస్‌లో విశ్వనాథ సత్యనారాయణగారి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో ఆయన నా పద్యాలు విని "బాబూ, నువ్వెవరో నాకు తెలీదు, కానీ చాలాకాలం తర్వాత కవిసమ్మేళనంలో ఒక కవికూడా పాల్గొన్నాడనే తృప్తి నాకు మిగిల్చావు." అన్నారు. అలాంటిదే మరో సంఘటన. ఒక సంవత్సరం డిసెంబరు 14వ తేదీ పుట్టపర్తిలో భగవాన్ సత్యసాయి బాబా వారి ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనం లో పన్నెండు మంది కవులు పాల్గొన్నాము. అందులో నేను ఒక్కణ్ణి తప్ప మిగతా అందరు పుట్టపర్తికి పాతకవులే. గ్రంథ కర్తలుగా అందరూ లబ్ద ప్రతిష్ఠులే. నేనొక్కణ్ణే అచ్చులో పుస్తకం లేనివాణ్ణి.అయినా జి.వి. సుబ్రహ్మణ్యం పట్టుపట్టి నన్ను తీసుకెళ్ళారు. కవి సమ్మేళనంలో చదివే ప్రతి కవితా స్వామి వారి గురించే వుండాలనేది నిబంధన. నేనెప్పుడూ పుట్టపర్తిలో అడుగు పెట్టలేదు. ఉదయం బాబా ఆధ్వర్యంలో నిర్వహింప బడుతున్న ఆసుపత్రిని మాత్రం చూశాను.

అంతే! అక్కడ మొదలైంది నా పద్యం. అలా వరుసగా ఏడు పద్యాలు ఏకధాటిగా నా మనసులో మెదిలాయి. సభ ప్రశాంతి నిలయంలో. అధ్యక్షులు స్వామివారే. మధ్యలో ఆయన ఆసనం అటువైపు ఆరు కుర్చీలు, బాబా వచ్చే వరకు కవులంతా పద్మాసనం వేసుకుని క్రిందనే కూర్చున్నారు. మోకాళ్ళ నొప్పుల మూలంగా నేను క్రింద కూర్చోలేనంటే ఆ ప్రక్కనే నాకు ఓ చిన్న కుర్చీవేశారు. నా కుర్చీ స్వామి వారు వచ్చే మార్గంలో మొదటనే వుంది. వారు వస్తూనే అందరం ఒక్కసారి చివాలున పైకి లేచాం.

బాబావారు మెల్లగా నా దగ్గరకు వచ్చి "అవును, నీ కోసం నలభై ఏళ్ళుగా ఎదురుచూస్తున్నాను. ఒక్కసారైనా వస్తావేమోనని, ఇప్పటి కొచ్చావు." అన్నారు మెల్లగా. నాకు ఏడుపాగలేదు. "ఎందుకేడుస్తున్నావ్, రామాయణం రాస్తున్నావుగా!" అన్నారు బాబా. "రాస్తున్నాను, పూర్తి కావాలిగా" అన్నాను నేను. "ఇంకా పూర్తికాకపోవడమేమిటి, సుందరకాండ దాకా వచ్చి...తప్పకుండా పూర్తవుతుంది. అక్కడ రాముడున్నాడు. ఇక్కడ నేనున్నాను." అని చేత్తో ఆశీర్వదించి వెళ్ళిపోయారు. నా ముందు చదివిన ఆరుగురూ చదివిన కవితల్ని స్వామి వారికి అందజేశారు. ఆయన ప్రతి ఒక్కరికీ స్వయంగా శాలువా కప్పి ఒక్కొక్క లడ్డూ ఇచ్చారు.

నావంతు రాగానే నేనూ మైకు దగ్గరకు వెళ్ళి కాగితం చూడకుండానే నా పద్యాలు చదివాను. సభలో స్పందన అపూర్వం. అప్పుడు తీశాను జేబులోంచి కాగితం. స్వామి వారికి ఇచ్చి, నమస్కరించాను. శాలువా కోసం తలవంచాను. కాని శాలువా కన్నా ముందే ఆయన నా కళ్ళ ఎదుటే ఉంగరాన్ని సృష్టించి నా వేలికి తొడిగారు. ఊహించని ఈ పరిణామానికి నా కళ్లల్లో ఆనందాశ్రువులు నిండాయి. ఇదొక మధురానుభూతి. ●

## సాంస్కృతిక పునరుజ్జీవనం :

# రావిపూడి వెంకటాద్రి

- *నరిశెట్టి ఇన్నయ్య*



వెంకటాద్రి ఒక ధృఢమైన మానవతావాది, హేతువాది. తొంభైయేళ్ళ వయస్సులో కూడా జ్యోతిశ్శాస్త్రం, సంఖ్యాశ్శాస్త్రం, వాస్తుశ్శాస్త్రం, మనుస్మృతి అంటరాని తనం మొదలైన వాటిపై అవిశ్రాంతంగా వాస్తవిక దృష్టితో మెలగాలని ప్రజలకు ఉద్భోదిస్తున్నారు. త్రిపురనేని రామస్వామి హేతువాది రచనలతో ప్రభావితుడై 1940 సంవత్సరము నుంచి ఒంగోలుకు దగ్గరలో గల వారి స్వగ్రామమైన నాగండ్ల గ్రామంలో కవిరాజ ఆశ్రమము స్థాపించి దానిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

రావిపూడి తన విద్యాభ్యాసం పూర్తికాగానే చిలకలూరిపేట, చీరాలలో ఉపాధ్యాయసంస్థను స్థాపించి, దాని ద్వారా ఎంతో మంది విద్యార్థులను హేతువాద తార్కికులుగా తీర్చిదిద్దాడు. అటువంటి మెచ్చదగిన, శ్లాఘనీయమైన సదాశయము 1960లో ఆయన మానవతావాద మూలసూత్రాల సంస్కరణ కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమయ్యేంత వరకూ కొనసాగింది. నాగండ్ల గ్రామంలో ఒక మధ్య తరగతి వ్యవసాయిక కుటుంబంలో జన్మించిన వెంకటాద్రి నాటకాలు, పాటలన్నా చాల ఇష్టపడి వాటిపై అభిరుచిని పెంచుకున్నాడు.

స్వాతంత్ర్యం రాకమునుపు త్రిపురనేని రామస్వామి వ్రాసిన పద్యాలను రాగయుక్తంగా పాడి యువకులను ప్రభావితం చేసేవారు. ఆయన మంచి నటుడు కూడా. శ్రీకృష్ణుడు, రాముడు, తిక్కన, నారదుడు, కర్ణుడు, భరతుడు మొదలగు పాత్రలను తులాభారం, గయోపాఖ్యానం, పాదుకా పట్టాభిషేకం, నాటకలలో నటించి రక్తి కట్టించాడు. ఆయన రామభక్తుడు. హిందూ ధర్మశాస్త్రాలు, పురాణాలు, రామాయణ, భారత భాగవతాలు చదివారు. ఒకనాడు ఆయన తన తెలుగు ఉపాధ్యాయులయిన చిన్నయ్యగారి ద్వారా భగవంతుని ప్రార్థిస్తున్న శంభుకుని రాముడు సంహరించినట్లుగా తెలుసుకున్నాడు. అతను శూద్రుడవటం వల్ల హిందూ ధర్మ శాస్త్రాలు శూద్రులకు భగవత్ ప్రార్థనను నిషేధించాయి, అని ఆయన ఆశ్చర్యపోయి చీరాల దగ్గర వేట పాలెంలో ఉన్న సరస్వతీ గ్రంథా లయానికి వెళ్ళి రామస్వామి గారిచే రచించబడిన శంభుక వధ పుస్తకాన్ని చదివారు. భగవంతుడిని ప్రార్థిస్తున్న శంభుడిని రాముడు ఎందుకు వధించాడు? దానితో ఆయన ఆలోచనా వైఖరి, నడతలో తిరుగుబాటు తనంగా మార్పు వచ్చింది. ఆ తరువాత యం.ఎన్.రాయ్ రచనలు, ఆలోచనలు రావిపూడి వెంకటాద్రిపై శాశ్వత ప్రభావం చూపింది. అదే ఆయనను రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో స్థాపించబడిన రాడికల్ డెమొక్రాటిక్ పార్టీలో చేరడానికి, రాజకీయ రంగప్రవేశానికి తొలిమెట్టుగా ఉపయోగపడింది.

ఆయన అందులో క్రియాశీలకంగా పనిచేస్తున్నపుడు కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీల నుండి తీవ్రమైన విమర్శలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. 1946లో జరిగిన మొదటి ఎన్నికలలో రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా నిలబడి ప్రజలను ప్రభావితం చేసేందుకు బాపట్ల, గుంటూరు జిల్లాలలో విస్తృతంగా పర్యటన సాగించాడు. కాని యం.ఎన్.రాయ్‌గారి ఆలోచనలను స్వీకరించే స్థితిలో ఓటర్లు లేకపోవడం వలన రావిపూడి ఆ ఎన్నికలలో ఓడిపోయారు.

అనతికాలంలోనే రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ పరిపూర్ణ మానవతా అధ్యయన కేంద్రంగా మార్పు చెందింది. 1946-48 సంవత్సరాలలో డెహ్రాడూన్, ముస్సోరీలలో జరుపబడిన అఖిలభారత శిక్షణా తరగతులకు హాజరయి, అక్కడ తన తార్కిక గురువైన ఎమ్.ఎన్.రాయ్‌ను కలుసుకొని రాడికల్ ప్రజాస్వామ్యము యొక్క అన్ని మూలసూత్రాలను వెంకటాద్రి జీర్ణించుకున్నారు.

తెలుగు వారిపై సాంస్కృతిక పునరుజ్జీవన ముద్రను వేసిన త్రిపురనేని రామస్వామి 1942లో పరమపదించారు. రామస్వామి అడుగుజాడలలో నడచిన వెంకటాద్రి మంత్రాలు, శ్లోకాలు లేకుండా ఎన్నో వివాహాలు జరిపించారు. వధూవరుల చేత వారు అర్థంచేసుకొని ఆచరించేట్లుగా పెళ్ళినాటి ప్రమాణాలు తెలుగులో చేయించే వారు. ఆ విధంగా ఎన్నో వివాహాలను నిర్వహించారు. ఆరంభ జీవన విధానం, జ్యోతిశ్శాస్త్రమందలి కల్పితములు, మూఢవిశ్వాసాలు, జ్ఞానహీనులయిన సన్యాసుల జీవన విధానము గురించి, ఎమ్.ఎన్.రాయ్ శాస్త్రీయ వ్యాఖ్యానాలను వెంకటాద్రి నిజాయితీగా ఆచరించేవాడు. ఆ తరువాత ఆయన తెలుగులో ప్రాచీన జీవన విధానలపై సంక్షిప్త రచనలు చేసాడు. ఆయన ఒపారిన్, హాల్డన్‌ల (Oparin, Haldane) శాస్త్రీయ సూత్రాలను పరిశీలించాడు. యం.ఎన్.రాయ్ రచనల నుండి ప్రేరణ పొందిన రావిపూడి వెంకటద్రి ఖగోళశాస్త్రంపై ఒక కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించాడు. వెంకటాద్రి ఖగోళశాస్త్ర సూత్రాలను సమీక్షించి, జ్యోతిష్యంలోగల అబద్ధాలను బహిర్గతపరిచి, ఖగోళశాస్త్రంలోని శాస్త్రీయతను బలపరిచేవాడు. వెంకటాద్రి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో శిక్షణా తరగతులను నిర్వహించి హేతుబద్ధంగా నిరూపించబడిన సత్యములు, యదార్థములను విపులీకరించి చెప్పేవాడు.

వెంకటాద్రి వ్రాసిన రచనలలో భారతీయ కమ్యూనిస్టులు, యం.ఎన్.రాయ్ ఆణిముత్యాలు. జాతీయత, అంతర్జాతీయ కమ్యూనిజం, రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ, భాషా పునర్వ్యవస్థీకరణ, నూతన మానవతావాదం మొదలైనవి. ఈ లోగా కమ్యూనిస్టులు రాయ్‌పై ఎన్నో ఆరోపణలు, అభాండాలు ప్రచురించారు. దానిపై వెంకటాద్రి ఒక్కొక్కటిగా విశదీకరిస్తూ రాయ్ రాడికల్ డెమొక్రాటిక్ సిద్ధాంతాన్ని అనేక రీతుల్లో పరిశోధించి కమ్యూనిస్టులు వేసిన అభాండములకు అతిజాగరూకతతో, క్షుణ్ణంగా సమాధానాలు తయారు చేసారు.

తదుపరి వెంకటాద్రి 'హేతువాది' తెలుగు మాసపత్రికను మొదలుపెట్టి మూడు దశాబ్దాలుగా సంపాదకత్వం వహిస్తున్నారు. ఆయన తన రచనల నెన్నింటినో ఆ మాసపత్రికలో సీరియల్స్‌గా ప్రచురించి, ఆ తరువాత ఎన్నో విషయాలపై సంపుటాలు తయారు చేశారు. వెంకటాద్రి సనాతన హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింల నుండి అనేక విమర్శలను ఎదుర్కొన్నాడు. ఆయన ఎక్కడా రాజీపడక తన దృక్పథము సరియైనదేనని నిరూపించేవాడు. సమాజంలోగల కొంతమందిని జంతువులకన్నా హీనంగా చూపించే మనుస్మృతిని ఆయన విమర్శించేవాడు. ఆయన వేదాలు, పురాణాలు, మహాకావ్యాలు, ఇతిహాసాలలోని అనాగరికమైన వాస్తవాలను, వెలికి తీశారు. తను వ్రాసిన విషయాలపై లోపములు నిర్ధారించుటకు ఎటువంటి ఆస్కారము ఇవ్వలేదు. తప్పించుకోవటానికి వీలు లేకుండా మూలసూత్రాలలోని అంశాలను తెలిపేవారు.

ఆయన ఒక్కసారి 1992లో విదేశీపర్యటన చేశారు. నార్త్ అమెరికాలోవున్న తెలుగు అసోసియేషన్ సభలో ప్రసంగించారు. అరమల్ల పూర్ణచంద్రరావు పభృతులతో కొంతకాలం గడిపి, మానవతావాదమునకు సంబంధించి అమెరికాలోని అన్ని ప్రక్రియలను గ్రహించినారు. రావిపూడి వెంకటాద్రి మార్క్స్ ప్రసంగములపై విమర్శలు ప్రచురించాడు. వారి తెలుగు వివరణ చదువుటకు వీలుగా, తేలికగా అర్థము చేసుకొనేట్లుగా ఉంటుంది. వారి రచనలలో కొన్ని, ఆంగ్లము, అనేక భారతీయ భాషలలోనికి అనువదింపబడ్డాయి. వెంకటాద్రి తన సిద్ధాంతములను విశదీకరించుటకు చీరాల దగ్గర ఉన్న ఇంకొల్లులో మానవతా సిద్ధాంత కేంద్రాన్ని అభివృద్ధిచేశాడు. మానవతా సిద్ధాంతముకు సంబంధించి త్రిపురనేని గోపీచంద్, ఎన్.వి. బ్రహ్మం, ఆవుల గోపాలకృష్ణమూర్తి, యం.వి. రామమూర్తి మొదలగు వారితో కలిసి పనిచేశారు.

వెంకటాద్రి వారి 90వ సంవత్సరంలో కూడా అనేక పుస్తకములు, పత్రికలు, చదివి, తెలుగునందు అనర్గళంగా ప్రసంగించగలరు. వారిని తెలుగు విశ్వవిద్యాలయము వారు, కొన్ని ఇతర కేంద్రముల వారు పురస్కారములతో గౌరవించారు. వారు ఎన్నో విశ్వవిద్యాలయములు, విద్యాసంస్థల్లోను, ఉపన్యాసములు ఇచ్చినారు. వారు చీరాలలో నివాసముండి హేతువాది మాసపత్రికను ఇప్పటికీ నడుపుచున్నారు.

అందులో ఆదిశంకరాచార్యుల వారిపై విమర్శలు, రావిపూడి పరిశోధించి వ్రాసిన పుస్తకములు గమనించదగ్గవి. వారు వ్రాసిన వివరణలు : జ్యోతిశ్శాస్త్రము, వాస్తు, తదితర అంశాలకు సంబంధించిన పరిశీలనలు అంగీకరించదగినవి. వారు భారతదేశ రేషనలిస్టు అసోసియేషన్‌కి రాష్ట్రములో అధ్యక్షునిగా ఉన్నారు. ఇప్పుడువారు తొంభైయేళ్ళ వయస్సులో

కూడా తమ ప్రాపంచిక దృష్టిని, హేతువాద-మానవతావాద దృష్టిని మార్చుకో వలసిన అవసరం లేదని - తన జీవితం ద్వారా దృఢంగా నిరూపించారు. దేవుడున్నాడని నమ్ముతూ మోసపు బ్రతుకు బ్రతకటమంటే దేవుడు లేడని ఒప్పుకుంటూ నిజాయితీగా బ్రతకటమే మంచిదని భావిస్తూ, జీవితమంతా కేవలం హేతువాదిగా నిలచిన వ్యక్తి రావిపూడి వెంకటాద్రి. మొదటి చూపులోనే దృఢమైన ఆకృతితో ఆయన అసలు సిసలు తెలుగు రైతన్నలా కనిపిస్తారు. వయసు రీత్యా శరీరం సడలినా, మూర్తిత్వం, వ్యక్తిత్వంలో ఆ అలసట ఛాయలు కాస్తయినా తొంగి చూడవు. 90 సంవత్సరాల జీవితకాలంలో ఆయనకూ అందరిలా కష్టాలు, కడగండ్లు, వెతలు, వేదనలూ లేక పోలేదు. ఆ సమస్యల మూలాలను వెదికి శాస్త్రీయంగా పరిష్కరించు కున్నారే తప్ప, వైజ్ఞానిక అన్వేషణను మధ్యలో ఆపి, పిరికితనంతో వెనుదిరిగి, మిథ్యాసంస్కృతిలో కొట్టు మిట్టు లాడుతూ, అలౌకిక శక్తులను నమ్ముతూ సమస్యలను పరాధీనం చేయటం ఆయన ఎరుగడు.

భారతీయ సంస్కృతిలో వేలాది సంవత్సరాల నుండి వేళ్ళూనుకొని స్థిరపడిపోయిన వర్ణ, కుల వ్యవస్థలు, మౌఢ్యం, అశాస్త్రీయత, ఆత్మనూన్యతా, బానిస భావాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ప్రాచీన భారతం నుంచి మనం వారసత్వంగా పొందదగిన మానవ సంస్కృతి వున్నదనే విషయం మత ఛాందస వాదులకు స్ఫురించదు. స్ఫురించినా తెలియనట్లు నటించడం వారి సంస్కారంలో భాగం. ఏది భారతీయం? ఏది స్వజాతీయం? చార్వాక భౌతికవాదాలు భారతీయులవి కావా? బౌద్ధ, జైన తత్వాలు స్వజాతీయులవి కాదా? అని ప్రశ్నిస్తారు. ఏ మతము స్వయంభూకాదు. అపౌరషేయం అంతకన్నాకాదు.

ప్రతి మతము ఎవరో ఒకరు ప్రారంభించినదే. ప్రతి మతమూ అంతకు ముందున్న మత భావాలకు భిన్నంగా చెప్పిందే. ప్రతి మతాలోచన పరిమాణక్రమంలో ఒక మెట్టుగా బయటకు వచ్చిందే. ప్రతి కొత్తమతము, పాతమతాన్ని విమర్శిస్తూ వచ్చినదే. మతాలన్నీ వ్యవస్థీకృత సిద్ధాంతాలు, అవి ఏ చిన్న మార్పునూ అంగీకరించవు. స్వమతంలోని శాఖాభేదాల ఉనికినే అవి భరించలేక పోతున్నాయి. ఈనాడు మానవుడు ఎంతో కొంత సుఖమయ జీవితాన్ని గడుపుతున్నాడంటే విజ్ఞానశాస్త్రంలో వచ్చిన ప్రగతే దీనికి కారణం. మత ఛాందసం విజ్ఞానశాస్త్రం మీద సాగించిన పోరాటం జుగుప్సాకరం. రుజువుకు నిలవని సిద్ధాంతాలను తిరస్కరించాలి. కాని మత మూల గ్రంథాలకు విరుద్ధం అంటూ పరిణామ సిద్ధాంతాన్ని నిషేధించమని ప్రభుత్వాలను, కోర్టులను ఆశ్రయించటం ఎంత నీచం? మతమూ, రాజ్యమూ రెండూ పరస్పరాశ్రయాలు. మొదటిది పరలోక జీవితాన్ని చూపించి ప్రజల్ని దోచుకుంటే, రెండవది ఇహలోక జీవితాన్ని మెరుగుపరచే మిషతో దొమ్మీ చేస్తుంది. 70 యేళ్ళ కమ్యూనిష్టు పార్టీ పాలన తరువాత రష్యాలో మతం అంతకు ముందెక్కడ ఉందో, ఇప్పుడూ అక్కడే ఉంది. ఇన్నాళ్ళ పాలనలో ప్రభుత్వం భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని ఆపగలిగింది తప్ప, భావాలు కలిగి వుండే స్వేచ్ఛను ఆపలేకపోయింది. అది సాధ్యమయ్యే విషయం కాదు. సరైన విజ్ఞానశాస్త్ర దృక్పథం ద్వారా దీన్ని పెకలించి వేయాలి. శాస్త్రీయ తాత్వికతను పెంచటం ద్వారా మాత్రమే మనం దానిని ఆపగలం. "ఇవన్నీ ఆయన స్థిరాభిప్రాయాలు. ఆయన పదుల సంఖ్యలో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పుస్తకాలు వ్రాశారు. ఎమ్.ఎన్.రాయ్ దర్శనం, మనుధర్మం, వేదాలు, బైబిల్ Reason and Unreason, Why Reformation లాంటివి."

మతంపేరుతో ఎన్నో మోసాలు జరుగుతున్నాయి. వాటిని మనం న్యాయస్థానం దృష్టికి తీసుకొని వెళ్ళి ఆపుజేయవచ్చుగా అని అంటే "మీకు మన న్యాయాధిపతుల సెక్యులర్ భావాల మీద అంత ఆశ ఉన్నదన్నమాట. కానీ ఆ జడ్జీలలో బయట మార్క్సిజం మీదా, సెక్యులరిజం మీదా ఉపన్యాసాలుదంచి, మరోపక్క బాబాల పాదాలకు మ్రొక్కే ప్రబుద్ధులున్నారన్న విషయం మరచిపోకూడదు. అలాంటి వారి ముందుకు మన ఫిర్యాదు వెళితే, ఇక ముందెన్నడూ మనం అలాంటి విషయం మీద కోర్టులను ఆశ్రయించ లేని విధంగా ద్రోహుల కార్య కలాపాలను చట్టబద్ధంచేసి తీర్పులు చెప్పే అవకాశం ఉంది, కాబట్టి మనం ప్రజలలో విజ్ఞాన దృక్పథం పైనే దృష్టిసారించ వలసి ఉంది. వాటిని పెంచే బాధ్యత మనందరిదీని" అంటారు వెంకటాద్రి. మనకు శాస్త్రజ్ఞులు పెరుగుతున్నారు తప్ప శాస్త్రీయ వైఖరి పెరగటం లేదని శాస్త్రదృక్పథం పెంపొందించుకుని మూఢ విశ్వాసాలకు దూరంగా సామరస్యంతో సహజీవనం జరపాలని నేటి యువతకు రావిపూడి వెంకటాద్రి తన జీవన విధానం ద్వారా సందేశం ఇస్తున్నారు.



నరిశెట్టి ఇన్నయ్య

## కర్షక కవి

# ఏటుకూరి వేంకట నరసయ్య

*- సూర్యదేవర రవికుమార్*

**వీరాంగనా రక్త ధారాస్రవంతిలో**
**జలకమాడినది నా జన్మభూమి**
**విపులాంధ్రమేదినీ విజయరంగము మీద**
**గజ్జకట్టినది నా కర్మభూమి**
**విక్రమ స్ఫూర్జిత వీరగంధమ్ముచే**
**పులకరించినది నా పుణ్యభూమి**
**విమలకీర్తి ప్రభా విభవాభి రామయై**
**తేజరిల్లినది నా దివ్యభూమి**

అంటూ పలనాటి గడ్డను పరవశించి కీర్తించిన ఏటుకూరి వేంకట నరసయ్యగారు గుంటూరు జిల్లా పెదకూరపాడు గ్రామంలో 1911 ఏప్రియల్ 1వ తేదీన జన్మించారు. ఇది వారి శతజయంతి సంవత్సరం. చదువుపై శ్రద్ధలేక పొలాల వెంబడి తిరుగుతున్న పిల్లవాడిని తండ్రి భూషయ్యగారు చేరదీసి ఒడిలో కూర్చోబెట్టుకొని ఆంధ్రమహాభారతాన్ని చదివి వినిపించేవారు. ఇది వెంకట నరసయ్యగారిలో చదువుపై ఆసక్తిని కలిగించింది.

మంగయ్య శాస్త్రిగారనే గురువుగారి వద్ద తెలుగు కావ్యాలు చదువుతూ అమరకోశాన్ని కంఠస్థం చేశారు. 10వ ఏటకే ఛందోబద్ధ కవిత్వాన్ని వ్రాయటం ప్రారంభించారు. 12వ ఏట తండ్రి మరణించగా వ్యవసాయపు పనులు చేయక తప్పలేదు. అయినా రాత్రిళ్ళు శ్రద్ధగా చదువుకొనేవారు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు వారిని అమృతలూరు అనే గ్రామానికి పంపి అక్కడ స్వామినాథశాస్త్రిగారి వద్ద సంస్కృత కావ్యాలను, వ్యాకరణాన్ని చెప్పించారు. తరువాత తెనాలి, కొవ్వూరు, విజయనగరం సంస్కృత పాఠశాలలో చదివి చివరకు చిట్టి గూడూరు సంస్కృత కళాశాలలో చేరి 1933లో ఉభయ భాషా ప్రవీణ పట్టా పొందారు. ఏలూరులోని సి.ఆర్. రెడ్డి కళాశాలలోను, గుంటూరు జిల్లా బోర్డులోను అధ్యాపకులుగా పనిచేశారు.

**అరయక యేమివచ్చె నపు డయ్య కతంబున నుగ్గుబాలతో**
**నరిగిన దంధ్రభారత మనంతర మిద్ధ కళాపిపాసినై**
**తిరిగితి, దీక్షబూని గురుదేవుల సన్నిధి సంస్కృతాంధ్రముల్**
**గఱచితిఁ దెల్గువెల్గులకుగా నిలువెల్లను ధారవోసితిన్.**

అని స్వయంగా చెప్పుకొన్నారు. ఉభయ భాషా ప్రవీణ చదివే రోజుల్లోనే సంస్కృత కవి రామభద్ర దీక్షితుని జానకీ పరిణయ నాటకములోని ఒక ఘట్టాన్ని స్వీకరించి, 'సిద్ధాశ్రమము' పేర 337 పద్యాలలో విస్తరించి వ్రాశారు. నూనూగు మీసాల నూత్న యౌవన కాలపు రచన గనుక ఇది ప్రౌఢంగా సాగింది. రావణుడు విమానయానం చేస్తూ సారణునితో సంభాషించిన సందర్భంలోని ఈ పద్యాన్ని గమనించండి.



ఏటుకూరి వేంకట నరసయ్య

**మందార ప్రసవస్రగగ్ర కబరీ మాధుర్యధుర్యాప్సరో**
**బృందం బెత్తిన భీతిఁ బాఱెఁ గనుగొంటే సారణా! మేఖలా**
**స్పందాదర్శిత మధ్య ముత్పత దురోజస్థాన పైఠ మ్మనా**
**క్రందాయాత పరస్పర మ్మసకృదగ్రవ్యగ్ర పాదాగ్రమై.**

1933లో వెంకట నరసయ్యగారు 135 కంద పద్యాలు గల 'నీతి మంజరి'ని రచించి ప్రకటించారు.

**స్మిత పూర్వక మితభాషణ**
**నతిపూర్వక సత్సపర్య నానావిధ స**
**మ్మతి పూర్వక హితసంగతి**
**ప్రతిమానవు డాచరింప భద్రము గలుగున్.**

1938లో వేంకట నరసయ్య గారు రచించిన 'క్షేత్రలక్ష్మి' ఆంధ్ర కర్షక సాహిత్యంలో ఎప్పటికీ తలమానికంగా నిలిచే మనోహర కావ్యము. కవి రైతు హృదయంలోనిలచి, అతడి కంటి కాంతిగా మెరిసి, అతడి ఆకలి బాధలో బ్రతికి, అతడి

కష్టసుఖాలలో తడిసి; అతడిని పలకరిస్తూ, పులకరిస్తూ పరవశుడై తనలోని కవీశ్వరునితోపలికిన రసగుళికలు ఈ కావ్యాక్షరాలు.

**రారమ్మోయి కవీశ్వరా! హృదయమర్మక్షేత్రమున్ దున్ని సం**
**స్కారంబైన ఫలమ్ము నందుటకు స్వర్గస్థాన మందుండెరా**
**వారే రైతులు విశ్వజీవన కళాపారంగతుల్ నీ కవి**
**త్వారంభంబున కిద్ది స్వర్ణయుగమన్నా! నాటికీ నేటికిన్.**

ఈ కావ్యం 7 ఘట్టాలుగా రచించబడింది. ఇందులో రైతు తన గొడ్డు గోదతో ప్రకృతి నాశ్రయించి చేసే సహజీవనం, మెట్ట సేద్యపు తీరుతెన్నులు, పొలాలలో రైతు దంపతులపాట్లు, కూలీల స్థితిగతులు వాని మనోభావాలు, మాగాణి రైతుల వెతలు, గ్రామీణ జీవన సౌందర్యం, కొండ ప్రాంతాల జనజీవనం అద్భుతంగా చిత్రించబడ్డాయి.

**సేద్యమొరులపాలు జీవమ్ము మఱిపాలు**
**స్వాస్థ్యమంతొ యింతొ చదువుపాలు**
**కష్టమోట్లపాలు కల్మిదంబముపాలు**
**మా చరిత్ర తుదకు మచ్చపాలు**

అంటూ రైతుపడే ఆవేదన ఏనాటికీ తీరనిదే.

**పంటపొలతి కదుపుపండి కైవ్రాలినం**
**బుడమితల్లి యేటఁ బురుడు పోసిపంపు**
**హాలికుండు తెచ్చి లాలించుటేగాని**
**పాడి దొరగి పరుల పంచఁ జేరు.**

అన్నమాట కూడా అక్షరసత్యమే.

ఆంధ్రకవి లోకం అటు భావకవితాలహరిలోను, ఇటు అభ్యుదయ కవితా ఝరిలోను ఓలలాడుదుతున్న ఆ దినాలలో నరసయ్యగారు పలనాటి సీమలోని ఒక మధ్యతరగతి కుటుంబగాథను 'ప్రేమాలోకం' పేర హృద్యమంగా చిత్రించారు. ఆ కావ్య కథ యిది.

రాయడు, గంగమాంబ దంపతులకు నలుగురు పిల్లలు పుట్టి పోయినవేళ రాయని చెల్లెలు మీనాంబ తలచెడి అయిదేళ్ల కొడుకు పద్మానాయుడుతో అన్న ఇల్లుచేరుతుంది. ఆ తరువాత రాయడు దంపతులకు ఆడపిల్ల పుడుతుంది. ఆమెపేరు శాంత. ఆ పిల్లలకు వయసుతోపాటు అనురాగాలు పెరిగినా గంగమాంబ పట్టుపట్టి శాంతను బలవంతంగా శ్రీమంతుడైన భిక్షాలుకు రెండవ పెళ్ళికి ఇచ్చి చేస్తుంది. భిక్షాలుతో వివాహమైనా శాంత అతడికి దూరంగానే ఉంటుంది. మీనాంబ పాముకాటుకు చనిపోగా పద్మానాయుడు గాంధి సందేశాన్ని అందుకొని గ్రామ పునర్నిర్మాణానికి నడుంకడతాడు. రాయని ఇల్లు తగలబడగా అందులో చిక్కి గంగమ్మ మరణిస్తుంది. వర్షాకాలంలో వచ్చిన తుఫాను వరదలో కొట్టుకుపోతున్న శాంతను పద్మానాయుడు రక్షిస్తాడు. అది చూచి రాయడు ఈ జన్మకిది చాలనుకొని తృప్తిపడి చంద్రభాగా నదిలో దూకుతాడు. అతడిని రక్షించడానికి తెప్ప మీద వెళుతున్న శాంత, పద్మానాయుడు సుడిగుండంలో చిక్కి మరణిస్తారు. ఆ విషయం తెలుసుకొన్న భిక్షాలు వారికి స్మృతి చిహ్నాలను ఏర్పాటు చేసి తాను యోగిగా మారిపోతాడు. వారిరువురి ప్రేమను అవలోకించగలుగుతాడు.

పది జ్యోతులుగా 406 పద్యాలతో రచించబడిన ఈ కృతిలో కవి ప్రేమతత్త్వాన్ని చక్కగా వివరించారు.

ప్రేమాలోకాన్ని ప్రకటించిన 1941లోనే ఏటుకూరి వారు 'రైతు' అన్న హరికథను ప్రకటించారు. ఇందులో రైతు జీవితం కరుణ రసాత్మకంగా చిత్రించబడింది. ఆనాటి సాధారణ కర్షక గృహిణి నిత్యకృత్యాన్ని కవి ఎలా కన్నులకు కట్టి చూపించారో చూడండి.

**ఎంతయుఁ బ్రొద్దున లేచి ముందుగా నేకులరాటము పెట్టున్**
**కాంతుడు లేచీ లేవక మునుపే గడ్డపెరుగుఁ జిలకొట్టున్**
**బలబలమని తెలవారుచుండగాఁ బాఁచిపనులు నెఱవేర్చున్**
**కలగల మొగమున బొట్టొకింత యిడి కాంతుని మదిలోఁ జేర్చున్**
**మప్పితమ్ముగా జొన్నలొ సజ్జలొ చిప్పలు పడఁగా దంచున్**
**చిట్టు తవుడు నిడి పాఁడి గేదెలకుఁ జిక్కని కుడితిం ద్రాపున్**
**ఉడుకు మెదుకుఁదిని పతికన్నముగొని మడకచేని కేతెంచున్.**

1944లో ఏటుకూరి వారు 28 ఖండకవితలను 'త్రివేణి'గా ప్రకటించారు. ఇందులో 331 పద్యాలు, 2 గీతమాలికలు, 4 ద్విపద కవితలు, ఒక గేయ కవిత ఉన్నాయి. వీటిలో ఆనాటి పలువురి పెద్దలు గుణకీర్తనలతో పాటు ముచ్చటగా మూడేళ్ళు పెరిగి మరణించిన కుమార్తె మగువ మాంచాల ముద్దుముచ్చట్లు వర్ణించబడ్డాయి. ఆమెను 'నీకు పునర్జన్మ మున్న మాకే జన్మింపు'మని అర్థించారు. తన గురువు ఆప్పుడు అయిన కవిరాజు త్రిపురనేని రామస్వామి గారి సన్మానానికి పరవశించారు.

**నీ రచనాభి ఘాతముల నేఁటి కపార పురాణగోపుర**
**ద్వారకవాట పంక్తులు బదాబదలైనవి యింత కీ వసా**
**ధారణ భావ విప్లవ విధాతవు గైకొనవన్న! దివ్య క**
**ర్పూర సుగంధ వస్తు పరిపూర్ణ సువర్ణ జలాభిషేకమున్.**

**గంగోత్తుంగ తరంగరింగణ సదృక్షంబైన నీ శైలితో**
**లుంగీకట్టిన కావ్యకన్యకలు వేలున్ లక్షలున్నారు నీ**
**బంగారంపుఁ గవిత్వవస్తువులతోఁ బైపోటికిన్ నిల్చి మా**
**పింగాణీ సర కమ్ముకొన్నయెడఁ గాఫీనీళ్ళకుం గిట్టునా?**

'ఆంధ్రప్రపంచమునకుఁ బౌరుషజ్యోతియని పేరు పడిన'ది పలనాడు.

**నే నిటువంటి వీరధరణిన్ జనియించినవాడఁ గాన మ**
**న్మానస రాజహంస మసమానతదీయ సుధానదిన్**
**స్నానము లాడు నే సుకృత జన్మఫలమ్మున కెగ్గమైతినో**
**గాని తదీయ దృశ్యములు కన్నులఁగట్టు యథాతథమ్ముగన్**

క్రీ.శ. 12వ శతాబ్దంలో జరిగిన పల్నాటి యుద్ధ ఘట్టాలు వేంకట నరసయ్యగారిని విశేషంగా ఆకర్షించాయి. చిన్ననాట తన పాలేరు ద్వారా ఆ గాథలు విని, తరువాత పలనాట గల పలు గ్రామాలను తిరిగి ఆ కథాంశాలను సంగ్రహించి వాటిని తన అణువణువునా జీర్ణించుకొని 'వీర భారతము' పేర ఆ కథను 8 గ్రంథాలుగా వ్రాయదలిచారు. అయితే వాటిలో 4 గ్రంథాలనే వ్రాశారు. 1942లో 'మగువ మాంచాల'ను, 1944లో 'నాయకురాలు'ను, 1947లో వీరభారతము అన్న అలుగు రాజు కథను, చివరగా 'అలరాజు రాయబారము'ను రచించారు. ఈ రచనలలో ఉత్తమోత్తమము, తలమానికము అనదగిన రచన 'మగువమాంచాల.'

ఇందులో ఏటుకూరి వారు మాంచాల పాత్రను మరచి పోదామన్నా మరపురాకుండా తీర్చిదిద్దారు. పతివ్రతామతల్లిగా, దేశభక్తురాలిగా, ప్రణయసుందరిగా, వీరనారిగా, స్త్రీ రత్నంగా మాంచాలను అద్భుతంగా అనితరసాధ్యంగా చిత్రించారు. ఆమెను తెలుగునాట ఇంటింటి ఆడపడుచును చేశారు. 12 ఖండాలుగా, 411 పద్యాలుగల ఈ నిర్వచన కావ్యంలో ప్రతి పద్యము రసజ్ఞ పాఠక హృదయాకర్షము. ప్రజల పలుకుబడుల నెన్నిటినో గ్రహించి యీ కావ్యం ద్వారా వాటికి కావ్యగౌరవము కలిగించారు. జాను తెనుగుపై వీరికి గల అభిమానానికి మాంచాలను వర్ణించిన యీ క్రింది పద్యము నిదర్శనము.

**మాంచాల కాలికి కమ్మల జోడు సవరించి**
**కచ్చుపోసిన సూసకము ఘటించి**
**మొగలాకు కీల్జడ మునఁగఁ జొళ్ళె మమర్చి**
**పాదుదప్పిన యడ్డబాసదిద్ది**
**జిలుగు పావడ పైఁడి మొలనూలున బిగించి**
**నేతైన కరకంచుపైటసర్ది**
**పనితంపు గిలుగు పావలు కాళ్ళఁ గీల్కొల్పి**
**కమ్మని కప్రంపు దమ్మ నమిసి**
**అడుగులోన నడుగు నంతలో నాత్రమ్ము**
**మూఁగనోము మేలి ముసుఁగొకింత**
**తోడుపడఁగఁ దల్లి మేడ కొకర్తుకే**
**గబ్బిగీములోనఁ గదలి చనుచు**

బాలచంద్రుడు యుద్ధానికి బయలుదేరుతూ మాంచాల వద్దకు వెళ్ళి ఆమె మధుర రూపానికి ముగ్ధుడై ఆమె పరిహాస వచనాలకు ప్రేరేపితుడై ఆమెతో సమాగమానికి ఉద్యుక్తుడైనప్పుడు అతడిని వారించి మాంచాల పలికిన పలుకులు మహాకవిత్వ చిహ్నితాలు.

**ఎలపయిఁగాలుద్రువ్వి ధ్వజమెత్తిన శత్రులపై నటించు దో**
**ర్బలమిటు లంగునాజినముపై మెఱయింతురె? యింతయేల పె**
**ద్దలు వలసేగునాటి శపథమ్ము లెఱుంగరె? యైన యుద్ధ యా**
**త్రలు సనువారు కామపరతంత్రులు గాఁదగునా? మనోహరా!**
**మీ జయలక్ష్మి కీ తెలుగుమేదిని? దీవ్యదఖండవీర నీ**
**రాజనమిచ్చితీరు! నిట రాచబయళ్ళు సదా భవద్ధను**
**ష్టూజలొనర్చి తీరు! నిటఁ బుట్టిన లే తృణమైననున్ భవ**
**త్తేజము గ్రక్కి తీరు! నిది తెల్లమ బాదమవంశ వర్ధనా!**

760 పద్యాలుగల 'నాయకురాలు' ఈ వీరగాథా రచనలలో మరొక మణిపూస. ఇందులో నాగమ్మ పాత్ర అద్భుతంగా చిత్రీకరించబడింది. ఆమె దృఢచిత్తం. కార్యకుశలత, వాగ్వైచిత్రి, పగ, ప్రతీకార వాంఛ, ప్రేమాభిమానాలు ఈ రచనలో రూపుకట్టాయి. ఆమె ఆనతిస్తే 'రేయింబవలై పవలున్ రేలయి జోహరు లాచరించు'నట.

**పట్టిన పట్టు నెగ్గుటకు ప్రాణములొడ్డి తదన్యపక్షమూఁ**
**కొట్టదు త్రాఁచుపాము పగకుం బదిరెట్లధికమ్ముగాఁ బగం**
**బట్టు నెదుర్చు వైరిపసఁ బట్టుఁ బ్రపన్నులఁ జేరఁబట్టు ని**
**ట్టట్టనవచ్చునే పరులకైన తదద్భుత సాహసిక్యముల్**

**నా రక్తమ్మొక బొట్టు చింద నెఱటుఁగండా వేలకున్ వేల సృ**
**గ్ధారల్ నేలఁదొరంగు నుక్కుసెడి డొక్కల్ డొల్లు నిర్జీవమై**
**ఘోరాజింబడు వీనిమేని పయిఁ గాకుల్ గ్రద్దలఱ్ఱాడఁగ**
**న్నారం జూచినఁగాక నా హృదయసంతాపమ్ము చల్లారునా?**

వంటి పద్యాలు ఆమె మనస్తత్వానికి అద్దం పడతాయి.

737 పద్యాలు గల వీర భారతము కావ్యము పలనాటి కథా ఘట్టాలలో తొలి ఘట్టమునకు చెందినది. చక్కని జాతీయాలతో, లోకోక్తులతో, సూక్తులతో, సమయోచిత ప్రకృతి వర్ణనలతో నిండిన రసవత్కావ్యమిది.

**మిన్నక సేతురు చేసిన**
**దెన్నరు పై కుబ్బనీయ రింతులు ప్రత్యు**
**త్పన్నమతు లందు మన్నున్**
**మిన్నున్ దాళంబు వేసి మెప్పించరటే**

అన్న స్త్రీ మనస్తత్వ చిత్రణ హృద్యము.

నరసయ్యగారు రచించిన 'అలరాజు రాయబారము', 'రుద్రమదేవి' అన్న మరొక చారిత్రక కావ్యము వారి మరణానంతరము వెలుగు చూచినవి. వీరు 'బాలచంద్రుడు' అన్న వచన రచనను, గాథావళి అన్న మర్యాదరామన్న కథలను కూడా వ్రాసి ప్రకటించారు. పిల్లలకోసం చందమామ పత్రికలో అనేక రచనలు చేశారు. ఇంకా, సుశీల, నర్మద అన్న ఖండకావ్యాలు, అంగద రాయబారము, జిబిలిక (గేయ కావ్యం), జయప్రద (నాటకం), బుద్ధిజీవులు, ప్రతాపసింహ (నవలలు), కళ్యాణ రాఘవం, రఘుపతి, నిరుద్ధ సైరికమ్ వంటి రచనలను కూడా చేసినట్లు తెలుస్తున్నది కాని, ఇవి అలభ్యములు. ఇవిగాక ఎన్నో గేయాలు వ్రాశారు. వేంకట నరసయ్యగారు 1949 నవంబరు 10న విష జ్వరంతో కన్ను మూశారు. ఈ 39ఏళ్ళ జీవితకాలంలోనే వారు ఇన్ని రచనలను చేయటం ఆశ్చర్యం కలిగిస్తుంది. వేగవంతమైన కవితాధారతో జీవద్భాషలో పద్యరచనను ఒక తపస్సుగా నిర్వహించిన ఈ మహాకవికి ఇదే నిండునూరేళ్ళ నివాళి. ⓜ




మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

# బహుమతి

పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹200** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 11. | సిద్ధార్థ " " | 50.00 |

**మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi



భ్రమర నాట్యము

# ముప్పలో రామప్ప

- కుర్రా జితేంద్రబాబు

కాకతీయుల కాలంలో సంగీత, సాహిత్య, శిల్ప, చిత్ర, నాట్యకళా రంగాలు తెలుగునాట అత్యున్నత స్థాయికి చేరినాయి. కాకతీయులు నిర్మించిన దేవాలయాలు అపురూపమైన శిల్పకళలకు నిలయాలు. కాకతీయుల నృత్యకళాభిమానానికి ఇవి పరాకాష్ట. అవి ఆ నాటి శిల్పుల ప్రతిభకు తార్కాణాలు. కళ్యాణి చాళుక్యుల సామంతులుగ పనిచేసిన కాకతీయులు వారి ఆచార వ్యవహారాలనే కొనసాగించి, స్వతంత్రులై ముందు హనుమకొండ, ఆ తరువాత ఓరుగల్లులను రాజధానులుగా చేసుకొని సువిశాల తెలుగు భూభాగాన్ని పరిపాలించారు. దక్షిణాన ఇప్పటి తమిళనాడులోని ఆర్కాటు, కర్నాటకలోని బళ్ళారి, బీదరు జిల్లాలు, ఒడిస్సాలోని కటక్‌వరకూ, ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తరు, దంతెవాడ, మహారాష్ట్రలోని దేగులూరు వరకూ కాకతీయులు విస్తరించి, గణపతి దేవుని (క్రీ.శ.1199-1260) కాలానికి భారతదేశంలోనే శక్తివంతమైన రాజ్యంగా అవతరించారు.

సంప్రదాయ బద్ధమైన వ్యవసాయం, వర్తక, వాణిజ్యాలను, కులవృత్తులను ప్రోత్సహించి, ప్రజల మనోభావాలను గౌరవించి వారు తమకి నచ్చినమతాన్ని స్వీకరించి, మెచ్చిన దేవతలను మొక్కే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలన్నిచ్చారు. అందుకే రాజధానినగరమైన హనుమకొండ గొప్ప జైన కేంద్రంగా ఉన్నా, రుద్ర, వాసుదేవ, ఆదిత్యులకు రుద్రదేవుడు క్రీ.శ.1163లో మత సహనాన్ని ప్రతిబింబించేట్లు వేయి స్థంభాలగుడిగా పిలువబడుతున్న త్రికూటాలయాన్ని నిర్మించాడు. ఆ ఆలయం ఇప్పటికీ తెలంగాణాలోనే ఒక అద్భుత కట్టడంగా భాసిల్లుతోంది. కళ్యాణి చాళుక్య, దేవాలయ వాస్తు సంప్రదాయా లైన, నక్షత్రాకార నిర్మాణాల్లో ఎత్తైన దీపపీఠం పై చుట్టూ ప్రదక్షిణ చేయటానికి వీలుగా నడవ, మధ్యలో దేవాలయాలు, మూడు దేవాలయాలనూ కలిపే రంగమండపం, దక్షిణంవైపు నుంచి ప్రవేశం, గోడలపై అనేకస్థంభాలు అమరిఉన్నట్లు భావనకుగురిచేసే చెక్కడాలు, ఆలయగోడలకు ప్రధానభాగాలైన ద్వారాలకు, స్థంభాలకు, దూలాల మధ్య కప్పులకు నల్లశానపు రాయిని వాడి, వాటిని నగిషీలతో తీర్చిదిద్దారు. అనేక లౌకిక, నృత్య, దేవ, ప్రతిమలను చెక్కారు. రుద్రదేవుని తరువాత మహదేవుడు కొద్దికాలమే పాలించటం వల్ల ఆలయ నిర్మాణంలో అదే ఒరవడి కొనసాగిందే తప్ప ఆయన కాలంలో ఇదీ ప్రత్యేకత అని చెప్పే అంశాలేవీలేవు. క్రీ.శ.1199లో కాకతీయ సింహాసనాన్నధిష్టించిన గణపతిదేవుడు, సుస్థిర ప్రభుత్వాన్ని అందించటమేకాక, వ్యవసాయానికి, కళలకు, కవులకు, మున్నెన్నడూ లేనంత ప్రాధాన్యతనిచ్చాడు. పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే రాజనీతిలో భాగంగా, రక్షణ వ్యవస్థను ప్రక్షాళనం చేయటానికి పూనుకొన్నాడు.

వెంటనే సమర్థులయిన యువకులను ఎంపికచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టి, దివిసీమనుంచి యుద్ధవిద్యల్లోనే కాదు నాట్యవిశారదుడు కూడా అయిన జాయపసేనానికి సమున్నత పదవిని కట్టబెట్టాడు. తద్వారా నాట్యానికి ఎనలేని ఆదరణ దక్కింది. జాయపసేనాని అయ్యకుల సంజాతుడు, పిన్నచోడన పుత్రుడు. వీరిది వెలనాడులోని కొయ్యూరు. వీరి పూర్వికులు చందవోలును రాజధానిగా చేసుకొని తెలుగు ప్రాంతాన్ని పాలించిన వెలనాటి చోళులవద్ద ఉద్యోగించారు. జాయపసేనాని తాత నారాయణ నాయకుడు కృష్ణానది సముద్రంలో కలిసే హంసలదీవి వద్ద నగరాన్ని నిర్మించారు. కాకతీయ గణపతిదేవుడు క్రీ.శ. 1203లో ఈ ప్రాంతంపై దండెత్తి జాయపసేనాని తండ్రియైన పిన్నచోడనాయకుని ఓడించి ఈ ప్రాంతాన్ని ఆక్రమించు కొన్నాడు. ఆ తరువాత వారితో సఖ్యతచేసుకొని పిన్నచోడనాయకుని కుమార్తెలయిన నారమ, పేరమలను వివాహమాడాడు. (ఎపిగ్రాఫికా ఇండికా. వాల్యూం-3, పేజీ 84) ఆనాటికి చిన్నవాడైన జాయపసేనానిపై



కర్తరీ నాట్యము

---

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

స్వయంగా శ్రద్ధవహించి తన మంత్రి గుండామాత్యులచే కళలలో శిక్షణనిప్పించినట్లు నృత్తరత్నావళిలో ...

> **"ప్రేక్ష్యప్రజ్ఞామతిశయవతీం స్వామిభక్తించహర్షాత్
> ఆకౌమారాత్ గణపతినృపోజాయనం సమర్ప్య
> గుండామాత్యే సకలసుమనస్సేవ్యమానేజయంతం
> వాచాంపత్యో హరిరివ కలాం శ్లాఘనీయాం వ్యనైషీత్."**

(1-13) జాయపసేనాని తెలుపుకున్నాడు. ఇతనిని గుంటూరు జిల్లాలోని చేబ్రోలు పాలకునిగా నియమించడంతో పాటు గజసైన్యాధ్యక్షునిగా కూడా నియమించాడు. (ఎపిగ్రాఫికా ఇండికా. వాల్యూం-5, పేజి 142-143)

అలానే తన సామంతులై పిల్లలమర్రి నుంచి పాలిస్తున్న రేచర్ల రెడ్ల వంశంనుంచి రుద్రదేవుని ఎంపిక చేసుకొని సర్వసైన్యాధ్యక్షునిగా చేసుకొన్నాడు. ఇతడు రామప్ప దేవాలయాన్ని నిర్మించాడు. రామప్పదేవాలయములో క్రీ.శ. 1213లో వేయించి శాసనములో రేచర్ల రుద్రుని వంశ వర్ణన ఉన్నది. రేచర్ల వంశకర్త బ్రహ్మసేనాపతిని ఇతడు గొప్ప శూరుడని, కాంచీనగరాన్ని జయించి కాకతిరాజ్య రమావల్లభునికి కాంచీ నగర కన్యఅను వీరలక్ష్మితో వివాహ మొనర్చినాడని ఈ శాసనములో పేర్కొన్నాడు. ఈ వంశంలో కాటయ అతని కుమారుడు కామ చమూపతులు ప్రసిద్ధులు. కామచమూపతి మంథెన గుండనను జయించి నాడు. కామ చమూపతి కుమారుడు కాట చమూపతి. ఇతడు శివపూజా దురంధరుడు. ఇతని కుమారుడే రుద్రసేనాని. రుద్రసేనాని కాకతిరుద్రదేవుని సేనానాయకులలో ముఖ్యుడు. కాకతిరాజ్యం పతనావస్థలో ఉన్నప్పుడు, రాజ్యం సంక్షోభ స్థితిలో ఉన్నప్పుడు శత్రువుల బారినుండి, అవిధేయులైన సామంతుల తిరుగుబాటు నుండి, రాజ్యాన్ని రక్షించి 'కాకతిరాజ్య స్థాపనాచార్య' బిరుదును రేచర్లరుద్రుడు వహించాడని రామప్పశాసనం పేర్కొంటున్నది.

ఒక వైపు జాయపసేనాని, మరో వైపుదేవాలయ నిర్మాత లైన రేచర్ల రెడ్డి కుటుంబంనుంచి వచ్చిన రుద్రుని తన కుడి, ఎడమ భుజాలుగా చూచుకొన్నాడు. గణపతి దేవుని కాలంలో సామంతులు, రాణులు, మంత్రులు, సైన్యాధ్యక్షులు, ఇతర ఉన్నతోద్యోగులు, ధనిక ప్రముఖులు సొంతంగా ఆలయాలనిర్మాణం, గ్రామ, పట్టణాలనిర్మాణం, చెరువులు తవ్వించటం లాంటి సమాజహిత కార్యక్రమాలను చేపట్టటానికి స్వేచ్ఛనిచ్చాడు. అందుకనే, వారు ప్రభువు అడుగు జాడల్లో నడుస్తూ అనేక ధార్మిక కార్యక్రమాలకు చేయూతనిచ్చి, ఆయా సందర్భాల్లో వేసిన శాసనాల్లో కాకతీయ గణపతి దేవుని కృతజ్ఞతాపూర్వకంగా కీర్తించారు. ఈ దేవాలయాల నుండి మధ్యయుగాల నాటి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, చరిత్రకు సంబంధించి అనేక వివరాలను పరిశోధకులు సేకరించవచ్చు. రేచర్ల నామిరెడ్డి నల్లగొండ జిల్లా, పిల్లలమర్రి దేవాలయంలో వేసిన శాసనములో దేవాలయ గాయకులకు, మార్దంగికులకు, నర్తకులకు, గృహాలను దానం చేసినట్లు పేర్కొన్నారు. (Corpus of Inscriptions of Telangana No.37) నల్లగొండ జిల్లా, పానుగల్లు నందు మైలాంబ వేయించిన శాసనంలో కూడా సంగీత, నృత్యకారులకు చేసిన దానముల వివరములున్నాయి. (Corpus of Inscriptions of Telangana No.36) రుద్రమదేవి మల్కాపురంలో వేయించిన శాసనంలో పదిమంది వేశ్యలను దేవాలయానికి దానం చేసినట్లు పధ్నాలుగు మంది గాయకులను పాడుటకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నది. రేచర్లరుద్రుడు క్రీ.శ.1213లో పరుచుకొన్న పచ్చటి తివాచీలాంటి ప్రకృతి ఒడినడుమ, అందాన్ని మరింత ఇనుమడింపజేసే కొండసానువుల దిగువభాగానగల పాలంపేట గ్రామంలో అనువైన ప్రదేశాన్ని ఎన్నుకొని తానుకూడా, తన ప్రభువు మాదిరే శివునికి ఒక వినూత్నమైన ఆలయాన్ని నిర్మించాలనుకొన్నాడు. రాజాజ్ఞతో అక్కడికి వెళ్ళి చేయితిరిగిన కాకతీయ శిల్పుల్ని రప్పించి, తానొక అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాలను కొన్నాననీ, కాకతీయసామ్రాజ్యానికే మణిమకుటంగా విరాజిల్లేటట్లుగా ఆ దేవాలయం భాసిల్లాలనీ తన కోరిక తెలియజేయగా అప్పటి కపుడు బట్టపై సైన్యాధ్యక్షుని ఊహలకు రూపం కల్పించి, కొయ్యతో నమూనా దేవాలయాన్ని చెక్కిచూపించి మెప్పుతో అంగీకారం పొందారు కాకతీయశిల్పులు. మునుపటి కళ్యాణి చాళుక్య దేవాలయ వాస్తు శైలినే ఎంచుకొన్నా, నిర్మాణం వరకే పరిమితమై, ఎత్తైన దీపపీఠంలో మరిన్ని వర్గాలను చేర్చి అందాలను ఏరికూర్చి, నట్టనడుమ చిన్నదైనా మన్నికగల అధిష్ఠానాన్ని రచించి, ఎత్తైన పాదవర్గం (గోడభాగం)లో మునుపెన్నడూ లేని మంచబన్ధకోష్ఠాలు, (సాధారణంగా దేవాలయ గోడ వెనుక ప్రక్కలలో మధ్యభాగాన మామూలు కోష్ఠాలుంటాయి.) అంటే ఒకే కోష్ఠం మూడంతస్తులతో ఉండేట్లు, పైన శిఖరం, స్థూపంతో ఆలయానికే ఆకర్షణను తెచ్చి పెట్టారు. మునుపెన్నడూ లేనట్లు, గోడలపై నుండి ప్రస్తరకపోతాన్ని (చూరు) బాగా వెడల్పుగా, ముందుకు వచ్చేట్లు

తీర్చి దిద్ది, వర్షంనీరు ఏమాత్రం ఆలయభాగాలపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అంతేకాదు, కపోతం (చూరు) కిందిభాగాన రకరకాల పట్టలతో, చట్టాలతో, అలంకరణలతో చూపరుల మతిబోయేట్లు వద్రంగులను మైమరపించేట్లు చిత్ర, విచిత్ర కల్పనలు మలిచారు రామప్పశిల్పులు. ఇక ఆలయంలోనికి ప్రవేశించగానే అధిష్ఠానంపై భక్తులు ఆనుకొని కూర్చోటానికి వీలుగా కక్షాసనాలను తీర్చిదిద్దారు. వీటి బయట భాగాన సందర్శకులను మంత్రముగ్ధులను చేసేట్లు శృంగార, మైథున, శిల్పాలతో పాటు రుషిపుంగవుల, జైన తీర్థంకరుల విగ్రహాలను కూడా మలిచారు.

రంగమండపం స్థంభాలపై లెక్కకు మించిన శిల్పాలు, నాట్యభంగిమలు, పురాణ, రామాయణ, భాగవత, భారత ఇతివృత్తాలను కళ్ళకు కట్టినట్లు చెక్కారు. స్థంభాలపై కుడ్యాలను, ఫలికాపద్మాలను ఎంతో నేర్పరివంతంగా తీర్చిదిద్దారు. దూలాలపై కాలనాళికలన్నట్లు అమృతమథనం, త్రిపురాసురసంహారం, రామ-రావణ యుద్ధం, ధన్వంతరి శిల్పాలను ఎంతో హృద్యంగా చెక్కారు. కప్పురాళ్ళపై వాహనాలపై ఉన్న దిక్పాలకులు మధ్యలో నటరాజమూర్తి, శిల్పాలు, 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా చెక్కారు. గర్భాలయంలో ప్రతిష్ఠితమైన రుద్రేశ్వరుని దర్శించాలనుకొన్నా, అందరిదృష్టి, అపురూపంగా చెక్కిన ద్వారబంధాలు, వాటిపై శాఖలు, కింద సుందరశిల్పాలు, వేటగత్తెలపాట్లు, లోనికి వెలుతురు రావటానికి కిటికీలు, కిటికీ **కళ్లపై** అలనాటి నాట్యభంగిమలు, కరణాలు, అభినయ, నృత్యరీతులు మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బహుశా రేచర్ల రుద్రుడు, జాయపసేనాని సహవాసం వల్ల అబ్బిన నాట్యాభిరుచిని ఇక్కడ తెలియజెప్పు కొన్నాడేమో, ద్వార బంధాల పైనున్న పతంగంపై శివుడు నటరాజ రూపంలో చేస్తున్న తాండవం మనల్ని మమేకం చేస్తుంది. ఇక్కడ మలచిన నాట్య భంగిమలను, జాయపసేనాని రచించిన నృత్త రత్నావళిలోని నాట్య సంప్రదాయాలను తులనాత్మక పరిశీలనచేసి పరిశోధించిన ఎన్నో నాట్య విశేషాలు బహిర్గతమౌతాయి. దేవాలయ దర్శనమైన తరువాత రంగమండపం బయటికొచ్చిన వారికి, తంజావూరు బృహదీశ్వరా లయంలో మాదిరిగా వ్యవసాయం పట్లమక్కువ గల కాకతీయ రాజుల అభిమతానికి మచ్చుతునకగా, దుక్కిటెద్దులపట్ల గల మమకారాన్ని అంతా కలిపి చెక్కించుకొన్న నంది, నందిమండపం, అటు అంతకుముందు కళ్యాణి చాళుక్యుల దేవాలయాల్లోగానీ, లేక అప్పటివరకూ కట్టిన కాకతీయదేవాలయల్లో ఎక్కడా లేనట్లు విలక్షణ వాస్తుశైలిలో నిర్మించారు. రంగమంటపం చుట్టూ బయట, స్థంభాల నుంచి పైన ముందుకు పొడుచుకొచ్చిన కపోత భాగపు బరువును కొంతైనా పంచుకొందామను కొన్నట్లు శిల్పులు మదనిక, నాట్యగత్తెలు, నాగినులు, సింహాల బొమ్మలను తీర్చిదిద్దారు. కొందరు నాగినులు నగ్నంగా ఉంటే, మరి కొందరు భామలు హొయలొలికిస్తూ, విచిత్ర వస్త్రధారణతో, ఎంబ్రాయిడరీ బట్టలతో, ఎత్తుమడిమల చెప్పులతో రకరకాల చెవిదిద్దులూ, అంగాంగానికీ ఆభరణాలతో అప్సరసలనుసైతం కవ్వించి, అలంకరణలో, అందంలో తమకు సాటిరారన్న గర్వంతో సవాలు విసురుతూ, తెలంగాణా ప్రాంత యువతులు మొదటి నుంచి ఆధునికతకు, నాగరికతకూ ప్రేమికులని రుజువు చేస్తున్నాయి. మరో విచిత్రమేమంటే శిల్పులు సర్వశాస్త్రవిశారదులు. సకల విద్యాప్రవీణులు. ప్రయోగశీలురు. అప్పటికే భారీశిలలతో బరువెక్కిన దేవాలయానికి మరింత బరువు కాకూడదని, గర్భగుడిపై విమానాన్ని నీళ్లలో తేలే ఇటుకలతో నిర్మించి, నిర్మాణరంగంలో యావత్‌భారతదేశంలోనే తమకెవరూ సాటిరారన్న విషయాన్ని రుజువు చేశారు రామప్పశిల్పులు. మరో విషయమేమంటే, దక్షిణాన కళ్యాణమండపం, ఉత్తరాన అమ్మవారి గుడి, ఎదురుగా కొంచెం పక్కన ఆలయ నిర్మాత, స్ఫూర్తిప్రదాత రేచర్ల రుద్రరెడ్డి వేయించిన శాసనం, ఆ శాసనానికి ఒక మండలం, చుట్టూ ప్రాకారం ఇలా విలక్షణ వాస్తుశైలికి ప్రతినిధిగా నిలిచింది. ఈ దేవాలయానికి వెనుక క్రీ.శ. 1213లో రేచర్ల రుద్రుడు నిర్మించిన గొప్ప చెఱువు నేటికీ వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తూ ఇన్ని తరాలుగా ప్రజలకు జీవనాధారంగా నిలిచింది. ఈ చెఱువుని కూడా దేవాలయంతోపాటే నిర్మించారు. ఒక్క రెండు వేల అడుగులు మాత్రమే కట్టవేసి అద్భుతమైన జలాశయాన్ని నిర్మించి ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి సవాలుగా తటాక నిర్మాణపద్ధతుల్ని సూచించారు. ఈ దేవాలయ, తటాక నిర్మాణాలు ఆనాటి విజ్ఞానానికి ప్రతిబింబంగా, తెలంగాణా తల్లి కంఠాభరణంగా, ప్రపంచ వారసత్వకట్టడాల జాబితాలో చోటు దక్కించుకోవటానికి తహతహలాడుతున్నాయి. రామప్పదేవాలయం కాకతీయుల కళావైభవ చిహ్నం. దానిని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిదీ. ఇప్పుడు దేవాదుల సొరంగమార్గ నిర్మాణం వల్ల ఏర్పడే ముప్పును తప్పించాల్సి వుంది.



# నా ఆధునిక కవితా నేపథ్యం

- వేగుంట మోహనప్రసాద్

ఆధునికతకి మరోపేరు అన్వేషణత్వం. ఈనాటి రోబో కూడా ఆలోచిస్తున్నాను కనుక నేనున్నానంటుంది. ఆధునిక కవి ఆలోచించే రోబో. 'ఒక లక్ష నక్షత్రాల మాటలు/ఒక కోటి జలపాతాల పాటలు/శతకోటి సముద్ర తరంగాల మ్రోతలు' (శ్రీశ్రీ) వింటూ ఆలోచిస్తున్న రోబో ఆధునిక కవి.

అన్వేషణలో అన్నీ అనుమానాలే సందేహాలే సంఘర్షణలే. దేన్ని గురించి ఈ అన్వేషణ? అస్థిత్వం యొక్క అర్థాన్ని గురించి ఈ అన్వేషణ.

అసలు ప్రశ్నలకోసమే ఈ అన్వేషణ. ఉదయమే లేచి "కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే" అని పాడుకుంటూనో 'ఉదయాన సూర్యుడూ ఉల్లిపూవూ ఛాయ... మధ్యాహ్న సూర్యుడూ మంకెన్న పూఛాయ... కుంగుతూ సూర్యుడూ కుంకుమా పూ ఛాయ" అని ఆరాధిస్తోనో లేదా మరో మత సంస్కృతిలో ...

"Our Father which art in heaven;
Hallowed be thy name,
Thy kingdom come,
Thy will be done
In earth as it is Heaven"

అని ప్రార్థించుకుంటూనో, నృసింహ శతకం వల్లె వేస్తూనో Francis Thompson 'Hound of Heaven' న్ని ఊపిరాడకుండా ఉద్గీతంగా పఠిస్తుంటేనో ఈ ప్రశ్నలు తలలెత్తవు. ఆ ఆరాధనీయ పురాణ పురుషులకూ విశ్వంలోని అంతరిక్షంలోని నక్షత్రగణాలకూ, వర్తమానంలోని మానవునికీ పరాయీకరణ జరిగిందేమిటి, ఇదేమిటనే ఆందోళన, ఆశ్చర్యాలలోంచి అస్తిత్వవేదన ఉద్భవిస్తుంది. అదొక సంవేదనా సంహిత. దీన్నే "Hubris clobbered by nemisis" అంటారు. Brain Aldiss 1973 లో "Billion Year Spree" గ్రంథం రాసి మళ్ళీ 1986లో కొనసాగింపుగా "Trillion Year Spree" రాసాడట. తెలుగు కవి కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ "ట్రిలియన్ గెలాక్సీల ప్రవర్తన నుండి /ఆవిష్కృతమయ్యే విశ్వ సంస్కృతిని" గర్భవాస శృతిలోనే దర్శించుకొంటున్నాడు. కవిత్వ ఆవిర్భావం ఇలా ముందు వెనుకలకు జరుగుతూంటుందను కొంటాను నేను.

ఊహ⇨వస్తువు⇨పరిచయం⇨అనుభవం

జ్ఞాపకం⇦ అనుభవం⇦ ఊహ⇦⇨ వస్తువు

⇦సహజాతం⇦⇨సమాజం

వ్యక్తి⇦⇨గతం⇦⇨వ్యక్తిగతం

⇦అవ్యక్తం⇦⇨వ్యక్తావ్యక్తం⇦⇨వ్యక్తం = కవిత్వం.

ఈ ముందు వెనుకల కదలికలోనే "సజల సంయోగాలు, విమల వియోగాలు" ఇమిడి వుంటాయ్. ఈ ఆనంద విషాదాల్ని చెప్పడం అనే చేతలో చెప్పుకోవాల్సిన అవసరం అనే చేతన నిబిడమై ఉంటుంది.

అయితే ఈ చేతనని వ్యక్తీకరించే మార్గాలు, శిల్పాలు, శైలులు, భిన్నభిన్నాలుగా ఉంటై. " I Fall up on the thorns of Life - I bleed" అని షెల్లీ అంటే 'పాడకే నారాణి పాడకే పాట-పాట మాధుర్యాల ప్రాణాలు మరగెనే" అని ఒకడంటాడు. మరొక కవి ప్రపంచపు తిరునాళ్ళలో తప్పిపోయానని ఎక్కెక్కి ఏడుస్తోంటే కృష్ణశాస్త్రి "ఒక్కడనే పడిపోదును/శూన్యమున/ఒకడనే కృశియింతును." అంటాడు.

సమకాలీనత నుండి విడివడే ఆధునికత ఎప్పుడు మొదలయింది? ఎట్లా మొదలైంది అనే ప్రశ్నలకు నిర్దుష్టమైన తేదీ కాని ఉదాహరణ కాని ఇవ్వటం సాధ్యమైన విషయం కాదు. ఆధునిక కవిత్వపు ఆరంభాలు ఆంగ్ల కవిత్వపు క్షీణ దశాబ్దమైన 1890లో కన్పిస్తాయి. మరీ ముఖ్యంగా ఎర్నెస్ట్ డౌసన్ రాసిన "Non sun qualis eram bonae sub regno cynare" అనే కవితలో దాని పాద పంక్తులు.

"I have forgot much, cynare ! gone with the wind
Flung roses, roses riotously with the throng,
Dancing, to put thy pale, lost lilies out of mind;
But I was desolate and sick of an old passion."

ఈ కవిత నుంచి ఇంకా కొంచెం ఓ డెబ్బై ఏళ్ళు వెనక్కు వెళ్తే కీట్స్ కవిత la belle dame sans merci లోని మాంత్రిక, తాంత్రిక వాదంలో కన్పిస్తయ్. ఆ మాంత్రిక లోకపు ఐంద్రియ ప్రతీకల్లో కన్పించే ఊహాత్మక వాస్తవికతని ఈ పంక్తులు పట్టుకుంటాయ్.

She took me to her elfin grot
and there she wept and sighed full sore,
She found me roots of relish sweet
And honey wild, and manna dew"

డౌసన్ చేసిన ప్రేయసి పట్ల అపచారం, కీట్స్ రాక్షస ప్రేమకు లోనయిన విధానం రెండూ కవిత్వావిర్భావానికి నేను ఇందాక ఇచ్చిన చట్రంలోనే ఇమిడి ఉంటాయి.

డౌసన్‌ది – ఊహతో మొదలై వస్తువుని వెదుక్కున్న తర్వాత దాని పరిచయంతో పంచుకున్న అనుభవం. ఆ అనుభవానికి పశ్చాత్తాప జ్ఞాపకపు వ్యక్తిగతం. ఆ గత అనుభవపు స్మృతిలోని వైయక్తిక వ్యక్తావ్యక్త నేరభావన కవిత్వరూపంలో వ్యక్తం.

కీట్స్ కవిత–వస్తువుని ఊహించిన అనుభవసార పరిణామపు పశ్చాప్తత. కీట్స్ వస్తువుతో బాటు వ్యక్తిని కూడా ఊహించుకున్నాడు. ముందుగా తాను పరాయీకరణ చెంది మంత్రగత్తె ప్రేయసికి పరయత్తమైనాడు. ఆ ఊహాజనిత వ్యక్తి గత అనుభవసారాన్ని మంత్రలోకపు సరిహద్దుల వద్ద సర్వజనీనం, సర్వకాలికం చేసాడు. పై రెండు కవితల్లోనూ కవిత్వ ప్రతీకలైన గులాబీలు, లిల్లీలు, వైన్, మన్నా, గుర్రపు స్వారీ, నృత్యం సాధారణాంశాలు. ఆనందం విషాదమవటం కూడా ఏకాంశమే. సామాన్యాంశమే. కీట్స్ కవిత ప్రాచీన సీమా మాయా సమయబద్ధం. డౌసన్ కవిత ఆధునికం.

మరీ దేశానికీ దేశానికీ ఆధునిక కవితావిర్భావకాలాల్ని గుర్తింపలేకపోయినా కనీసం ఖండానికీ ఖండానికీ ఆ కాల విభజనని చేయవచ్చు. అన్ని దేశాలకంటే ముందుగా ఫ్రాన్స్‌లో ఆధునిక కవిత మొదలయిందని కవిత్వ చరిత్రకారులు చెప్తున్నారు. 1890 నుంచి 1940 దాక అది ఫ్రాన్స్‌లో కొనసాగిందనీ, రష్యాలో 1920లలో ననీ, ఆధునికత ఏసాహిత్య రూపంలో ననేదీ, ఏ సాహిత్య సంగీత, శిల్ప, చిత్రకళ, వాస్తుకళా రూపాలలో ననేదీ, అవసలు కేవలం కదలికలా లేక ఉద్యమాలా అనేవీ వేరు వేరు విషయాలు. కవిత్వపు ఆధునిక కదలికలూ, పోకడలూ, ఉద్యమాలూ, తిరుగుబాట్లూ, తిరుగుబాటలూ కొన్ని ఉన్నై. స్థూలంగా వాటి పేర్లూ, భావాలూ, తత్వాలూ, కాలాలూ కొన్నింటిని పేర్కొంటాను.

**దాడాయిజం:** డాడాయిజం ఒక శూన్యవాదం. 1916లో ట్రిస్టన్ జారా జ్యూరిచ్ నగరంలో మొదలుపెట్టాడు. ఏకకాలంలో అన్నీ అయిన్నూ ఏదీకానిది డాడాయిజం. నియమాలకూ ఆదర్శాలకూ ఆచారాలకూ పూర్తిగా విరుద్ధమైన కవిత్వ ఉద్యమం. ఏ సంబంధమూ లేని వస్తువులని నోటికొచ్చిన మాటల్లో వర్ణించటం ఈ శైలి ప్రత్యేకత. ఈ ఉద్యమపు ప్రధానపదం 'nothing'. దీని తర్వాత వచ్చిందే సర్రియలిజం. 1920లో మొదలయింది. అచేతనావస్థలో ఉన్న మనస్సుని చేతనావస్థలో వెలువడే పదాలలో అనుసంధానించటం దీని ప్రత్యేకత. కుతర్కంతో కాక వితర్కంతో ఆలోచించటం. అధివాస్తవికతని సాధించటం గిలామి అపొలెనార్ (1880–1918) సాధించిన పని. ఆంద్రీబ్రీతా (1896–1966) 1924లో అధివాస్తవిక మానిఫెస్టోని ప్రకటించాడు. మనస్సుని పరవశం చేసేసి నిర్హేతుకంగా నిద్రలోలా రాసే కవిత్వం ఇది. కలలకీ భ్రమలకీ మనస్సులోని పాతాళలోకానికీ ఆలోకపు లోయల అఖాతాలకీ వాటిల్లోకి పతనమై పోటానికీ ఈ కవిత్వంలో ఆహ్వానం ఉంటుంది. అధివాస్తవిక కవిత్వ విధానంలో లూయీ అరగా (1897–1982) పాల్ ఎల్వా (1895–1952) ప్రఖ్యాతులు. అధివాస్తవికత చిత్రకళాకారులు మాక్స్ ఎర్నెస్ట్, పికాసో, సాల్వడార్ డాలీలు. ఈ కవిత్వంలో వ్యక్తిగత అరాచకత్వం. స్వయం శోధిత నరకాలకు చోటుంటుంది.

**అడ్వాన్స్ గార్డ్:** (అవంత్ గార్డు) పరిశీలన, పరిశోధన, పరివేషణ దీని లక్షణాలు. అందరికంటే ముందు నడవటం, అన్నిటికంటే కాలానికి ముందునడవటం దీని ప్రత్యేకత. రాజకీయ వాదాలకు కూడా ఇందులో చోటుంటుంది. సింబలిస్టు కవులైన మాలార్మె (1842–98) పాల్ వెర్లైన్ (1844–96) దీని తొలి సభ్యులుగా చెప్తారు. రింబాడ్ (1854–91) ని కూడ తర్వాత ఇలాగే గుర్తు పెట్టుకున్నారు.

**ఫార్మలిజమ్:** ముఖ్యంగా రష్యాలో వచ్చిన కదలిక ఇది. 1930లో ఆఖరయిపోయింది. భాషాశాస్త్రంలో దీన్ని ముడివేస్తారు. రోమన్ జాకబ్‌సన్ (1896–1982) అనే భాషా శాస్త్రవేత్త 1926లో ప్రాగ్‌స్కూల్ భావాన్ని వ్యాప్తం చేసాడు. రూపం, సారం ల విరుద్ధాలు నశించి, 'రచయిత' అనేవాడు అదృశ్యమైపోయే పరిస్థితి ఇందులో కన్పిస్తుంది.

**డికెడెన్స్:** కవిత్వ క్షీణత్వం, అభిరుచి అధోగతి, కావాలని చేసే ప్రయత్నమే. కళ స్వయం చోదితం, స్వీయ స్వేచ్ఛా ప్రతిపత్తి కలది. కళాకారుడు సమాజానికి వెలివాడు. ఎప్పుడూ బయటే నుంచొని చూస్తుంటాడు. మనోవైకల్యాలకు లోనవుతున్న మధ్యతరగతి మానిసి. దుష్ట పుష్పాల్ని 'Flowers of Evil' వాసన చూస్తూంటాడు. బాదెలేర్‌లా(1821-67) రింబాడ్‌లా, వెర్లైన్‌లా.

**ఎగ్జిస్టెన్షియలిజమ్:** మతపరమయిన అస్తిత్వవాదానికి కిర్క్‌గార్డ్ (1813-55) పునాదులు వేస్తే, సాహిత్య అస్తిత్వవాదానికి ఎక్కువగా ప్రతినిధిగా నిల్చినవాడు, సార్త్ (1905-80). మానవుడు ఒక శూన్యంలోకి పుట్టాడు. బురదలో ఉన్నాడు. కాని శూన్యంని దేనితోనైనా నింపుకోగలడు ఇచ్ఛ అంటూ ఉంటే, బురదలోంచి బయటికి వచ్చే నిర్ణయమూ అతనే తీసుకోవాలి. నిర్ణయం అతని స్వేచ్ఛే కాని అది బాధాకరమైన స్వేచ్ఛ. అందుకే నోబెల్ బహుమానాన్ని స్వీకరించలేదు. ఆల్బర్ట్ కామ్యూ (1913-60) కూడ ఇదే నిరంతరమైన బాధని తన గ్రంథం మిత్ ఆఫ్ సిసిఫస్ (1942) లోనూ 'ది స్ట్రేంజర్' నవల (1942)లో నూ చిత్రించాడు. అస్తిత్వం అర్థరహితంగానూ, మానవప్రయత్నం నిరంతర నిష్ఫలత్వంగానూ తోస్తుంది.

**అబ్సర్డిటీ:** అస్తిత్వ వేదనా వాదాన్నించి వచ్చిన కొనసాగింపే అసంబద్ధ వాదం. ఇది ఒకానొక స్థిరీకృతమైన భావం కాదు గానీ, అవగాహన కాదు గానీ అభిప్రాయాలంటూ ఏమీ లేని ఒకానొక మానసిక స్థితిని అసంబద్ధ వాదం ప్రకటిస్తుంది. విషాదాన్ని కూడా వినోదంగా చూపుతుంది. అర్థరహితమైన భావాన్ని చూపటానికి నిరర్థకంగా పదాల్ని వాడే నాన్‌సెన్స్ పొయిట్రీ, ఇందులోంచి వస్తుంది. ముఖ్యంగా నాటకరంగంలో యాడమోవ్, బెకెట్, జీనెట్, గంతర్ గ్రాస్, హెరాల్డ్ పింటర్‌లు 1950లలో చాలా ప్రయోగాలు చేసారు. అసంబద్ధ వాదాన్ని కొసదాకా కొనసాగించినందుకే శామ్యూల్ బెకెట్‌కి నోబెల్ బహుమానం వచ్చింది.

**ఎక్స్‌ప్రెషనిజమ్:** చెప్పే విధానమే సాహిత్య రూపాన్ని నిర్ధారిస్తుంది. కవిత్వంలో ఒట్టి రంగులు, శబ్దాలతో నిండిన పదాలతోనే భావాన్ని వ్యక్తీకరించవచ్చు. కాఫ్కా (1883-1924) ఆపనే చేసి చదువరుల్ని చాల భయపెట్టాడు.

**స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్:** చైతన్య ప్రవంతిలో ఓ నలభై పేజీలదాకా ఒకే ఒక్క విరామ చిహ్నం. కామాతో తనతో తను మాట్లాడుకోగలడు ఓ పాత్ర. ఆ పాత్రని 'యులిసిస్' నవలలో చిత్రించాడు జేమ్స్ జాయిస్ (1882-1941). శామ్యూల్ బెకెట్ రాసిన కవితలు, టి.ఎస్.ఎలియట్ (1888-1965) కవితలే ఉదాహరణలు. సాంగ్ ఆఫ్ ఆల్ఫ్రెడ్ జె.ప్రూఫ్రాక్‌లో కూడ ఇదే శిల్పం ఉంది.

**బీట్ పొయిట్రీ:** గిన్స్‌బర్గ్ (1926) జాన్ కెరౌక్ (1922) ఫెర్లెంగెట్టీ (1919) గ్రెగరీ కార్సో (1930) గారీస్నైడర్ (1930)లు దీనికి ప్రతినిధులు. బీట్ పొయిట్రీ ప్రభావంతోనే యాంగ్రీయంగ్‌మెన్ కవిత్వం. కన్ఫెషనల్ కవిత్వం. నేకెడ్ పొయిట్రీ వచ్చినయ్. ఇదంతా రెండో ప్రపంచయుద్ధ ప్రభావం.

**సైకలాజికల్ పొయిట్రీ:** కవిత్వం ఒక మనోవైజ్ఞానిక విషయంగా గుర్తించాడు ఐ.ఏ.రిచర్డ్స్. విలియం ఎంప్సన్ కవిత్వంలో అర్థ బహుముఖీనతని స్పష్టం చేసాడు. ద్వంద్వాన్ని, వైరుధ్యాన్నీ, వ్యంగ్యాన్నీ ప్రాతిపదికలుగా క్లియాంత్ బ్రూక్స్ పేర్కొన్నాడు. స్మృతి, విస్మృతి, ఊహ, సహజాతాల మూలాల్ని కవిత్వంలో దర్శించాడు బెర్గ్‌సన్ (1859-1941). ఈ నలుగురరూ వాళ్ళవాళ్ళ భావజాలాలతో ఇంకా నూత్న విమర్శకుల్ని ప్రభావితం చేస్తూనే ఉన్నారు. వర్తమాన కాలాన్ని, రాజకీయాల్ని, సామాజిక జీవితాన్ని విమర్శిస్తూండటమే ఆధునికతకి ఉన్న ఓ లక్షణం. రాజకీయ నిబద్ధత ఉండాలని ఏమీ సిద్ధాంతం లేదందులో. ఈ ప్రపంచం, ప్రస్తుత పరిస్థితులు కేవలం తాత్కాలికాలు. దీనికి నిర్వచనాలంటూ ఏమీ స్పష్టంగా ఉండవు. 'రచన' ఎవరైనా చదివేదాకా దానికొక అస్తిత్వమంటూ ఉండదు. అర్థమూ ఉండదు. పరమార్థం అనేది రచయిత ఆశించడసలు.

పాఠకుడి అంచనాలను ఆకాంక్షలను తలక్రిందులు చేయటమే రచన అవధి, రచయిత లక్ష్యం. రచయిత ఒక్కడే. రచనకి పాఠకులు అనేకులు. అందువల్ల ఆధునిక రచన ఏకకాలంలో అందరు పాఠకులనీ సంతృప్తి పరచలేదు. పాఠకుడికి సాహిత్యంతో ఉన్న కనిష్ఠ, గరిష్ఠ సంబంధాలను బట్టే రచన అతనికి అందుతుంది. రచయితకీ పాఠకుడికీ మధ్యన ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం అంటూ ఏదీ లేనప్పుడు రాజీ ప్రసక్తి అసలే ఉండదు. కొత్త సంకేతాలన్నీ ఆచారస్థాయికి ఇమిడే వరకూ అర్థక్లిష్టత తప్పదు. ఒకప్పటి

'యులిసిస్' నవల, 'వేస్ట్‌లాండ్' కావ్యం చాల సమయం తీసుకున్న తర్వాతే ఆధునిక మహా నవలగానూ, మహాకావ్యంగానూ ఈనాటికి స్థిరపడినై. మొత్తానికి 1900 సంవత్సరంలో ఒక గొప్ప ఘటన ఫ్రాయిడ్ (1856-1939) రచించిన 'ది ఇంటర్ ప్రిటేషన్ ఆఫ్ డ్రీమ్స్' అచ్చయింది. 1910లో టాల్‌స్టాయ్ చనిపోయాడు. 1909లో స్విన్‌బర్న్ మరణం. 1913లో టాగోర్‌కి నోబెల్ బహుమానం. 1930లో చనిపోయిన లారెన్స్ "Conciousness is an end in itself" అన్నాడు. అతని పద్యం "The Snake" ఆమాటే చెప్తుంది. పాముని ఏమన్నా చెయ్యబోవటమే మనం చేసే తప్పు. ఆదిమ మానవత్వాన్ని సంస్కరించబోవటమే దుఃఖానికి హేతువు. మాటకంటే పదచిత్రాలు నిజమైన జ్ఞానాన్నిస్తయ్. తర్కం కంటే భావోద్వేగాలు ఎక్కువ ఆనందాన్నిస్తయ్. వేస్ట్‌లాండ్ లోని పదచిత్రాలు కథ చెప్పటం కంటే వాటి భావోద్రేకాల సుడిగుండాల అట్టడుగున ఓ ప్రశాంతిని ఇస్తయ్. ఆధునిక కవి ఏకాకి.

సమాజాన్నించి దూరుడైనాడు. సాంఘిక చైతన్యంలోకి ఇమడటంలో చివరికి మిగిలేదేమీ లేదు. లోబడిపోవటం మాత్రమే మిగుల్తుంది. స్వీయాత్మకీ వస్త్వాత్మకీ మధ్య ఉండే Sensibility, అనుబంధం డిసోసియేట్ అయిపోయింది. పురాణ ప్రతీకలు ఒక సమాజాన్ని మొత్తంగా బంధించి ఉంచేవి. వ్యక్తిగత చేతనను ఒక సాంఘిక సంస్కార చేతనగా మలచేవి ఆ ప్రతీకలు. స్వీయాత్మకీ, వస్త్వాత్మకీ వాటి ద్వారా అనుబంధమేర్పడేది. ఆ ప్రతీకలిప్పుడు కేవలం ఏదో ఒక మతానికి చెందినవి మాత్రమే. అందుచేత మనుషుల్ని విడదీస్తయ్.

డిసెంబరు 6, 1992న అదే జరిగింది. 'కమలం' 'కమండలం' 'కాషాయం' ప్రత్యేక ప్రతీప ప్రతీకలై నిల్చిపోయినయ్. రూసోలా 'కన్ఫెషన్స్' కానీ గాంధీలా 'ఎక్స్పిరిమెంట్స్' గానీ రాయలేరెవరూ ఇపుడు. ఆధునిక కవిలో ద్వంద్వాలున్నై. ద్వంద్వ చైతన్యాలున్నై. ద్వంద్వ వాస్తవాలున్నై అంటారు నగర కవులైన లూయీస్ మాక్నీస్, ఆడెన్ లు. ఎడ్వర్డ్ తామస్ అనే ఆధునిక కవి "How nice it would be to be dead if only we could know we were dead. That is what I hate, the not being able to turn round in the grave & to say, it is over." అంటున్నాడు. ఇది మృత్యువులో జీవనకాంక్ష. నేను చెప్తున్న ఊహ⇨వస్తువు⇨అనుభవం⇨స్మృతి⇨చేతన⇨వేదన ప్రక్రియ. తామస్ హార్డీ నిరాశావాదం. అసలు పుట్టని శిశువును ఊహిస్తూ దాన్నే ఆ ఊహనే అనుభవవేదనా చైతన్యంగా మలచాడు. "I crawl on because it is easier than to stop" అని ఎడ్వర్డ్ తామస్ అన్నా అదే ద్వంద్వ భావన. కవిత్వంలో సంకేతాల పాత్ర చిన్నదేమీ కాదు. ఉదాహరణకి : పొగ, మంట, మోర్స్‌కోడ్, జండాలు, అంగిక చేష్టలు, దేహభాష, ధరించే వస్త్రాలు, స్థాయిని తెలిపే గుర్తులు-నక్షత్రాలు, గీతలు మొదలైనవి. జంతువులు పరస్పరం ఇచ్చుకునే సంకేతాలని జుయోసెమియోటిక్స్ అన్నారు. కీటకాలకు కూడా సంకేతాలుంటై, ఓ అరమైలు దూరాన ఉన్న మగ మిణుగురు పురుగుని ఫెరోమోన్ అనే పరిమళభరితంతో ఆడమిణుగురు పురుగు ఆకర్షిస్తుందట. భాషా శాస్త్రంలో వాడే సంకేతాలు ప్రధానంగా రెండు రకాలు. ఒకటి లాంగ్ (Langue) రెండోది పెరోల్ (Parole) మొదటిది భాష. రెండోది ఉక్తి. సాంఘిక వ్యవహారంలో పురాణ ప్రతీకల ద్వారా, క్రతువుల ప్రకటన ద్వారా, కథాకథనం ద్వారా మనం భావ వినిమయాన్ని సాధిస్తూంటామని లెవీస్ట్రాస్ (1908) అభిప్రాయం. భాష వేష భూషణాల ద్వారా వ్యక్తమవుతుందని రోనాల్డ్‌బార్త్రెస్ (1915-80) పరిశీలన. ధరించే దుస్తుల ద్వారా వ్యక్తి వాడే భాషలోని వ్యాకరణం వినవస్తుంది. రచన చెప్పే దాని కన్నా, ఆ రచనని చదివే పాఠకుడి ప్రభావం రచన మీద ఎక్కువ అని జొనాతన్ కల్లర్ అభిప్రాయం.

రోనాల్డ్ బార్త్రెస్ పరిశోధనలో తేలినదేమిటంటే రచనకు అర్థం అనేది స్థిరంగా ఉండదనీ, సంకేతమూ సంకేతికమూ పరస్పర విరుద్ధాలు మాత్రమే కాక ద్వంద్వాలనీ నిరంతరంగా అనేక వ్యతిరికార్థాలనిస్తాయనీ ఒక్క అస్థిరత్వంలో మాత్రమే ఒక్క అనిర్ణయత్వంలో మాత్రమే స్థిరంగానూ నిర్ణయంగానూ నిలిచి ఉంటాయని. ఇందువల్ల 'భాషకి భాష యొక్క భాష' అనేది ఒకటి రూప కల్పన చెందుతుంది. రచయిత రచన నించి ప్రక్కకి తప్పుకుంటాడు. భాషణానికి భాషణం రూపొందుతుంది. దీన్నే నిర్మాణ శైలి అంటారు. పాఠర పక్షపాతి అయిన రచన ఒకటి, రచయిత పక్షపాతి అయిన రచన వేరొకటిగా ఉంటాయి. మొదటి దానిలో పాఠకుడు ఆలోచించవలసిన అవసరం లేదు. రెండవది పాఠకుడి ఆలోచనా శక్తికి చాలా ఎక్కువ శ్రమ నిస్తుంది. మొదటిది ఓపెన్ ఎండింగ్ రచన. రెండవది క్లోజ్‌డ్ ఎండింగ్ రచన.

వినిర్మాణ సిద్ధాంత ప్రవక్త జేక్స్ డెరీడా (1930) చాల వినూత్న విషయాల్ని చెప్పాడు. కవిత ఓ వాచకం. ఈ వాచకం చెప్తున్నట్లు కన్పిస్తున్న విషయానికంటే చెప్పని విషయమే ఎక్కువ. అసలు చెప్పాలనుకొన్న దానికీ చెప్తున్నట్లు కనిపిస్తూన్న దానికీ చాలా వ్యతిరిక్తత ఉంటుంది. వాచకం పాఠకుడ్ని మోసం చేస్తుంది. పాఠకుడు స్వీకరించగలిగే ఒకే ఒక నిశ్చితార్థాన్ని భగ్నం చేస్తూ ఏకకాలంలో అనేకానేక అర్థాల్ని సూచించగలదు. వచనం ద్వివచనం అవుతుంది. భాష ద్వైతం అవుతుంది. ఎన్నో అర్థాలు సూచించగల శక్తి వల్లనే వాచకానికి అసలు అర్థం అంటూ ఒకటి–నిశ్చితార్థంలో ఉండకపోవచ్చు. రచనలోనే తుడిపివేత రచన ఒకటి ఇమిడి ఉంటుంది. రచన భాషని కూడా లొంగదీసుకొని భాష చెయ్యాల్సిన పనిని కూడ అదే చెప్తానంటుంది. వాచకం తనను తానే వినిర్మాణం గావించుకుంటుంది. అందుకనే సామాన్య పాఠకుడు రచనని అర్థం కంటే అపార్థం ఎక్కువగా చేసుకుంటాడంటాడు హెరాల్డ్ బ్లూమ్. రచనలో అస్పష్టత ఉంది అని సామాన్య పాఠకుడు చేసే అభియోగానికి ఇదే మూలం. చదవటం అనే తన సొంత అలవాట్లకి లోనయిన పాఠకుడు రచనలో అస్పష్టతని మాత్రమే చూడగలడు. సంక్లిష్ట కవిత్వాన్ని అస్పష్ట కవిత్వంగా మాప్ అఫ్ మిస్‌రీడింగ్‌గా అపార్థం చేసుకొంటాడు. ◐

---

|నివాళి|

# 'మో' విషాదం



కవిత్వానికి, కమ్మనివచనానికి
టీకా టిప్పణి చెప్పిన వాడు
చింతాక్రాంతుడు, మానిషాదుడు,
ఏ పదానికి అందని వాడు-
ఏ వాదానికి చెందని వాడు-
ఆంగ్లాంధ్ర కవిత్వాన్ని పుక్కిట పట్టినవాడు-
ముప్పయేళ్ళు ముందు పుట్టిన వాడు
తెలిసీ తెలియక ఏ'మో' అంటే
అయినా కాని వాళ్ళు అ'మ్మో' అంటే
తను బతికిన క్షణాలనేరుకోమని
తన కాస్త జాగాని మనకే వదలి
ఏ రహస్తంత్రులు మీటేందుకు
ఏ నీడ జాడలకు నిష్క్రమించాడో
ఒకే ఒక్క 'మో'....

*మిసిమి*

# కవిత్వం అసంపూర్ణ యాగం

\- సీతారాం

కవిత్వానికి ద్విభాషం చెప్పినవాడు. కవిత్వం 'సాంధ్యభాష' అని గుర్తించినవాడు. ఉభయ సంధ్యల్లోనూ రెండేసి రెండూ ఇంటూ నాలుగేసి ఆనాలుగుని మరో పద్నాలుగుతో హెచ్చవేసి అర్థం అనర్థం అంటూ తేల్చేసి, ఒక భాషా సంకేతానికి ఒకే అర్థం స్థిరంగా ఉండదని చెప్పేసి, బహుభాషల, బహుళార్థాల్లోకి కవితా వాక్యాలను వొంపేసి, కొన్నిటిని వంకరచేసి, ఇంకొన్నిటిని వక్రోక్తికి అప్పగించేసి, మహా ఐరానిక్‌గా, మెటాఫర్లను నిత్యనూతనంగా సృష్టించే కవన విద్యను కవి ఎప్పుడు కవిత్వాన్ని నాటకంలాగే సమాహార కళగా గుర్తించాలని, ఆ గుర్తింపును తానూతేవాలని ప్రయత్నించి, ప్రయోగించి అద్భుతమైన కవిత్వాన్ని కానుకగా ఇచ్చిన వాడు మో. ఇచ్చేసిన కానుకను తెరిచి చూద్దామనేలోపు, మరొకటి మీ కోసం రాసిపట్టు కొచ్చానంటూ, కొట్టుకొచ్చావంటూ అర్థం కాకపోతే బుర్ర బద్దలు కొట్టుకు చచ్చేకంటే ఆధునిక కవిత్వమే అంతని చెప్పేశాడు 'మో'. జీవన విషాద రహస్తంత్రులు మీటేశాడు.

చితి-చింత, బతికినక్షణాలు, రహస్తంత్రి, పునరపి సాంధ్యభాష, నిషాదం ఇవి ఆయన కవిత్వ సంపుటాలు. చితి-చింత 1969లో వెలువడింది. ఈ పుస్తకానికి ముందు మాటలు రాసిన వారిలో రోణంకి అప్పలస్వామి ఒకరు. ఆయన ఇట్లా అన్నారు. ''ఈ తడు సమకాలిక పాశ్చాత్యకవితారీతుల్ని బాగా ఆకళించుకున్నాడని చెప్పాలి. ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. పఠిత ఏ శీర్షికనైనా సరే పదే పదే చదివితేనేగాని కవి నిబిడీకరించిన అనుభూతి సరిగ్గా అవగతం కాదు. ఆధునిక జీవిత నైరాశ్యాన్ని చావుబ్రతుకుల దుఃఖభూయిష్ఠ సంఘర్షణను వీలైనన్ని తక్కువ పదాలలో కుదించిపెడుతున్నారు. విపులీకరణాన్ని పఠిత భావనాశక్తికి విడిచి పెడుతున్నాడు.'' చితి-చింత కవిత్వం నాటికే 'మో'కు ఒక స్పష్టమైన దారి దొరికింది. తన ఆలోచనాధార ఎటు సాగాలో, ఉద్వేగాభివ్యక్తి ఏ రూపం తీసుకోవాలో అర్థం అయ్యింది. అందుకే ఆయన ఆ దారిని వదలలేదు. నిజానికి 1969 నాటికి తెలుగు ఆధునిక కవిత్వం ఒక రాజకీయ దృక్పథాన్ని అన్వేషించే స్థితిలో పడింది. విప్లవోద్యమాన్ని విరసానికి పూర్వరంగం ఏర్పడేఉంది. ఇంకా దిగంబరులు విప్లవకవులుగా పరివర్తన చెందలేదు. పైగంబరకవులు, తిరుగబడుకవులు చెప్పుకోదగ్గ కదలికలోనే ఉన్నారు. చేతనానర్తకవులు దేశీయ మూలాల గురించి మూల్యాల గురించి మాట్లాడ సాగారు. నగ్నముని శివారెడ్డి, ఇస్మాయిల్, అజంతాలు రాబోయే తరాలను ప్రభావితం చేయగల వారిగా సంసిద్ధులై ఉన్నారు. 1969లోనే తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. బైరాగి, నారాయణ బాబుల ధోరణి, పఠాభి ప్రయోగవాదం, ఆరుద్ర త్వమేవాహ జాటిల్యం గురించిన చర్చలు కొద్దిపాటివే అయినా వచ్చి ఉన్నాయ్.

వీటన్నిటినీ ఆయన పట్టించుకోలేదు అనలేం కాని, అవి ఈయనను ప్రభావితం చేయగలిగినవిగా లేవు. 'చితి-చింత'తో ఆధునిక అనుభూతి వాద కవితకు ఒక తాత్త్విక బలం వచ్చింది. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణలు తమ తమ ముద్రలో ఉన్నారు. భావ కవిత్వానికి కొనసాగింపే అనుభూతి వాదం అనే అపోహ ఏర్పడ్తున్న దశలో దానిని పటా పంచలు చేస్తూ చితి-చింత ముందుకొచ్చింది. దిగంబర కవుల వల్ల డాడా, సర్రియలిజాలు అప్పటికే శ్రీశ్రీ తొంగిచూసిన అధివాస్తవిక రచనలు ఉండటం వల్ల మోహనప్రసాద్‌ను అధివాస్తవిక కవిగా పేర్కొనటానికి తెలుగు సాహిత్యం వెనకాడలేదు. ఒక రాజకీయ దృక్పథం కోసం తెలుగు కవిత్వం చేసిన అన్వేషణ 1990ల నాటికి ఫలించిది కానీ, ఈ మోహనప్రసాద్‌ను ఎక్కడ నిలిపి చూడాలో అంతుపట్టలేదు. కల్లోల దశాబ్దంలో వచ్చిన కవులు గల్లంతు అయిపోవాల్సి ఉండగా మోహనప్రసాద్ నిలువెత్తున నుంచున్నాడు. ఏదో ఒకటి అనేక పోతే మోహనప్రసాద్‌ని వదిలించుకోవడమో విస్మరించడమో జరగదు. మొదలు ఎలా అయ్యిందో తెలీదు కాని ఆయనకు మాత్రం 'అస్పష్టకవి', అర్థంకాని కవి' అనే మువ్వల మొలతాడు బిర్రబిగదీయ బడింది. మో దీనిని సవాలు చేసి ఉండాల్సింది. కాని ఆయన సరదా పడ్డారు. దానిని పాక్షికంగానైనా ఆమోదించారు.

1969లో చితి-చింత వెలువడితే మరి 11 ఏళ్ళపాటు ఆయనేమీ రాయలేదు. రాయలేదని ఆయన స్వయంగా పేర్కొన్నారు. "1789 నుంచి మరల 11 సంవత్సరాలు చాల నిశ్శబ్దంగా ఉన్నాను." కవిసంధ్య మో కవితా వీక్షణం పుట: 117) ఈ నిశ్శబ్ద కాలాన్ని ఆసక్తిగల పరిశోధకులు ఎవరైనా పరిశోధించి మోహనప్రసాద్‌ని అసామాజీకుడిగా నిరూపించవచ్చు. ఆయన వీటన్నిటికీ దూరంగా లేడని, ఎడంగానే ఉన్నానని చెప్పారు. దానికి కారణంకూడా ఆయనే చెప్పారు. "సాంఘిక జీవనంలో క్రియాత్మకంగా పాలు పంచుకోలేకపోవడం ఒక కారణం. తెలియని పార్శ్వాల గురించి అనుభవంలోకి రాని విషయాలు గురించి అసత్యంగా రాయటం ఎందుకులే అనే ఒకేఒక భావన కారణం" (కవిత్వ ప్రయాణంలో నడిచే హైకింగ్... కవి సంధ్య మో కవితా వీక్షణం - పుట : 116) తెలిసిన, అనుభవంలోకి వచ్చిన వాటినీ ఆయన రాయడానికదే మూలం.

ఆయనే చెప్పుకొన్నట్లు హిమానీ హృది (1960)అనే ఒక అడాలసెంట్ ప్రేమ కవితతో మొదలైన మో కవితా ప్రస్థానం 'నిషాదం'లోని చివరిచర్య (2010) అనే కవితతో ముగిసింది. నిషాదం సంపుటలో ఆఖరి కవిత చివరిసారిగా ... అనేది వేశారు. ఈ సంపుటిలోని 'కవితల' క్రమం ఆయన ఇచ్చిందే. ఇది అంతకు ముందెప్పుడో రాసింది. సాంధ్య భాషలోనూ ఉన్నట్టుంది. ఈ కవితా శీర్షిక చివరాకరిలో 'వారి'కి ఆయన మనసులోనైనా సింగిల్ కొటేషన్స్ పెట్టి ఉంటారని నాకొక సందేహం. ఎందుకంటే ప్రతిదీ ప్రయోగించి చూస్తారు. లేదా వాటిని ఉన్న చోటనే ఉండనిచ్చి అవి విశేషార్థాలను నిష్పన్నం చేసేదాకా వొదలిపెట్టరు. ఆ అక్షరాలు అచ్చయిన రాసిన స్థలం నుంచి మరొక స్థల, కాలాలకు భావాలకు వ్యాపించగల దారులను చూపెడతారు. కొన్ని సార్లు అవి సరదా ప్రయోగాలుగా, చమత్కార ఉక్తులుగానూ అనిపిస్తాయి. వాటి వెనక ఉండే తాత్త్విక గాంభీర్యాన్ని తెలుసుకోవటం పట్ల ఆయనకు కుతూహలం ఎక్కువ. 'నాలకాంతాన' అనే కవితలో ఇటువంటి ప్రయోగం చూడండి.

**"ఈ మధ్యలోనే చిక్కొచ్చి**
**హీరోగారు గోళీసోడా కొట్టొచ్చి**
**సహజ నటీమణిపాన్ పారాగ్ ఉమ్మొచ్చి**
**వయొలిన్ వాడు తాకట్టు కొట్టు కెళ్ళొచ్చి**
**తబలావాడు బడతడుతూ వొచ్చి**
**మేకప్ వాడు రెండు బత్తాయిల్ని కోసుకొచ్చి**
**ఏం పర్లేదు**
**మా నాటకం పేరే నాటకం"**

ఇందులో తబలావాడు తడబాటును సూచించేందుకు 'బడతడుతూ' అని ప్రయోగించారు. తడబడు అనే మాటకూడా తడబడట్టాన్ని సూచించటమే బడతడు అయింది. అయితే పాఠకుడికి ఇవి అన్ని సార్లు కవి ప్రయోగించిన అర్థంలోనే అర్థం అవుతాయన్న హామీ ఏమీ లేదు. కొంతమంది పాఠకులకు ఇవి కవి మీద చికాకును కూడా కలిగిస్తాయి. అయితే కవిత్వంలో ఆయనకు ప్రయోగాల మీద ప్రయోగాలు చేయటం ఇష్టం. ఒక అలవాటునుంచి కవిని, పాఠకుడిని విముక్తం చేయటం ఇది.

పదాలకు వాటి అర్థాలకు బందీలమైన స్థితి శృంఖలను వదులు చేయటం లాంటిది. అందుకే ఆయనంటారు. "కవిత్వంలోనూ మనం అంతా చెప్పెయ్యకూడదు. రయితకుండే పాటి ఊహ పాఠకుడికీ ఉంటుందా లేదా?" అని ప్రశ్నిస్తారు మో. పాఠకుడి పట్లగల గౌరవాన్ని ఈ ప్రశ్న ఒక మచ్చుతునక మాత్రమే. 'నాటకాంతాన' అన్న కవిత ఆ నాటకం వేసేవాళ్ళ జీవనం తడబాటులోని విషాదాన్ని చూపిస్తుంది. ఆ జీవన విషాదం కవికి సుఖం కలిగించేది. వారి పట్ల సందేశాత్మకంగా ఉండాలని కవి ఆకాంక్ష. పద్యనాటకంకూడా భీకర నిరాదరణకు గురైన కాలంలో వాళ్ళు, నాటకాన్ని మాత్రమే నమ్ముకుని జీవిస్తున్నారు. వాళ్లకున్న నాటక కళను గాని బ్రతికించుకోవాలన్న స్పృహ మనకు లేదు. అందుకే ముగింపులో ఇలా అంటాడు. కవి.

**"మా ముఖాలకి రంగులు**
**పూసుకునేదీ రంగం మీదే**
**మీ అందరి ముందరే" అని**

ప్రతికవికీ ఈ ప్రపంచం మీద అవ్యాజమైన ప్రేమ ఉంటుంది. లేదా రహస్య ప్రేమైనా ఉంటుంది. 'మో'కి ఈ ప్రేమలోని సాంద్రత బాగా తెలుసు. కేవలం వస్తువైవిధ్యం కోసం 'నాటకాంతాన' అనే కవిత రాయలేదు. నాటకంలో పాత్రధారులుగా ఉన్నతంసేపు ఆ నటకులు పాత్రల విషాద, ఆనందాలను అనుభవిస్తారు. అవేవీ వాళ్ళవికావు. కాని

నాటకం ముగిశాక ఆ పాత్రలన్నీ తమ నిజజీవన రంగం మీదకు వస్తారు. ఆ జీవితంలో విషాదం తప్ప మరేమీ లేదు. ఆ విషాదం వైపు వేలు చూపడమే ఈ కవితలో మో చేసిన పని. కవిత్వంలో తాను ప్రయోగించే ప్రతి శాబ్దిక సంకేతానికి అది అందించాల్సిన అర్థ స్ఫురణనే కాక అర్థవిస్తృతిని ఇవ్వగలిగినదిగా నిరూపించి చూపారు.

తెలుగు ఆధునిక కవిత్వానికీ సంబంధించి నంతవరకు ఆయన ముఖ్యమైన పరిణామాలను గమనించారు. కొన్ని పరిణామాలకు ఆయనే కారణమూ అయ్యారు. అర్బేనిటీ ఉన్న కొద్దీ పెరిగి, నేటివిటి తప్పిపోయింది.

**గొడ్లచావడి/ ఎడ్లు కదుల్చుతున్న మిచర్ మిచర్‌మని**
**ణికిణీం ణికిణీమ్మని మోగుతున్న ఎడ్ల గంటలు**
**ఎడ్లను తిట్టున్న పాలేరు ఆప్యాయపు బూతులు**
**నేల మీద చల్లగా తడిసిన పురాతన హిందూ దేశపుటెడ్లవాసన**
**లాంతరు నీడలో ఎడ్లకాంతి దయ్యాల్లా పర్చుకుని.**
గ్రామీణ జీవితానికిది నాంది

ఇవన్నీ ప్రాతః స్మరణీయాలు" అని రాశారు. ఎంతటి మహానగర సంస్కృతిలో జీవించాల్సి వచ్చినా ఆయన తన గ్రామీణ నేపథ్యాన్ని వదిలి పెట్టలేదు. అలాగే అర్బన్ సంస్కృతిలో పెరిగిన నేరమనస్తత్వం, హింస, స్వార్థం, సమూహంలోని ఒంటరి తనపు అపరాధ భావన మొదలైనవి మో కవిత్వం నిండా కనిపిస్తాయి. రూపం మాత్రమే ఆయన కవిత్వంలో పాశ్చాత్య పోకడలను తలపిస్తుంది. సారంలో ఆయనది వట్లూరు. రెండు భిన్న సంస్కృతుల మిశ్రమం ఆయన కవిత్వం.

చితి-చింతలో ఆయన ఎన్నోవిధాలైన కవిత్వసాధనాలను వాడారు. వాటిల్లో ధ్వన్యనుకరణ శబ్దాలను యథాతథంగా రాసి ఆ ధ్వని సంపుటాలను పఠితకు పరిచయం చేయాలని ప్రయత్నించారు. ఒకానొక ఆడిటరీ ఇమాజినేషన్‌లోకి పఠితను తీసుకుపోవాలని ఆయన పట్టుదల.

**కిణికిణికిణి గిలక నిక్వణం**

**గిలక మీంచి బిందె దిగే చప్పుడు**

**... ... ... ... ... ... ...**

**వీథి వాకిలి**

**సూర్యదేవుడు విచ్చుకునే విశ్వవీథికి వాకిలి**

**ఇంకా కేవలం విడని చీకటి మందారాన్ని**

**ఆపైన చీప్పు చీప్పు కళ్ళాపి నీళ్ళ జల్లు**

ఈ వేకువలోనే ఒక మెలకువ ఉంది. 'చీకటి మందారం' అన్న మోటాఫర్ చూడండి. వాకిలి ఊడ్చిన చప్పుడును వినండి. సీతారామశాస్త్రి కూడా అన్నాడు. తెల్లారింది లెగండోయ్ కొక్కొరొక్కో అని. వేకువను చూచేందుకు మెలకువతో ఉంటాను.

రాత్రుళ్ళు నిద్రేపోను అని వాగ్దానం కూడా చేశాడు కవి. తనలోపల ఉన్నగతం. తానున్న వర్తమానపు వెలుపల గురించిన కవిత ఇది. కోల్పోయిన గతం, పొందని, చెందని వర్తమానం దీన్లో కనిపిస్తుంది. "రాత్రుళ్ళు నా దుఃఖం దట్టమయి ఐవరీ బ్లాక్‌లా గడ్డకట్టిన మట్టిని / ప్రత్యూషం ఎట్లా కుళ్లగిస్తుందో చూచేందుకు / ఆనందంతో సూర్యనమస్కారాలు చేసేందుకు వేస్తాను"

1960 భారతిలో మో తొలికవిత అచ్చయ్యింది. 'హిమానీ హృది'. మే నెల భారతిలో ఈ కవితను అచ్చేసి శుభాకాంక్షలు చెపుతూ కార్డు రాసిన తిరుమల రామచంద్రగారికి ఆ తరువాత అంకితం చేశారు. ఇందులో ఆయన "నాకే ఇంత చలివేస్తున్నాదే నీళ్ళకెంత చలోమరి!" అన్నారు. ఇదొక విచిత్రమైన ఊహలాగా భావనలాగా అనిపిస్తుంది. నిజానికిది కవి సంవేదన, సహానుభూతి.

రాఁవుడూ! వేసెయ్! తలుపులు వేసెయ్: అనే ఆజ్ఞాపించటంతో మొదలవుతుంది కవిత. ఈ రాఁవుడు ఆత్మారాముడు జీవుడు. తనలో తానే జరిపే సంభాషణ దీన్లోనే-

**హృదయం అంటే సామాన్యమా, కర్మ!**
**ఆత్మకూ దేహానికీ పేచీ వచ్చేదిక్కడనే**

ప్రేమ అనే ఆ దరిద్రపు గుడ్డిదీపం వెలిగి కొండెక్కేదిక్కడనే

**హత్యకు ఆత్మహత్య ఇదే బలిపీఠం**
**స్వర్గసీమ, వల్లకాడు రెండూ ఇదే**
**ఇక్కడే జీవి చనిపోయేదీ చావు బ్రతికేదీనూ.**
**అసలు నీవూ నేనూ ఉన్నదే ఇక్కడ,**

మనకున్న యీ దుప్పటిని, రాఁవుడూ నీవుకూడా పంచుకో"

ఇటువంటి కవితాపంక్తులకు ఏ అన్వయాలూ, వివరణలు అక్కర్లేదు. తాను, ఇతరుడు, దేహమూ-ఆత్మ, మృత్యువు-జీవితం, ప్రేమ-ద్వేషం ఈ డైకాటమీని లేదా Binary oppositions ని మో పట్టుకుని చూపే ప్రయత్నం చేశారు.

**"భావం మారదు స్వభావం మారదు**
**పదం మార్తుంది క్రియా పదం మార్తుంది"** అని

చెప్పిన మో చితి-చింత తరువాత రాసిన కవిత్వంలో పదాలను క్రియా పదాలను మారుస్తూ, ఏమారుస్తూ వచ్చారు. భవిష్యత్తులో తాను రాయబోయే కవిత్వానికి కావలసిన ముడి సరుకు, తాత్త్విక చింతన అంతా చితి-చింతలోనే నిక్షిప్తం చేశారు. "పూర్వపు పదబంధాలన్నీ అలవాటయిపోయి, ఆ తర్వాత వచ్చే పదమేమిటో ఉట్టినే తెలిసిపోతుంది. నా రచనలో ఆ హేబిట్‌ను బ్రేక్ చేసి ఏ పదం తర్వాత ఏ పద మొస్తుందో అనే భయం పాఠకుడిలో ప్రవేశపెట్టానని ఒప్పు కొంటాను." అన్నారు ఆ తరువాత ఎప్పుడో. చితి-చింత పల్లెటూళ్ల జీవన చిత్రాలనే కాదు, వ్యావసాయిక కుటుంబాలలోంచి వచ్చిన కవులు ఆవేదనకు కూడా అద్దం పట్టింది. గ్రామీణ జీవిత విధ్వంసాన్ని ఆయన చూశారు.

**"సరే, నీవు దుఃఖాన్ని జయించి నీ రక్త మాంసాదులను పంచి**
**పదిమంది పిల్లలకి పాలిచ్చి పెంచి పెళ్ళిళ్లు చేసి**
**మాయలో కరిగిపో**
**నేనున్నూ కౌలుకి తీసుకున్న నాలుగెకరాల ఫలసాయం చూచి**
**గిట్టు బాటుగ లేకుంటే మట్టిలో కలిసి పోతాను"**

అన్నాడు. చితి-చింతను ఎన్నో కలగలిసిన గమ్మత్తయిన కాక్‌టెయిల్ పోయెట్రీగా పేర్కొన్నారు మో.

"విధ్వంసమైన బతుకుని ధ్వంస రచన చేసి బాగు చేసుకోవచ్చును" అని బతికిన క్షణాలులో అంటాడు మో. ఇందులో ఆయన మళ్లీ బాల్యంలోకి జారి పోయాను అన్నాడు గాని, బాల్యంతో ఆగలేదు. బాల్య, కౌమార, యవ్వన దశల్లోని అనుభవ పరంపరని ఉద్వేగంతో తడిమి చూసుకున్నారు. గత ఘటనలను, సంఘటనలను అప్పటి ఇన్నోసెన్సుతోనూ, రాస్తున్నప్పటి చైతన్యంతో త్రికాలాల్లోకి అవలీలగా వెళ్తూ వచ్చారు. దీన్లో ఆయన "చేసిన తప్పుల్ని చెయ్యని తప్పుల్తో హెచ్చవేసుకుని దాన్ని చెయ్యకుండా ఉంటేతో భాగించుకుని వచ్చే శేషాల్తో మో సంవేదనాశీలతను పట్టిచూపే కరదీపిక. ఆయన కవిత్వ ఏ నేపథ్యంలో వచ్చిందో చెప్పే మాన్యువల్. ఆదొక 'కీ'. ఎన్నో సంగతులు దాన్లో ప్రస్తావితమయ్యాయి." "ప్రపంచ సాహిత్యంలో 43 చదివాక - ఉత్తరాన్ని చదవడం ముగించేసరికి - నేను-రాస్కల్ని కోవ్‌కి- కళ్ళు చెమ్మగిలినాయి. నా- అతని-ముఖం పాలిపోయి వుంది." అంటాడు. తాను చదివిన సాహిత్యంలో తన భావధారతో సరిపోయి పాత్రలు, రచయితలు, కవులు, చిత్రకారులు,, సంగీతజ్ఞులు మొదలైన వాటితో తన తాదాత్మ్యాన్ని ప్రకటించాడు. కేవలం సాహిత్యంలోని పాత్రలతో, భావధారలోనే కాకుండా లౌకిక జీవనంలోనూ ఆయన నిస్సహాయుల పట్ల సహానుభూతిని కలిగి ఉన్నాడు. ఆ సహానుభూతి తనమీద ఆరోపించుకుని నిషాదించాడు. 'పునరపి'లోని పాంచ భౌతిక పంచాయితీ 'ఇటువంటిదే'. "ఒకరి మృత్యువు మరోకరి మరణాన్ని కాపాడుతుంది" అన్న మో వాక్యార్థాన్ని వాచ్యార్థంగా కాకుండా దాన్లోని ధ్వనిని, తాత్త్వికతను వినగలగాలి. భావించగలగాలి. చాలా ఎక్కువ కవితల్లో మృత్యువు ప్రస్తావన వస్తుంది. అది కేవలం ఫ్రాయిడ్ ప్రభావం వల్ల వచ్చింది కాదు. అంతిమవాస్తవం గురించి బెంగవల్లనో, అస్తిత్వపు ఆందోళన వల్లనో వచ్చేది కాదు. ఆధునికత మనిషిని సమూలంగా సంహరించింది. ఎట్లా సంహరించిందనేది వివిధ శాస్త్రజ్ఞానాల, సిద్ధాంతాల వెలుగుల్లో విశ్లేషించి ఎరుక పరుచుకోవాల్సిన విషయం. మో మాత్రం "నేను నిజానికి ఓ నాడు చనిపోయాను. ఆ సంగతి మీకు తెలీదు, చెప్పను కాబట్టి. నేను కీర్తి శేషుడనయిన ప్రమాదం తప్పింది. ఎందుకొచ్చింది గాని ఎవరి చావు వాళ్ళని చావనివ్వండి. అంటూ బతికిన క్షణాలు ముగించాడు." మనోవైజ్ఞానికంగా ఆయన తేల్చి చెప్పిందేమంటే ఈ రాస్ బ్రతకమంటుంది. తానెటాస్ చద్దామంటుంది. చావటమే మనం చివరికి చేసే పని అంటాడు. మో కవిత్వంలో ప్రధానంగా మూడు భావనలు కనిపిస్తాయ్. ఒకటి: వాంఛ/కాంక్ష, రెండు: మృత్యువు, మూడు: కోల్పోవటం. మృత్యువు, కోల్పోవటం రెండూ ఒకటి కాదు. అసలు లేకపోవటం మృత్యువు. ఉండి దొరకకపోవటం, ఉన్నది లేకుండా పోవటం. ఈ కోల్పోవటం. చిన్న పిల్లాడు పోగొట్టుకునే రబ్బరు/పెన్సిల్ లాంటి వస్తువులతో మొదలై అది మమతను, మానవత్వాన్ని చరిత్రను, సంస్కృతిని, నిన్నను, నేటిని, రేపటిని కూడా కోల్పోవటం వరకు విస్తరించి ఉంటుంది. 'సెన్స్ ఆఫ్ లాస్' అన్న మాట అది. తరచుగా అది మృత్యువును సూచించేదిగా మో కవిత్వంలో కనిపిస్తుంది.

"1954 మార్చి 30న అమ్మ శవాన్ని తీసుకుని కరణం మునసబులు సర్టిఫికెట్‌తో వెళ్తూన్నప్పుడు అపుడు ఇపుడూ లారీల మీద వేసికెళ్లే సర్కసు పశువులు గుర్తు. చీకట్లోంచి చీకట్లోకి వెళ్తూ దారంతా ఏదో వస్తువు కోసం వెదుక్కుంటూ ఇంకా ముందుందోమోనని ఇంకా వడివడిగా వెళ్తూ అసలు వస్తువు లారీలోనే ఉందని తెలీదప్పుడు" అని రాశారు. మాతృవియోగం ఆయనలో ఒక అన్వేషణకు దారి తీసి ఉంటుందేమోనని మనం సందేహ పడవచ్చు. ప్రతిదాన్నీ మనం కోల్పోతూనే ఉంటాం. అనే స్థితికి ఆయన వచ్చారు అని కూడా భావించవచ్చు. ఈ వెలితి, ఈ శూన్యాన్ని మరి దేనితోనూ ఆయన నింపలేకపోయారు. మో లో కనిపించే అసంబద్ధతను జీవితపు పరిమితత్వం, మర్త్యత రెండూ అనుభవంలోకి రావటమే కారణమేమో. "అసంబద్ధత కూడ సంభవిస్తుంది. అబద్ధం కూడ సబద్ధమవుతుంది. అనిజం అసత్యం కాకనే నిజమవుతుంది" అని భావించారాయన. గ్రీకు పురాణ కథల గాథల గాఢ పరిచయంతో పాటుగా, ఆధునిక తత్వ, సాహిత్యశాస్త్రాలలో తరచుగా చర్చకు వచ్చే అస్తిత్వ, అసంబద్ధ వాదాల పరిచయ ప్రభావం కూడా మో పై బలంగానే కనిపిస్తుంది. ఫ్రాయిడ్ ఎలాగూ ఉండనే ఉన్నాడు. "మృత్యువు ప్రపంచ మానవ ప్రాథమిక హక్కు. కాటికాపరి కన్నీళ్ళ కోసం ఎవరూ బతకరు. కాల్చిన కట్టెల కయిన ఖర్చు చూస్తే ఏడుపొస్తుందంతే గాని, దూరం దగ్గర పడినపుడు చేర్చాల్సిన చోటు ముందుకి నడిచి వచ్చినపుడు, గడియారంలో ఇసుక ఆఖరి రేణువులు రాల్తున్నపుడు అందరూ నిశ్శబ్దాన్ని గౌరవిస్తారు." మృత్యువును ఆయన తాత్త్వికంగా పలుకోణాల నుంచి వ్యాఖ్యానించాడు. ఆయన కవిత్వాన్ని ఎన్నో విధాలుగా చదివి అన్వయించుకోవడానికి సకల మార్గాలను తెరిచే ఉంచారు.

అయితే మో ఒక విషయాన్ని ఏ సందేహాలకు తావివ్వకుండా స్పష్టంగా ప్రకటించారు. "ఈ సమాజం సంకీర్ణం. ఈ కవిత్వం అసంపూర్ణయాగం" అన్నారు. ఏ కవి ఏం రాసినా ఈ అసంపూర్ణ యాగంలో భాగమే అవుతుంది. ఆయన తమపై చూపిన ప్రభావం ఎటువంటిదో 80'ల తరువాత రాస్తున్న కవులు మాట్లాడగలిగితే మో కవిత్వంలోని విభిన్నత ఏమిటో తేట తెల్లం అవుతుంది. ఆయన ప్రయోగ పరత్వం గురించి, Metapha, Conceit, Synechdoche metonamy, Parody, allusions, alliterations శైలీశాస్త్రం, భాషాశాస్త్రం, పాఠక ప్రతిక్రియ, వినిర్మాణం, నిర్మాణవాదం, అస్తిత్వవాదం, అసంబద్ధత, అభివ్యక్తి వాదం తదితరమైన వాటి వెలుగులో ఇంకెన్నో అధ్యయనాలు జరుగవలసే ఉన్నాయి. ఆయన కవిత్వాన్ని అవగాహనలోకి, అనుభవంలోకి తెచ్చుకోవలసింది ఎంతో ఉంది. మి

---

## సీత-సంగీతం

"మా ఆవిడకు వాళ్ళవాళ్ళు ఏరికోరి ఆ పేరెట్టినందుకు, మాయ లేడిని పట్టుకు రమ్మని మారాముళ్ళు పెట్టదు. నా మీద యెంత తామసం వచ్చినా, భూమి బద్ధలు కొట్టదు. అదీ రవంత సుగుణం. కాని అసలు విషయం మరెవ్వరికీ తెలియదు. ఈవిడ పుట్టింటి తరపు వాళ్ళందరిదీ మంచి వాగ్ధాటి! ఈ పిల్లదానికి మరో పాలెక్కువ. దాంతో కాపరానికి వచ్చిన కొత్త రోజుల్లో చూసుకో, నా స్థితి! – ముప్పొద్దులూ ఆ చిలకపలుకులూ వినలేక, దీనికి మందు ఇదీ అనీ నేను సంగీతంలో పడ్డాను. అయితే, అది మనకు వికటించి, ఆవిడకు గుణమిచ్చింది. మన ఘోష వినిపంచదు. మనం మటుకు వినక తప్పదు. చూశావట్రా, ఇంతకు పూర్వమంటే, ఆవిడ మాటలే వినాల్సివచ్చేది. మన శాపం కూడా మనమే ఆలకించవలసి రావడంతో, ఇహ మన అవస్థ చూడు! పోనీ– ఊరుకుందామా అంటే, ఆవిడ వెంటనే అందుకుంటుందాయెను! దానికన్నా ఇదే కొంత మెరుగని, ఇలా కాలక్షేపం చేసుకొస్తున్నాను. తినగ తినగ వేము తీపి అన్నట్లు, ఇప్పుడిప్పుడే నా సంగీతం నా చెవికి ఇంపుగా ఉన్నట్టు భ్రమ కలుగుతూంది. కనుక బతికిపోయినాను కాని, లేకపోతేనా – నాకూ యేనాడో చెవుడొచ్చి ఉండేది!"

**– చిదంబరం** (కృష్ణాతీరం)

# ప్రాచీన శాసనాలు - విద్యావిధానం

- గల్లా చలపతి

ప్రాచీన కాలంలో విద్యలంటే వేదవిద్యలే. క్రీస్తు శకారంభం నుండి భారతదేశంలో రాచరిక వ్యవస్థ పటిష్ఠంగా రూపుదిద్దుకొన్నది. అప్పటి పాలకులైన రాజులు, పాలితులైన ప్రజలతో పాటు పాలనకు సంబంధించిన, సమాజ నడతకు సంబంధించిన సూత్రాలను నిర్దేశించిన ప్రముఖ వర్గం బ్రాహ్మణ (పురోహిత) వర్గం. వీళ్ళకు పరిపాలన మీద, పరిపాలించే ప్రభువుల మీద ఆధిపత్యం ఉండేది. అప్పటి జనాభాలో వివిధ వర్ణాలవారు ఉన్నప్పటికీ, బ్రాహ్మణ క్షత్రియులే గణన కెక్కినవారు.

దేశంలోని ప్రజలలో ఎక్కువ భాగం ప్రాకృత భాషా వ్యవహర్తలు. పండితులది కొంత ప్రాకృతం, ఎక్కువగా సంస్కృతం. వేదాలు మొదలుకొని సూత్ర వాఙ్మయం వరకు సంస్కృత భాషలోనే ఉన్నాయి. బౌద్ధ పండితుల సాహిత్యమంతా ప్రాకృతంలో ఉంది. సంస్కృత పండితులకు, ప్రాకృత పండితులకు మధ్య సామరస్యం తక్కువ. జనాభాలో నిరక్షరాస్యులే ఎక్కువ. సమాజంలోని ప్రజలందరికి చదువుకొనే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంతో ప్రాచీన విద్యను పరిశీలించాలి.

క్రీస్తు శకానికి కొన్ని వందల సంవత్సరాలకు ముందే వర్ణాశ్రమ వ్యవస్థ ఏర్పడింది. వర్ణాల వారీగా విద్యలు, విద్యుక్త ధర్మాలు రూపొందింపబడినాయి. కౌటిల్యుని 'అర్థశాస్త్రం' (క్రీ.పూ. 400) లో నాలుగు వర్ణాలవారు నేర్చుకోవలసిన విద్యలు ఇలా చెప్పబడినాయి.

**'స్వధర్మో బ్రాహ్మణస్య అధ్యయనమ్, అధ్యాపనమ్, యజనమ్ యాజనమ్, దానమ్, ప్రతి గ్రహశ్చేతి; క్షత్రియస్య అధ్యయనమ్ యజనమ్, దానమ్ శస్త్రాజీవః, భూత రక్షణంచ; వైశ్యస్యాధ్యయనమ్ యజనమ్, దానమ్, కృషిపాశుపత్యే, వాణిజ్యాచ; శూద్రస్య ద్విజాతి శుశ్రూషా, వార్తా, కారు కుశీలవ కర్మ చ."**

*(వినయాధి కారికమ్, తృతీయోధ్యాయః, ప్రథమ ప్రకరణమ్)*

అర్థశాస్త్రం చెప్పిన పై విషయాలు సూత్రబద్ధంగానే కనిపిస్తాయి. అప్పటి వాళ్లంతా అలాంటి విద్యలే నేర్చుకొంటూ ఉండేవారని చెప్పలేం. అర్థశాస్త్రం తరువాత వెలువడిన సంస్కృత సాహిత్యాన్ని, ఆ కాలపు శాసనాలను పరిశీలిస్తే బ్రాహ్మణుల, క్షత్రియుల విద్యలకు సంబంధించిన విషయాలు తెలుస్తాయి. క్రీస్తు పూర్వం మూడవ శతాబ్ది నుండి క్రీస్తు శకం ఆరవ శతాబ్దం వరకు వెలువడిన శాసనాలలో బ్రాహ్మణుల విద్యలు, క్షత్రియుల విద్యలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ కాలంలో వేయబడిన శాసనాలు క్షత్రియులకు క్షత్రియోచిత విద్యలను, బ్రాహ్మణులకు వైదిక విద్యలను సూచిస్తున్నాయి.

దొరికిన శాసనాలలో అశోకుడు (క్రీ.పూ. 3వ శతాబ్ది) వేయించినవి మొదటి శాసనాలుగా కనిపిస్తున్నా, వీటిలో ప్రజలు అవలంబించ వలసిన ధార్మిక విషయాలు, అలవరచుకోవలసిన శీలసంబంధి విషయాలు, అశోకుని బౌద్ధమతానురక్తి ఎక్కువగా కనిపిస్తున్నాయి. వర్ణోచిత విద్యలు కనిపించవు. అందరికీ శీలం ప్రధానమని, కారుణ్యం ప్రధాన గుణంగా ఉండాలని, పెద్దల యెడల గౌరవభావం ఉండాలని ఈ శాసనాలలో నొక్కి చెప్పబడింది. అశోకుడి శాసనాల తరువాత విద్యలను గురించి చెప్పిన శాసనాలలో ఖారవేలుని హాథిగుంపా శాసనం. గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనం, రుద్రదాముని జునాగడ్ శాసనం, సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం, విష్ణుకుండినుల శాసనాలు ముఖ్యమైనవి. ఈ శాసనాలు పాలకులైన రాజులు, వేదవిద్యలను ఆదరించినట్లు, కొందరు రాజులు క్షత్రియోచిత విద్యలతోపాటు వేదాధ్యయనం కూడా చేసినట్లు చెపుతున్నాయి. గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనం (క్రీ.శ. 149)లో గౌతమీ పుత్రశాతకర్ణి 'ఆగమ నిలయస'గా చెప్పబడినాడు. ఈ ప్రాకృత సమాసానికి సంస్కృతం ఆగమానాం నిలయస్య. వేదాది శాస్త్ర జ్ఞానానికి

గల్లా చలపతి, ఫోన్ : 9885826626

ఆధారమైనవాడని అర్థం (ఎపిగ్రాఫియా ఇండికా. 8వ సం. పుట. 60). ఈ శాసనంలో భగీరథ, అంబరీష, ధనంజయాది పురాణ పురుషులతో శాతకర్ణి సమానమైన వాడని చెప్పడం వల్ల శాతవాహనుల కాలంనాటికి పౌరాణిక విషయాలు ప్రచారంలో ఉండినట్లు తెలుస్తున్నది. అందువల్ల పురాణాల అధ్యయనం కూడా వేదవిద్యలో భాగమైనట్లు అర్థమవుతుంది. వాళ్ల కాలం నాటిదే అయిన 'గాథా సప్తశతి' అనేక మత, సామాజిక, సాంస్కృతిక విశేషాలతో పాటు పురాణ కథలను, పౌరాణిక దేవతలను కూడా పేర్కొని ఉండడం దీనికి ఆధారమైన విషయం. జునాగడ్ (గుజరాత్ రాష్ట్రంలోని ప్రాంతం) శాసనం (క్రీ.శ. 150) రుద్రదాముడు అభ్యసించిన విద్యలను ఇలా పేర్కొన్నది.

**"హస్తోచ్ఛ్రయార్జితోర్జిత ధర్మానురాగేణ**
**శబ్దార్థ గాంధర్వ న్యాయాధ్యానం విద్యానాం మహతీనాం**
**పారణ ధారణ విజ్ఞాన ప్రయోగావాప్త విపుల కీర్తినా**
**తురగ గజరథ చర్యాసి చర్మ నియుద్ధాద్యా....తి**
**పరబల లాఘవ సౌష్ఠవ క్రియేణ...."** (ఎపిగ్రాఫియా ఇండికా. 8వ సం. పుట 42). వ్యాకరణ, సంగీత న్యాయ విద్యలలోను, విషయావధానంలోను, గుర్రాలను, ఏనుగులను, రథాలను నడపడంలోను, డాలు సహాయంతో కత్తి యుద్ధం చేయడంలోను, శత్రుబలాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడంలోను రుద్రదాముడు నిపుణుడుగా పై సంస్కృత వాక్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ క్షత్రియోచిత విద్యలే. దొరికిన వాటిలో ఇది మొదటి సంస్కృత శాసనం.

సముద్రగుప్తుని అలహాబాదు స్తంభశాసనంలో కూడా క్షత్రియోచిత విద్యలు కనిపిస్తాయి. వైదిక కర్మలను అతిశ్రద్ధగా ఆచరించిన విష్ణుకుండి వంశ రాజులు (క్రీ.శ. నాలుగైదు శతాబ్దాలు) వేయించిన సంస్కృత శాసనాలలో ఆ వంశపు రాజుల విద్యా విశేషాలు కనిపిస్తున్నాయి. గోవిందవర్మ తుమ్మల గూడెం తామ్రశాసనంలో గోవిందవర్మను గురించి ఇలా చెప్పబడింది. 'సకల శాస్త్రార్థ శ్రవణ పరిజ్ఞానాదిహాపరాత్ర చానన్య చక్షుషా విద్యచ్ఛూర మహాకులీన జన సమాశ్రయేణ.' ఇది గోవిందవర్మ వైదిక జ్ఞానాభిరతినే తెలుపుతున్నది. అతని కనులు (దృష్టి) పెద్దవిగా ఉండి శాస్త్రాలను చూరగొనేవిగా ఉన్నట్లు అర్థమవుతూ ఉంది. ఇది అతని వివిధ శాస్త్రాల పరిచయాన్ని తెలుపుతున్నది. రఘుమహారాజు కండ్లు కూడా పెద్దవిగా ఉండి శాస్త్రాలను అనుసరించేవిగా ఉన్నట్లు (చక్షుష్మత్తాతుశాస్త్రేణ సూక్ష్మ కార్యార్థ దర్శినా) రఘువంశం (4-13) చెపుతున్నది. విక్రమేంద్రవర్మ కవిగా కనిపిస్తున్నాడు. ఇంద్ర భట్టారక వర్మ ఘటికలను స్థాపించి విద్యా వ్యాప్తికి కృషి చేశాడు. జనాశ్రయ బిరుదాంకితుడైన నాల్గవ మాధవవర్మ పండితులను ఆదరించాడు. ఇతని పోషణలోని గణస్వామి ఒక ఛందోగ్రంథాన్ని (జనాశ్రయ ఛందోవిచితి) రచించారు. విష్ణుకుండినుల సామంతులైన పృథ్వీమూల, పృథ్వీ యువరాజులు శ్రుతి స్మృతులను అధ్యయనం చేసినట్లు శాసనాధారాలున్నాయి. గోదావరి తామ్రపట్టికల (శాసనం)లో పృథ్వీమూలుడు 'శ్రుతిస్మృతి విహిత పదార్థావ బోధ జనిత ప్రజ్ఞా వివేకు'డుగా పేర్కొనబడినాడు. పృథ్వీయువరాజు కాలంనాటి చేజెర్ల శిలాశాసనం పృథ్వీయువరాజును 'సుజనానురక్తోనురాగ గురురభిస్తు గుణావాస స్సకల విశారద' అని పేర్కొన్నది. దీనిని బట్టి ఇతడు పండిత సభలలో పాల్గొనే వాడని తెలుస్తున్నది.

విష్ణుకుండినుల శాసనాలన్నీ అగ్రహారాది దాన వివరాలనే తెలుపుతున్నాయి. దానం చేసిన రాజులందరూ దాతలు. గ్రహించే వాళ్లందరూ దాన గ్రహీతలు. దాన గ్రహీతలందరూ బ్రాహ్మణులుగానే కనిపిస్తున్నారు. ఇలాంటి శాసనాలలో దాతల, దాన గ్రహీతల విద్యాది అర్హతల ప్రస్తావన ఉంటుంది. ఈ ప్రస్తావనల విషయాన్ని బట్టి రాజుల-అంటే దాతల విద్యా విషయాలు సమీక్షింపబడినాయి. దాన గ్రహీతల విద్యా విషయాలను పరిశీలిస్తే వీళ్ళందరూ వైదిక విద్యా ప్రవీణులుగా కనిపిస్తారు.

'వేద వేదాంగ విదో రుద్రశర్మణో,' 'శ్రుతి స్మృతి విహిత సనాతన ధర్మకర్మ నిరతాయ ద్వివేద గ్రహీత', 'వేదచతుష్టయ సమాన్నాతావదాతా', 'వేదవేదాంగ న్యాయోపనిషద్యోగావ బోధ,' 'వేదవేదాంగ పారగాయ షట్కర్మ నిరతాయ యమ నియమ పరాయణాయ పురాణ రామాయణ ధర్మ శాస్త్రాద్యనేక విద్యాపారదర్శినే" -ఇత్యాది విషయాలు విష్ణుకుండినుల నాటి శాసనాల్లో దాన గ్రహీతల అర్హతలను వివరించే సందర్భాలలో కనిపిస్తున్నాయి. ఈ విషయాలను బట్టి అప్పటి బ్రాహ్మణ కవి, పండితుల అధ్యయన అధ్యాపనాల్లో వేద వేదాంగాలు, దర్శనాలు, పురాణాలు, ఇంకా అనేక విషయాలు ఉండినట్లు అర్థమవుతుంది. శాస్త్ర విషయాలు నేర్చుకోవడమే అప్పట్లో గొప్ప. కావ్యాలు అధ్యయనం చేయడం సామాన్య విషయమే. వేదవిద్యలకు అధిక ప్రాధాన్యముండేది. ద్వివేదులు,

చతుర్వేదులు శాసనాల్లో కనిపిస్తారు. కృష్ణయజుర్వేదానికి చెందిన తైత్తిరీక శాఖాన్వయులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. విష్ణుకుండినుల శాసనాల్లో సహస్ర, త్రిసహస్రవిద్య, అసీతితర్క, సహస్రతర్క, చతుష్షష్టి ఇత్యాది పదాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ విద్యావిశేషాలే. ఇవి దాన గ్రహీతలైన బ్రాహ్మణుల పితృపితామహుల విద్యలుగా చెప్పబడతాయి. వీటికి సంబంధించిన వివరాలను డా॥ఎస్. శంకర నారాయణగారు తన 'విష్ణుకుండీస్ అండ్ దేర్ టైమ్స్' అనే గ్రంథం (1977) లో తెలియజేశారు. 'ద్వివేద గృహీత సహస్ర శాలంకాయన గోత్ర ఛందోగ బాలస్వామినే' అని రెండవ మాధవవర్మనాటి ఖనాపూర్ తామ్రపట్టికలలో ఉంది. ఇందులోని 'సహస్ర' శబ్దం సామవేదానికి చెందిన వెయ్యి శాఖలను సూచించడానికి వాడబడి ఉంటుందని శంకరనారాయణ గారి ఆలోచన (అదే గ్రంథం, పుట 145). అసీతితర్క, సహస్రతర్క అనేవి తర్కశాస్త్ర సంబంధులు. చతుష్షష్టి అరవైనాలుగు కళలను తెలిపే పదం. ఈ కళలో నైపుణ్యం సంపాదించడం కూడా అప్పటి విద్యలలో ఒక అంశమే. వాత్స్యాయనుడు కామ సూత్రాలలో అరవైనాలుగు కళలను గురించి వివరించారు.

అప్పటి రాజులు సమాజంలో విద్యావ్యాప్తికి చేసిన కృషి శాసనాల్లో కనిపిస్తుంది. విష్ణుకుండి రాజు ఇంద్రభట్టారక వర్మకు 'యథావిధి వినిర్యాపిత ఘటికావాప్త పుణ్యసంచయ' అనే బిరుదు ఉండినట్లు చిక్కుళ్ల తామ్ర శాసనం పేర్కొంటున్నది. శాస్త్రోక్తంగా నిర్వహింపబడిన (వినిర్యాపిత) ఘటికల వల్ల పొందిన పుణ్యం కలవాడని ఈ బిరుదుకు అర్థం. 'ఘటిక'ను గురించి పండితులెందరో చర్చించారు. శంకర నారాయణగారు ఆ చర్చలను పరిశీలించి ఆ మాటకు సరైన వివరణ ఇచ్చారు. (అదే గ్రంథం అపండెక్స్-4. పుటలు 236-238). ఘటిక బ్రాహ్మణులు, క్షత్రియులూ, వేదాది విద్యలు అభ్యసించడానికి ఏర్పాటు చేయబడిన విద్యాస్థానమని వారు అనేక ఉపపత్తులతో నిరూపించారు. ఇంద్ర భట్టారక వర్మ ఈ ఘటికను వేంగీపట్టణ (అప్పటి రాజధాని) ప్రాంతంలో స్థాపించారు. దీని నిర్వహణ రాజు అధీనంలో ఉంటుంది. శాసనాలు ఆధారంగా ఆంధ్రదేశంలో కనిపించిన మొదటి విద్యాస్థానం (ఘటిక) ఇదే. తరువాత తూర్పు చాళుక్యుల పరిపాలన ప్రారంభంలో జయసింహవల్లభుడు అసనపుర ఘటికకు దానం చేసినట్లు ఒక శాసనముంది. అసనపురం ఎక్కడుందో తెలియడంలేదు, కాని ఇది ఆంధ్రదేశంలోనే ఒక విద్యాకేంద్రమనేది స్పష్టం. దీనిని జయసింహవల్లభుడు స్థాపించాడా లేక అంతకు ముందే ఉండిన (ఇంద్రభట్టారక వర్మ స్థాపించిన) ఘటికకే దానం చేశాడా అన్నది నిర్ధారణ కాలేదు. ఆంధ్రదేశంలో ఘటికల స్థాపనకు ముందే కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలలో ఘటికలున్నట్లు ఆధారాలున్నాయి.

కదంబ వంశానికి చెందిన మయూర శర్మ (క్రీ.శ.345-370) వేదాధ్యయనం కోసం కంచిలో ఉండిన ఘటికకు వెళ్లాడు. ఈ కంచి ఘటికను పల్లవ రాజులైన స్కందవర్మగాని లేక విష్ణుగోపుడుగాని స్థాపించినట్లుంది. లేదా వీళ్లకంటే ఇంకా ముందే ఉందోమో తెలియదు. మయూరశర్మ విషయం కదంబవంశస్థుడైన కకుత్‌స్థవర్మ వేయించిన తాలగుంత (షిమోగా జిల్లా, కర్ణాటక రాష్ట్రం) స్తంభశాసనంలో ఇలా ఉంది:

**"ఏవమ్ ఆగతే కదంబకులే శ్రీమాన్ బభూవ ద్విజోత్తమః**
**నామతో మయూర శర్మేతి శ్రుతశీల శౌచాద్యలం కృతః॥**
**యః ప్రయాయ పల్లవేంద్రపురీమ్ గురుణాసమమ్ వీరశర్మణా**
**అధి జఘాంశుః ప్రవచనమ్ నిఖిలమ్ ఘటికాం వివేశాసు తర్కుకః**
**తత్ర పల్లవాశ్య సంస్థేన కలచేన తీవ్రేణరోషితః కలియుగేస్మి**
**నహోబత క్షత్రాత్ పరిపేలవా విప్రతాయతః॥**
**గురుకులాని సమ్యగారాధ్య శాఖామధీత్యాపి యత్నతః**
**బ్రహ్మ సిద్ధిర్యాది నృపాధీనా కిమతః పరమ్ దుఃఖ మిత్యతః॥**

(ఎపిగ్రాఫియా ఇండికా. 8వ సం.పుటలు 24-36)

మయూరశర్మ తన గురువైన వీరశర్మతో కలసి వేదవిద్యను త్వరగా అధ్యయనం చేయడానికి పల్లవేంద్రపురి (కంచి)కి వెళ్ళాడు. అక్కడ (పరీక్షల నిర్వహణకు సంబంధించి కాబోలు) పల్లవ అశ్వసంస్థాధికారితో తగాదా ఏర్పడింది. ఎంతో శ్రద్ధతో విద్యనార్జించిన బ్రాహ్మణుడు విద్యాసంస్థ (ఘటిక) రాజుల నిర్వహణలో ఉండడంవల్ల ఆశక్తుడుగా ఉండి పోవలసినందుకు బాధ, రోషం కలిగాయి. వెంటనే వాళ్లను జయించడానికి కత్తి తీశాడు. పల్లవులు ఇతనిని అణచలేక సంధి చేసుకొని పశ్చిమ తీర ప్రాంతంలో వైజయంతి (బనవాసి) ప్రాంతాన్ని అప్పగించారు (క్రీ.శ.345). మయూరశర్మతో మొదలైన కదంబవంశంలో తరువాత పదమూడు మంది రాజులు పరిపాలన చేశారు. అప్పటి రాజకీయ విషయాలు ఈ సందర్భంలో అప్రస్తుతం.

మధ్యయుగారంభ (Pre-medieval) కాలంలో వెలువడిన శాసనాలలో 'ఘటికాస్థానం' అనే మాట అక్కడక్కడా కనిపిస్తున్నది. విద్యాస్థానా (కేంద్రా)నికి, విద్యాస్థానమున్న ప్రాంతా (గ్రామా)నికి కూడా ఈ మాటనే వాడినట్లుంది. అయితే వేదవిద్యలు నేర్పే విద్యాకేంద్రానికి చిన్నకుండ (jar)అనే అర్థాన్నిచ్చే ఘటిక అని పేరెందుకు ఏర్పడిందో పరిశీలించాలి.

పూర్వమీమాంసాచార్యుడైన కుమారిలభట్టు (క్రీ.శ.7వ శ.) వేదవిద్యలకు సంబంధించిన ప్రశ్నలడిగే పద్ధతిని చర్చిస్తూ తన మీమాంసా సూత్రాలలో 'ఘటికామార్గం' వైదిక విద్యార్థుల అర్హతలను నిర్ణయించే పరీక్షా విధానంగా పేర్కొన్నాడు. ఆయన చెప్పిన వాక్యమిది: 'అనుయోగేషు వేదానాం ఘటికా మార్గ వృత్తిషు'. ఈ వార్తిక వాక్యాన్ని భట్టసోమేశ్వరుడనే వ్యాఖ్యాత (క్రీ.శ.1200) ఇలా వ్యాఖ్యానించాడు.

**"వేద కౌశల జ్ఞానార్థానామ్ తత్తద్వేదభాగ చిహ్నాలేఖ్యాని**
**ఘటికాయాం కుంభాఖ్యాయాం నిక్షప్య తత్తద్వేదభాగ**
**పరీక్షాకాలే తాన్యాకృష్య ఆ కృష్ట లేఖ్య చిహ్నితం**
**వేద పాఠ ఇత్యధ్యేతారః అనుయుజ్యంతే ఇతి**
**ఘటికా మార్గ వృత్తినోను యోగాః"**

శంకరనారాయణగారు గొప్ప సంస్కృత పండితుడు కావడం వల్ల 'ఘటిక'కు ఆమోద యోగ్యమైన వివరణను ఇస్తున్న ఈ వార్తకాన్ని, వార్తిక వ్యాఖ్యానాన్ని తన పరిశోధనలో కనుక్కో గలిగారు. (అదే గ్రంథం పుట 236-238). ఈ విషయం తెలిశాక ఘటిక వేదవిద్యార్థులను పరీక్షించే ఒక పరీక్షావిధానానికి చిహ్నమని అర్థమవుతున్నది. కొన్ని వేదభాగాలను చిన్న చిన్న తాటాకులపై రాసి ఆ తాటాకులను ఒక కుండలో (ఘటం-కుండ,) ఘటిక-చిన్నకుండ) వేసేవారు.

వేదవిద్యలో పరీక్షకు వచ్చిన విద్యార్థులకు ఆ కుండలోని ఒక తాటాకు తీసి ఇచ్చి అందులోని విషయాన్ని అడిగేవారు. విద్యార్థి చెప్పిన సమాధానాన్ని బట్టి అర్హత నిర్ణయింపబడేది. ప్రశ్నలు ఘటిక నుండి తీయడం వల్ల ఈ పరీక్షాపద్ధతికి ఘటికా మార్గమని పేరేర్పడింది. అలా జరిగే ప్రాంతం ఘటికా స్థానం. అప్పటిదంతా వేదవిద్య కావడం వల్ల, విద్యార్హతను నిర్ణయించడంలో ఘటికకు ప్రాధాన్యత ఉండడం వల్ల విద్యాకేంద్రానికి ఘటిక అని పేరు స్థిరపడింది. వేదవిద్యాకేంద్రమని, వేదపాఠశాల అని కూడా చెప్పవచ్చు. కదంబ మయూర శర్మ అప్పటికే గురుకులంలో కష్టపడి విద్యనేర్చుకొని 'బ్రహ్మసిద్ధి' (అర్హత) పొందినవాడైనా కంచిఘటికలో పరీక్ష విషయంలో తగాదా వచ్చినట్లుంది.

సంస్థ, రాజు అధీనంలో ఉండడంవల్ల అతను కూడా అందరిలాగా పరీక్షింపబడాలని నిబంధన ఉన్నట్లు చెప్పి ఉంటారు. ఇది అతనికి నచ్చలేదు. తాను వేదవిద్యలో అర్హుడైనా కంచి ఘటిక నుండి ఉత్తీర్ణపత్రం పొందాలని వస్తే ఇక్కడ తనకు పరీక్ష ఏమిటనిపించింది. పైగా బ్రాహ్మణులకు వేదవిద్యలు నేర్పే సంస్థపైన రాజుల, రాజోద్యోగుల అజమాయిషీ ఏమిటని కూడా అనిపించింది. మధ్యయుగంలో గ్రామసభలకు సభ్యులను ఎన్నుకోవడానికి కూడా ఇలాంటి ఘటికామార్గాన్నే అనుసరించినట్లు శాసనాధారాలున్నాయి.

అప్పట్లో కంచి ఘటికకు దేశవ్యాప్తంగా పేరు ఉన్నందువల్లనే అనేక ప్రాంతాల వాళ్లు కంచికి వెళ్ళేవారు. కంచి ఘటిక నుండి అర్హతా పత్రాలను పొందిన (Proficiency Certificates) తరువాతనే పండితులుగా చెలామణి అయ్యేవారు. మి

## ముఖచిత్రం

చిత్రకారుడు కె.లక్ష్మాగౌడ్ : ఆధునిక భారతీయ చిత్ర, శిల్పకళా నైపుణ్యంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన వాడు. తెలంగాణా మట్టిలోని సారు, సుగంధంతో తన చిత్రకళను మమేకం చేసినవాడు. 40 సంవత్సరాల క్రితం ఎమ్.ఎఫ్. హుస్సేన్‌చే పదిమంది ఉత్కృష్ట భారతీయ చిత్రకారుల్లో ఒకనిగా పేర్కొన బడినవాడు. ఈ గణేష్ చిత్రం ఒక రకమైన బేస్ రిలీఫ్ శైలిలో వేయబడ్డ చిత్ర శిల్పం. ఇది అప్లిక్ కుట్టులా చేతికి గరుకుగా తగులుతుంది.

### రెండు, మూడు, చివరి అట్టలు

చిత్రకారుడు శీలా వీర్రాజు : మూడు చిత్రాలు కాన్వాసు మీద తైలవర్ణాలు. అలసినవేళలో-పూలు తలలు వాల్చడం; దిక్కుతోచని రైతు దీనవదనం శీలా వీర్రాజు నిశితపరిశీలనకు నిదర్శనం. వీరిపై ప్రత్యేక వ్యాసం జనవరి 2011 *మిసిమి* లో చూడండి.

# విశ్వనాథ వారితో మధురవాణి

- పురాణం సుబ్రహ్మణ్య శర్మ

*ఆలపాటి రవీంద్రనాథ్ ఆలోచనలోనుంచి ఉద్భవించినవి 'మధురవాణి ఇంటర్వ్యూలు'. ఈ ఆలోచనకు ఆకృతినిచ్చి రసరమ్యంగా చమత్కారపు చమ్కీలతో తెలుగు వాఙ్మయాన్ని అలంకరించారు పురాణం సుబ్రహ్మణ్యశర్మ.*

*ఒక వ్యక్తిని -అదీ ఒక మేరునగసమానుని-పలకరించాలంటే వారి రచనలన్నీ చదవాలి-వారి జీవితం తెలియాలి-లోకంలో వారిపై వచ్చిన ప్రశంసలు-విమర్శలూ అర్థం చేసుకోవాలి. ఇది సామాన్యమైన విషయం కాదు. ఇంతటి మహత్కార్యాన్ని అద్భుతంగా-అవలీలగా సాధించి తెలుగు పాఠకులకు* ***మిసిమి*** *ద్వారా అందించారు పురాణం! హాస్యాన్ని-అధిక్షేపాన్ని ఉగాది పచ్చడిలా రుచి చూపించారు. విశ్వనాథవారి జయంతి సందర్భంగా* ***మిసిమి*** *పాఠకులకు మరొక్క సారి ఈ విందు.*

*సం॥*



**విశ్వనాథ సత్యనారాయణ**

విశ్వనాథ సత్యనారాయణ గారు మధురవాణితో పేకాడుతూ వుంటారు. సత్యనారాయణ గారు వక్కపొడి నములుత్తూ 'థూ థూ' అని తూస్కారాలు చేస్తూ్త వెండలిక్కించి యిటూ అటూ చూసస్తూ 'సెట్' చేయడంలో నిమగ్నమై వుంటారు. సత్యనారాయణ గారు ముక్క వేస్తారు. మధురవాణి ముక్క తీసి-

**మధురవాణి:** షో -

**విశ్వనాథ:** కొంప ముంచావే - నాలుగు సెట్లు అయాయి. ఈ వెధవ ఆసు చూడు, రామ్ రామ్.

**మధుర:** యీ పేకాటకి రామాయణానికీ ఎలా కుదురుతుంది.?

**విశ్వనాథ:** మరల నిదేల రామాయణం బన్నచో -

**మధుర:** తెలుసులెండి 'తినుచున్న యన్నమే తినుచున్నదిన్నాళ్ళు' అంటారు. అన్నం తినడం రామాయణం రాయడం ఒకటేనా?

**విశ్వనాథ:** ఎవడిష్టం వాడిది థూ.......

**మధుర:** నేనన్నదదికాదు. వాల్మీకి రామాయణం అర్థంకాకపోతే తప్పువాల్మీకిది కాదు.

**విశ్వనాథ:** కాదు-

**మధుర:** మరి రామాయణ కల్పవృక్షం అర్థం గాకపోతే తప్పంతా సత్యనారాయణ గారిదైనట్లు మాట్లాడుతారే?

**విశ్వనాథ:** అల్లా గడ్డి పెట్టు, అడిగే వాళ్ళకి. ఈ జన సమూహమునందు నే శరీర మాత్రముగ బోవు చుంటి.

**మధుర:** పేకుడుతూన్నప్పుడు కూడానా-

**విశ్వనాథ:** నా (పాడు) మనసుకి విశ్రాంతి యేది? కాసేపు ఆ మనసును పట్టించుకోకుండా వుందామని చీట్లపేక ఆడుతూ కూర్చుంటా. అప్పుడూ ఆగదు యీ మనస్సు.

**మధుర:** ఏం చేస్తుంది?

**విశ్వనాథ:** మనకు తిథులున్నాయి కదా! ప్రతి తిథిలోనూ చంద్రుడెప్పుడు ఉదయిస్తాడు, ఎప్పుడస్తమిస్తాడు; ఏ దిశనుండి వెన్నెలలు ఎలా పడతాయి; చీకట్లు ఎలా కమ్ముతాయి; యిలా ఆలోచిస్తూ నేను ఎన్ని రాత్రులు నిద్ర లేకుండా ఆకాశం వైపు చూస్తూ గడిపానో...

**మధుర:** మిమ్మల్ని విమర్శించే వాళ్ళు మిమ్మల్ని చదవకుండా విమర్శిస్తున్నారనుకుంటా-

**విశ్వనాథ:** వాడికి మనస్సనేదే వుంటే, చదవటమనేది తెలిస్తే; నా రామాయణం చదివిన వాడు, లోకాన్ని నేను ఎంత నిశితంగా పరిశీలించానో తెలుసుకుంటాడు! కాలంలోని ప్రతి లిప్తనేను చూచాను. దేశంలోని ప్రత్యంగుళం నేను కొలిచాను.

**మధుర:** అన్నట్లు అడవిలో సీతారాములు గడిపిన మొదటి రాత్రి గురించి రాశారు. మీరెప్పుడైనా అడవుల్లో వున్నారా?

**విశ్వనాథ:** రాయాలంటే అడవిలో కాపురం వుండనక్కర్లేదు.

భావించగల మనస్సుండాలి. అది నిత్య జాగ్రదవస్థలో వుంటుంది.

**మధుర:** అంటే రైలులో వెళ్ళినా కారులో వస్తున్నా కూడానా?

**విశ్వనాథ:** ఆహ్వా! దీనికి తోడు అడవిలో తిరిగా. వేటను గురించి జిమ్‌కార్బెట్, హెండర్‌సన్ సింగ్ వీళ్ళందరిదీ చదివా–

**మధుర:** జిమ్‌కార్బెట్ చదివి సీతారాములు అడివిలో గడిపిన మొదటి రాత్రి రాశానంటారా? (నవ్వు)

**విశ్వనాథ:** ఇవన్నీ నాకేమి ఒరిగించాయి? వాటిలోని విషయాలు నా మనసులో పడిన తరువాత వాటికి కలిగే సంస్కారం వేరు. అవి నా అనుభవ విషయాలవుతాయి.

**మధుర:** చిత్రంగా వుందే–

**విశ్వనాథ:** ఏనాడో ఎక్కడో నేను అలా అడవిలో రాత్రిళ్ళు గడపి వున్నాననే అనిపిస్తుంది.

**మధుర:** ఏది మీ చెయ్యి యిలాగివ్వండి చూస్తా–

**విశ్వనాథ:** సరే నా చెయ్యిస్తే నాకేమిస్తావ్?

**మధుర:** ఓ ముద్దు సరేనా?

**విశ్వనాథ:** నాకు భారత ప్రభుత్వం వారిచ్చిన పద్మభూషణం కంటె ఎక్కువే. ఇదిగో చూడు.

**మధుర:** రేఖలు ఎర్రగా వుండి మృదువుగా వుంది మా హస్తం. (ముద్దు పెట్టుకుంటుంది)

**విశ్వనాథ:** చేతినా....?

**మధుర:** శిరోరేఖ అరచేతి మధ్యలో వాలి, చంద్రస్థానానికి చేరి, రెండుగా చీలితే–

**విశ్వనాథ:** చీలితే?

**మధుర:** అసాధారణమైన యోచనా, సృజనాత్మక శక్తి కలిగి వుండటాన్ని సూచిస్తుంది. చిటికిన వ్రేలు పొడుగ్గా వుంటే సాహిత్యంలో ప్రతిభను చాటుతుంది.

**విశ్వనాథ:** యింకా–!

**మధుర:** బొటనవ్రేలు స్ట్రెయిట్ రెండవ కణుపు స్టిఫ్‌గా వుండి, గోళ్ళు ఎరుపుగా, పొడవుగా, వెడల్పుగా వుండి, ప్రతి గోరు చంద్రవంకలు కల్గివుంది.

**విశ్వనాథ:** ఇంతకీ ఏమంటావు?

**మధుర:** సాహిత్య రంగంలో తగిన మీ మానస శక్తిని శిరోరేఖ చూపిస్తోంది. దీక్ష, కృషి చేయడానికి కావలసిన శక్తి, ఓపిక; మీ హృదయ శిరోరేఖ మధ్య దీర్ఘచతురస్రాకారంగా ఏర్పడిన ఆకారం యిందుకు కారణం.

**విశ్వనాథ:** నువ్వు చెప్పింది నేనెట్లా నమ్మేది?

**మధుర:** జార్జిబెర్నార్డ్‌షా, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మార్క్ ట్వైన్ గార్ల జాతకాల్లాగ మీ జాతకం వుండబట్టే నేను చెప్పగలిగా.

**విశ్వనాథ:** అబ్బో, చాలా ఘటికురాలివే! చెప్పు–

**మధుర:** మీచేతి వేళ్ళు కణుపులుగా వుండటం (నాటీ జయింట్స్) మంచి విమర్శనాశక్తికి నిదర్శనం. వేళ్ళు పొడవుగా విడి విడిగా వుంటే స్వాతంత్ర్య భావము, ఆత్మ విశ్వాసం ఎక్కువగా వుంటాయి.

**విశ్వనాథ:** వున్నదే అది. నువ్వు నాకు జోస్యం చెప్పినందుకు నీకు నేనో రహస్యం చెబుతా విను. మనకు తెలిసిన మాటలనే, మనం పలికే పదాలనే వుపయోగించి ఒకానొక విన్యాస విశేషం చేత కవి జగాలనే సమ్మోహింప జేస్తాడు.

**మధుర:** అయితే వున్నదంతా కవి విన్యాస మహిమలో వుందంటారు?

**విశ్వనాథ:** నన్నయ్యయు దిక్కన్నయు నన్నావేశించిరి, వారలు పోయిన తెన్నున మెఱుగులను తీర్చి దిద్దుచు బోదున్!

**మధుర:** మీ ఫేట్ లైన్ చంద్రస్థానం నుండి బయల్దేరి సూర్యస్థానానికి చేరిందంటే అర్థం మీకు జ్ఞానపీఠం బహుమతి వచ్చి వుంటుంది. అవునా?

**విశ్వనాథ:** నీవు పేపర్లో చదివి చెబుతున్నావు; లేదనేందుకునెవణ్ని?

**మధుర:** ఏదైతే నేమిటి? భూమి గుండ్రంగా వుండి తన చుట్టు తాను తిరుగుతోందని జాగ్రఫీ పుస్తకాల్లో స్పష్టంగా వుంటే, మీరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వేయి పడగలున్నాయనీ ఆ పడగల మీద భూమిని మోస్తున్నాడని నమ్ముతున్నా రేవిటి?

**విశ్వనాథ:** భూమిని సుబ్రహ్మణ్యేశ్వరుడు మోస్తున్నాడన్నది పౌరాణికమైన మాటకాని భూగోళ విషయం కాదు.

**మధుర:** జాగ్రఫీ వేరు పురాణాలు వేరూనా?

**విశ్వనాథ:** అవును. ధర్మం సహస్ర ముఖంగా వుంటుంది. ధర్మం చేత భూమి పాలింపబడుతూ వుంటుంది అని అర్థం. అదే వేయి పడగలు.

**మధుర:** మీ నవల్లో రామేశ్వరశాస్త్రి నాలుగు వివాహాలు చేసుకున్నాడు. బ్రాహ్మణులు అన్ని పెళ్ళిళ్ళు చేసుకోవచ్చుని చెప్పడంలో మీ వుద్దేశం?

**విశ్వనాథ:** అది సాంకేతికమైన విషయం. యథార్థం కాదు.

**మధుర:** సబ్బన్నపేటలో పాములు ఎక్కువా?

**విశ్వనాథ:** సుబ్బన్నపేట సబ్బన్నపేటకాదు, అది దేశానికంతా చిహ్నం. పాములంటావా అవి పాములు కావు. గ్రామాధికారి నాలుగు పడగల పామును చూస్తాడు. అది చాతుర్వర్ణ్య ధర్మం. అరుంధతికి రెండు పడగలు కనిపిస్తాయి. అది దాంపత్య ధర్మము. చివరికి ఒక పడగే కనిపిస్తుంది. అది అంతా కలిసి ఏక రూపమైన ధర్మము.

**మధుర:** మీరు జమిందారీ విధానాన్ని సమర్థించారని దాని అర్థం; అవునా?

**విశ్వనాథ:** ఇక్కడి జమిందారు రాజస్థానీయుడు. రాజనగా ఒకే వ్యక్తి రాజు కాడు. దేశాన్ని పాలించే వాళ్ళంతా కలిసి ఒక రాజు. ఇక్కడ జమిందారంటే పాలకవర్గం అని అర్థం.

**మధుర:** మీరు రాసింది అడిగితే మీరే కాదంటున్నారు. మీతో ఎల్లావేగడం? మరి జమీందారు కొడుకు రంగారావు మాటేమిటి?

**విశ్వనాథ:** విజాతీయమైన భావానికి లొంగిపోయి సంప్రదాయమూ స్వజాతి లక్షణమూ మర్చిపోయిన కొడుకు రంగారావు.

**మధుర:** మరి గుర్రప్పందాల గురించి వ్రాశారు?

**విశ్వనాథ:** గుర్రప్పందాలంటే గుర్రాలు, పందాలు కావు. విజాతీయ సంస్కృతి వ్యామోహానికిది చిహ్నం.

**మధుర:** సుబ్బన్న పేటకి ఎలక్ట్రిసిటీ వస్తే విద్యుద్దీపాలని తిట్టారు మీరు?

**విశ్వనాథ:** దీపాలంటే విద్యుద్దీపాలని తిట్టానా? అనాది నుంచీ యీ దేశం గ్రామ నాగరికత కలది. లక్షలాది పల్లెటూళ్ళు -ప్రధాన వృత్తి వ్యవసాయము కల యీ దేశం పరిశ్రమలు కల దేశాల నాగరికత నవలంబించి చెడిపోతున్నదని తాత్పర్యం.

**మధుర:** పంపులు వస్తే వీధుల్లో పంపుల్ని తిట్టారు. మీరు మీ యింట్లో విద్యుద్దీపాలు వాడటం లేదా? పంపులో నీళ్ళు వస్తే తాగటం లేదా ?

**విశ్వనాథ:** నేను వేయిపడగలు రాసే నాటికి పట్టణ నాగరికత వచ్చి ఎల్లా గ్రామాలు పాడవుతున్నాయో చెప్పాను. పంపుల్నీ దీపాల్నీ తిట్టాననా? అవన్నీ సాంకేతికమైన విషయాలు.

**మధుర:** మొత్తానికి మీరు మార్పులకి వ్యతిరేకి. మీదంతా వెనకచూపే కాని ముందుకు చూడలేరు.

**విశ్వనాథ:** పిచ్చి పిల్లా. నీకు విశ్వనాథ అర్థం కావాలంటే, వాని సనాతన ఉపదేశాలని కొట్టి పారెయ్యకుండా వుండాలంటే, సాహిత్యం-సంస్కృతి అవిభాజ్యం అనీ వాటి ఉద్ధరణ కూడా అవసరం అనీ గ్రహించాలి.

**మధుర:** మీకసి అంతా ఎవరి మీద?

**విశ్వనాథ:** అంటే పాలకవర్గం, ధనికులు సంప్రదాయాన్ని, దేశీయ పాండిత్యాన్ని, దేశీయ సంస్కారాన్ని నిరాదరిస్తున్నారని నా తాత్పర్యం.

**మధుర:** సుబ్బన్నపేట గురించి చెప్పడానికి ముందు ఒక ఆవు-పాము, ఆ పాము ఆవుపాలు తాగుతూ వుండటం చెప్పారు. ఆ కథ ఎందుకు?

**విశ్వనాథ:** అది యీ దేశం యొక్క స్వరూపం చెప్పటానికి అలా వ్రాశాను. ఏమిటయ్యా యీ దేశం యొక్క స్వరూపం అంటే యీ దేశం యొక్క సంస్కారం యొక్క పునాది అది. అది దైవికము అన్న విషయం. అంతే గాని, యిది నిజంగా పామూ కాదు, పాము పడగలూ కాదు.

**మధుర:** అయితే వేయి పడగల్లో నిజానికి పడగలూ లేవు, పామూ లేదు, బలే చమత్కారంగా వుందే.

**విశ్వనాథ:** నిజమే. ఉన్నది ధర్మము, సంప్రదాయము, భారతజాతి యొక్క సంస్కారము. ఈ గ్రంథంలో ప్రధానంగా సహస్ర ముఖమైన వేద ధర్మం ప్రతిపాదింపబడింది. ఇది తెలుసుకుంటే సరి, అంతా అర్థం అవుతుంది నీకు.



**మధుర:** మరీ మీ నవలలో పసిరిక అనే పాత్రను ఎలా సృష్టించారు? అలాంటి పాత్ర వుంటుందా?

**విశ్వనాథ:** పసిరిక మంగమ్మ బిడ్డ. చూస్తే పామల్లే వుంటాడు. ఈలలు వేస్తాడు. గాలిలో తేలి పోతాడు. రామేశ్వరశాస్త్రి చాతుర్వర్ణ్యానికి చిహ్నం అయితే పసిరిక వ్యవసాయానికి చిహ్నం కదా! అలాంటి వాడు వుండవచ్చు, వుంటే?

**మధుర:** మీరు సృష్టించారన్న మాట.

**విశ్వనాథ:** ఆశ్చర్యం లేదు. కాని, ప్రధానంగా పసిరిక కృషికి చిహ్నం. అది అచ్చమైన పంచభూతములు బహిఃప్రకృతి మీద ఆధారపడివుంది.

**మధుర:** అంటే?

**విశ్వనాథ:** వానకు నానాలి. గాలి వీచాలి. ఎండలు కాయాలి. పంటలు పండాలి. పాములూ, పిట్టలూ యథేచ్ఛగా సంచరించాలి. ఇది వ్యవసాయం యొక్క స్వరూపం. ఇదంతా ఒక మనుష్యుని ఆకారంగా చేసి వాణ్ని పసిరిక అన్నాం. ఇంతే భేదం.

**మధుర:** మరి వాణ్ని పాములెందుకు కరిచాయి పాపం.

**విశ్వనాథ:** విను చెప్తా. వ్యవసాయం రెండు రకాలు. పొలం వాన ఆధారంతో పండితే దాన్ని దేవమాతృక అంటారు. ఆనకట్టలు కట్టి కాల్వలు తవ్వి పండిస్తే వాటిని అదేవమాతృకలంటారు. పల్లపుటూళ్ళ పంటలు వాళ్ళు బోలెడంత విశ్రాంతి కల వాళ్ళు. తేలికగా పండుతూ వుంటే బోలెడంత విశ్రాంతి. ఎవరికి విశ్రాంతి వుంటే ధర్మాన్ని వాళ్ళు పాడుచేస్తారు.

**మధుర:** చిత్రం చిత్రం, మహాచిత్రంగా వున్నాయి మీ మాటలు.

**విశ్వనాథ:** మూడు వందల అరవై రోజులు పొలంలో పాటుపడవలసిన వారు రాజకీయ, మత, సాంఘికాభి ప్రాయాల మీదకు దండెత్తేందుకు పాపం వారికి విశ్రాంతి యేది?

**మధుర:** కష్టపడేవాడ్ని నిద్రలేపడం ప్రమాదం అంటారు.

**విశ్వనాథ:** అంతే. అటువంటప్పుడు ధర్మం అజ్ఞులచేత పాలింపబడవలసి వస్తుంది. అందుకనే పసిరిక గ్రామాధికారి చేతినున్న గడియారం, పౌంటెన్ పెన్, చొక్కా మొదలైనవి పెట్టుకొని వెళ్ళేసరికి పాములతణ్ణి కరచినవి.

**మధుర:** పాపం....

**విశ్వనాథ:** ఈ రెండు నాగరికతలు అంత భిన్నములు. రెండూ రెండుగా రక్షింపబడితేనే ధర్మం రక్షింపబడుతుంది.

**మధుర:** నిజమే – మన మతం కూడా క్షీణదశకు రాలేదా?

**విశ్వనాథ:** అన్ని సిద్ధాంతాలు మొట్టమొదట మంచివే. మనుష్యుల కామక్రోధాదుల చేత కాలము మీద వాటి లక్షణాలు చెడతవి. ఎంత కొత్త సిద్ధాంతమైనా అంతే. ప్రజాస్వామికము మంచిదే. ఆచరణలో యెంత దోష భూయిష్టంగా వుంది? అట్లాగే హిందూ ధర్మమున్నూ.

**మధుర:** దీనికంతా కారణం ఎవరు?

**విశ్వనాథ:** మనిషే. వాడికి అధికార వాంఛ, స్వార్థం పుట్టుకతో వున్నాయి. వాడు సర్వధర్మాన్నీ నాశనం చేస్తాడు.

**మధుర:** తరువాత?

**విశ్వనాథ:** స్వార్థపరుల చేత యీ రీతిగా నాశనం చేయబడ్డ ధర్మాన్ని మరికొందరు స్వార్థపరులు అసలా ధర్మం యొక్క మూల స్వరూపమే చెడ్డది అని చెప్పి, తమ స్వార్థానికి ఉపయోగపడే అధర్మాన్ని ధర్మంగా ప్రతిష్ఠిస్తారు.

**మధుర:** ఇదంతా కావాలనే చేస్తారంటారా?

**విశ్వనాథ:** నెహ్రూ గారి డెమాక్రసీ, సెక్యులరిజం, మైనారిటీకి, మెజారిటీకే లేని హక్కులూ అల్లాటివే.

**మధుర:** మీరెప్పుడూ ఇంగ్లీషు మందులు పుచ్చుకోలేదా?

**విశ్వనాథ:** ఎన్నో కష్టసమయాలనూ ఆపద్దశలనూ పోతన గారి భాగవతంలోని షష్ఠమస్కంధంలోని నారాయణ కవచం పారాయణతో పోగొట్టుకున్నాను.

**మధుర:** ఏవన్నా ఎక్సర్ సైజు చేసే వారా?

**విశ్వనాథ:** వ్యాయామం, యోగాభ్యాసం, నిత్యం చేసే వాడ్ని. వ్యాయామం పెద్దయ్యాక మానేసినా, యోగాభ్యాసం తప్పనిసరిగా కొనసంటా వుండేది.

**మధుర:** కాఫీ పుచ్చుకుంటారా?

**విశ్వనాథ:** కొంచెం పంచదార ఎక్కువ వెయ్యి.

**మధుర:** అన్నట్లు ముక్కామల నాగభూషణం గారు రష్యా వెళ్ళార్ట. అక్కడ మాస్కోలోని తెలుగు అకాడమీ అధ్యక్షురాలు స్వెత్లానా వేయి పడగలని మెచ్చుకోవడమే కాకుండా కిన్నెరసాని పాటల్ని పుత్తడి బొమ్మ పూర్ణమ్మతో పోల్చి మాట్లాడిందట.

**విశ్వనాథ:** ఇంకేముంది? యితగాడికి మతిపోయి వుండాలి.

**మధుర:** సాహిత్యేతరమైన ప్రెజుడిస్సులు యిలాగే ఉంటాయి. స్వెత్లేనాకి అవేవి ఉండవు గదా! వేయి పడగలు ఫ్యూడల్ సిద్ధాంతాన్ని శ్లాఘించి ప్రగతిని నిరోధిస్తోందని ఆయన బాధ ఐ వుంటుంది.

**విశ్వనాథ:** ప్రగతినీ తిరోగతినీ సారస్వతం సాధిస్తుందను కోవడం సమంజసం కాదు.

**మధుర:** మీకు సంగీతం వచ్చా?

**విశ్వనాథ:** నేను అన్ని రాగాలు పాడుతాను (నవ్వి) పేర్లు తెలియవు.

**మధుర:** నవలలు మీరు వ్రాయరట గదా!

**విశ్వనాథ:** నేను చెబితే మా వెంకటేశ్వరులు వ్రాశాడు. వేయి పడగలు పూర్తిగా నెలరోజులు పట్టలా – వీరవల్లడు, జేబు దొంగలు, కడిమి చెట్టు, బద్దన్న సేనాని మా శిష్యుడు చతుర్వేదుల నరసింహం రాశాడు. ఇంకా ఎందరో రాశారు. నా నవలలు.

**మధుర:** ఇన్ని రాసారు కాని మీ జీవిత చరిత్ర వ్రాయలేదేమీ?

**విశ్వనాథ:** నా కవిత్వం అంతా నా జీవితంలోని అనుభవాలమయం. లోకవ్యక్తిని కావ్యవ్యక్తినయ్యాను. రామాయణంలో దశరథుణ్ని బంధుజ్యేష్ఠుడన్నాను. వేయి పడగలలో రామేశ్వరశాస్త్రిని బంధుజ్యేష్ఠుడన్నాను. ఎవరి గురించి? మా నాయనగారు శోభనాద్రి గురించి. నీ చుట్టూ వున్న లోకంలో నీకు చెందని భాగం ఏం వుంటుంది?

**మధుర:** ఇందులో వెదుక్కోవాలి. స్పష్టంగా రాయవచ్చు కదా.

**విశ్వనాథ:** భలే దానివే! నీక్కూడా యీ పిచ్చి పట్టిందా? నా గ్రంథాలన్నీ చదివిన వాడికి నా జీవితమూ తెలుస్తుంది. ఇక నా పుట్టిన తేదీ, చచ్చిన తేదీ మధ్య తేదీలలో నేను బ్రతకలేక చచ్చినవీ, చావలేక బ్రతికినవీ అయిన ఘట్టాలే కదా చరిత్రగా వ్రాయాలంటే. అలాంటిది వ్రాయటమంటే నాకు తలకాయనొప్పి.

**మధుర:** ఎంతో కొంత రాశారట గదా.

**విశ్వనాథ:** నేను అనే వాణ్ణి ఈ శరీరం కాదు గదా! ఆ నమ్మకం నాకు గట్టిగా ఉంది. ఆ 'నేను' అనే వాణ్ణి నా పుస్తకాల నిండా నింపా. నా శరీరం తీసికెళ్ళి కృష్ణ ఒడ్డున తగలేస్తారు. నా పుస్తకాలను తగలేస్తే ఆ 'నేను' అనే వాణ్ణి కూడా తగలేసినట్లవుతుంది. నేను తగలేస్తే తగల బడేవాణ్ణి కాను. పాతి పెట్టితే పాతి పెట్టబడే వాణ్ణి కాను.

**మధుర:** అబ్బ! ఎంత మృదువుగా వుంది మీ ధోరణి!

**విశ్వనాథ:** అది అంతే. ఎవరైనా ప్రసాదంగా కొబ్బరి చిప్పపెడితే వెంటనే నోట్లో వేసుకునే వాడిని కాదు.

**మధుర:** ఏం చేసే వారు?

**విశ్వనాథ:** ఏదో కొట్లో కాస్త ఉప్పుగల్లు తీసుకునే వాడ్ని. కూరల మార్కెట్టుకి పోయే దాకా ఆ ఉప్పుగల్లూ కొబ్బరిముక్కా చేతిలో వుండేవి. పచ్చిమిరపకాయలు కనపడగానే యీ కొబ్బరి ముక్కకూ ఉప్పుగల్లుకీ రుచులు కల్పించే వాడిని నోట్లో.

**మధుర:** బాగానే వుంది సరసం.

**విశ్వనాథ:** సరసం కాదు. అదే క్షణాలలో భగద్విషయికమైన రామాయణ భావనతో ఒక యిరవై పద్యాలు మనసులో అల్లుకునే వాడ్ని.

**మధుర:** ఆశ్చర్యం! ఇరవై పద్యాలే

**విశ్వనాథ:** ఇంటికి రాగానే వాటిని కాగితం మీద పెట్టేవాడ్ని

**మధుర:** అందుకే మిమ్మల్ని 'తెలుగువాళ్ళ గోల్డు నిబ్బు, కొండవీటి పొగమబ్బు' అని అన్నాడు శ్రీశ్రీ.

**విశ్వనాథ:** నీకు వాడు ఫ్రండా?

**మధుర:** మీలాగే–

**విశ్వనాథ:** ఇంకా ఏవన్నా డేం?

**మధుర:** నాకు కులం అనీ, మతం అనీ పట్టింపు లేవీ లేకపోయినా ఈ నాడు మరో కవి కుల గురువు మాయమయినాడని వాపోతున్నాను...

> **'మాటలాడే వెన్నెముక**
> **పాటపాడే సుషుమ్న**
> **నిన్నటి నన్నయభట్టు**
> **ఈనాటి కవిసమ్రాట్టు**
> **గోదావరి పలుకరింత**
> **కృష్ణానది పులకరింత**
> **కొండవీటి పొగమబ్బు!...'** అన్నాడు శ్రీశ్రీ.

**విశ్వనాథ:** నయం! ఇంకా నేను వాడికంటె తర్వాత పోయుంటే చచ్చేవాడ్ని.

* * * * * *

సత్యనారాయణగారు లీలామహల్‌కు వెళ్ళి 'టెన్ కమాండ్ మెంట్సు' ఇంగ్లీషు సినిమా చూసివస్తున్నారు. దారిలో విజయ టాకీస్ వద్ద ఒక మేదర స్త్రీ నులక మంచాలు అమ్ముతోంది. సత్యనారాయణగారు ఆగి రిక్షాదిగి 'ఎంత' అని ఆ మంచం బేరం చేశారు. ధర చెప్పింది. 'ఆగుతుందా' అని మళ్ళీ అడిగారు. ఆ వనిత 'చూసుకోండి అంది'. 'ఎందరెక్కినా ఆగుతుందా' అని అడిగారు. తలవూపింది. 'నువ్వూ నేనూ ఎక్కితే ఆగుతుందా' అని మళ్ళీ అడిగారు. ఆ మేదర వనితకి కవిసమ్రాట్ తెలియదు. ఏవో సహజమైన బండబూతులు

తిట్టింది. సత్యనారాయణగారు నవ్వుకుంటూ రిక్షా ఎక్కి పోనియ్ అన్నారు.

**మధుర:** ఇదేమి అలవాటు? అదేవిటి సిగరెట్ కాలుస్తున్నారు కవి సమ్–రాట్...

**విశ్వనాథ:** రోజూ ఏదో ఒక చిలిపి పనిచేసి ఎవరిచేతనైనా చివాట్లు తినకపోతే నాకు నిద్రపట్టదు. ఇంగ్లీషు సినిమాలు చూడటానికి వెళ్ళినప్పుడు రాములు కొట్లో రెండు మూడు కారా కిళ్ళీలు, అప్పుడప్పుడు సరదాకి సిగరెట్ వూదాల్సిందే?

**మధుర:** గిరీశం చుట్ట కాలిస్తే మీరు సిగరెట్. అన్నట్లు మీరెప్పుడైనా కన్యాశుల్కంలో వేషం వేశారా?

**విశ్వనాథ:** ఒకప్పుడు 1932 – 36లలో విశ్వనాథ సత్యనారాయణ అనే నిరుద్యోగి వుండేవాడు. గుంటూరులోనూ విజయవాడలోనూ దొరికినపుడు ఉద్యోగాలు చేస్తూ వుండే వాడిని. ఆ రోజుల్లో రామప్పంతులు వేసే వాడ్ని.

**మధుర:** మీనాక్షి ఎవరు?

**విశ్వనాథ:** ఎర్రోజు మాధవాచార్యులు.

**మధుర:** మా గురువుగారు గురజాడ గురించి మీ అభిప్రాయం?

**విశ్వనాథ:** Gurujada was a genius. He produced a very great drama that caught the imagination of the English educated youth of his times and it came to stay.

**మధుర:** మీ కంటె గిరీశంగారు బెటర్. ఆయన ఇంగ్లీషు మాట్లాడుతూంటే దొరలు మాట్లాడుతున్నట్లుంటుంది. ఇంతకీ ఏవంటారు?

**విశ్వనాథ:** కన్యాశుల్కం నాటకం కాదని నాటకమంటే తెలిసిన వాడు ఎవడైనా అంటాడు.

**మధుర:** చిత్రం మహా విచిత్రం అన్నట్లు వుంటాయి మీ మాటలు. కన్యాశుల్కంలో వేషం వేశారు. కన్యాశుల్కం నాటకం కాదంటున్నారు మళ్ళీ.

**విశ్వనాథ:** కాని, యీ కాలానికి అప్పారావు పంతులు గారు వ్రాసిన కన్యాశుల్కం పనికి వస్తున్నది. నిజానికి పనికిరావడం లేదు కూడాను. ఎందుచేతనంటే ఆ పుస్తకంలో విమర్శింపబడ్డ సాంఘిక పరిస్థితులు ఇవాళ కొత్తగా లేవు. బాగా పాతబడి పోయినవి.

**మధుర:** గురజాడ మహాకవి కాదంటారు?

**విశ్వనాథ:** అదోటా? కవే కాదంటూ వుంటే. ఆయనకు ఉన్న శక్తి హాస్యరసం. రెండవది బ్రాహ్మణ సంఘంలో ఉన్న ఎందుకూ పనికిరాని వాళ్ళ గురించి వెక్కిరించటం.

**మధుర:** Sri Gurajada Appa Rao heralded a new era in Telugu Literature. The era of Colloquialism అన్నారు ఒకప్పుడు. ఇంగ్లీషులో ఒకలా తెలుగులో ఒకలా ఉన్నాయేవిటి మీ అభిప్రాయాలు?

**విశ్వనాథ:** నన్ను నెఱుగరో యీ తెల్గునాట మీరు
విశ్వనాథ కులాంబోధి విధుని, బహు వి
చిత్ర చిత్ర ధ్వని బహు విచ్ఛిత్తి మన్మ
హా కృతి ప్రణీత సత్యనారాయణ కవి.

**మధుర:** మీరు వేయిపడగలు తెలుగులో వ్రాసి వుంటే బాగుండేది?

**విశ్వనాథ:** అంటే?

**మధుర:** వ్యవహారిక భాషలో వ్రాయకుండా మీ కోసం మీరు పెంకెతనానికి సృష్టించుకున్న శైలిలో వ్రాశారేమి?

**విశ్వనాథ:** ఇప్పుడు నాగ్రాంథిక శైలితో నీకేమి పేచీ వచ్చింది? ఆ రోజులలో ఆంధ్రదేశంలో పురుషుల కంటె స్త్రీలు ఎక్కువ చదివేవారు వేయిపడగలు. అది తెలుసా?

**మధుర:** మీరు చెప్పిన చక్కని భావాలు కూడా మీరు ఉపయోగించిన భాష పాతదనం వలన మంచివి కూడా పనికి రానివనుకున్నారు జనం.

**విశ్వనాథ:** ఇదేదో పులిమీద పుట్రలా కొత్తగా వింటున్నాను. చెప్పు.

**మధుర:** వృక్షసంపదను నేలకూల్చితే వర్షాలు పడవనే విషయాన్ని పృషన్నిధి–ఆదిపటముల కథ ద్వారా చెప్పారు. ఇప్పుడు వాతావరణ, సమతుల్యం, చెట్లు నాటండి అంటూ వన మహోత్సవాలు జరుపుతున్నారు ప్రభుత్వాలు. ఈ మంచి విషయం యాభై ఏళ్ళ క్రితమే మీరు చెప్పారు. ప్రజల భాషలో చెప్పక పోవడం వలన.

**విశ్వనాథ:** ప్రజల భాషలో చెప్పక పోవడం వలన.

**మధుర:** విశ్వనాథ చాదస్త కల్పనగా కొట్టివేశారు. శ్రీశ్రీగారు మీరు వ్రాసిన గొడ్డు తెలుగులో రాస్తే విప్లవ కవిత్వం ఎవరూ చదివేవారు కాదు. మీరు సనాతనవాదులు కనుక అంతా ప్రగతికి వ్యతిరేకం అని తిరస్కరించి వుండవచ్చు.

**విశ్వనాథ:** వినాశనానికి కారణాలయ్యే ఆధునిక మార్పులను

విమర్శిస్తే అసలు ఆధునికతనే విమర్శించాననుకున్నారు నా శత్రువులు.

**మధుర:** మీకు వచ్చిన కీర్తి అంతా మీ శత్రువుల వల్లే వచ్చింది. పాత కొత్తల మేలుకలయిక కాలేకపోయారు మీరు.

**విశ్వనాథ:** సనాతన విలువలు ఆధారంగా జాతినిర్మాణం జరగాలి అన్నాను. అది భారతీయ పునరుజ్జీవ వాణ్ణి కనుక.

**మధుర:** జమీందారీ వ్యవస్థ సనాతన మెలాగయింది. గణాచారి పునరుద్ధరింపబడాలా?

**విశ్వనాథ:** అది సాంకేతికము. నీకెట్టుల తెలియును?

**మధుర:** సాంకేతిక కాదు, వల్లకాదు కాదు, ఈ గణాచారులు రేణుకలు చేతబడులతో తెలంగాణా అంతా అధ్వాన్న మయిపోయింది. మూఢవిశ్వాసాలు ప్రబలిపోయి ప్రజలు హిస్టీరియా లోపడి కొట్టు కొంటున్నారు. అదంతా బలవంతపు వ్యభిచారంగా మారింది.

**విశ్వనాథ:** ఆచరణలో అన్నీ భ్రష్టమవుతాయి. దానికి నేనా బాధ్యుడ్ని.

**మధుర:** నాటి మంచికి వస్తున్న మార్పులకి సమన్వయం చేయలేక పోయారు మీరు. మార్పులని వ్యతిరేకించటమే దేశభక్తిగా పెట్టుకొన్నారు చాదస్తంగా.

**విశ్వనాథ:** సమన్వయం మనల్ని అడగకుండానే జరుగుతుంది దానమ్మ కడుపు కాల. చెట్టూ చేమా యిదంతా మహా చైతన్య స్వరూపం. ఇది వైదిక భావన. ఆంగ్లేయులతో పోరాటం సాంస్కృతిక రంగంలో ప్రారంభించింది నేను. ఆందుచేత ప్రతి మార్పు అవశ్యం వ్యతిరేకించాల్సింది గానే వుంది.

**మధుర:** మీరు ఆనంద గజపతి కాలంలో వుండి వుండవలసింది. ఆ మహారాజు కొలువులో వుంటే –

**విశ్వనాథ:** వుంటే–అది ఆంగిలేయుల ధర్మరాజ్యము అన్నాడుగా మీ గురుజాడ. నేనింగ్లీషు వాళ్ళని వ్యతిరేకించాను. అతను వాళ్ళని సమర్థించాడు. మీ రాజుగారి కొలువులో నేనెందుకుండాలి?

**మధుర:** ఎందుకంటే మా గురువు గారిని అప్పుడు వాళ్ళు కూడా కవిగా గుర్తించలేదు కనుక. మిమ్మల్నయితే స్పష్టంగా గుర్తించగలిగే వారు. మా మహారాజు గారంటే మాక్సు ముల్లర్ ఋగ్వేదం ప్రచురణకు ఆ రోజుల్లో లక్ష రూపాయలిచ్చిన మహాదాత.

**విశ్వనాథ:** మాక్సుముల్లర్ గుర్తించబట్టి మన వేదాల పారమ్యం అంగీకరించబడుతోందన్న మాట. దీన్ని నేను వ్యతిరేకించాను. హెర్బర్ట్ రీడ్ 'నోదైసెల్ఫ్' అన్నాడంటే ఆహ్హా అతి ప్రాచీన సూత్రం చెప్పాడన్నారు. మన భగవాన్ రమణమహర్షి 'నిన్ను నీవు తెలుసుకో' అన్నాడంటే ఎవ్వరికీ పట్టలేదు. అదీ మన దురవస్థ.

**మధుర:** వేణుగోపాలస్వామి గిరికకీ ఆముదం దీపము చాలు. విద్యుద్దీపం బయటి వెలుగుకి ఆధునిక సంకేతం. మానవుడు ప్రాచీనమైన వెలుగును కోల్పోయి విద్యుత్తే వెలుగనుకుని పిచ్చివాడైనాడు అని రాశారు. ఏవిటీ అసందర్భపు రాతలు?

**విశ్వనాథ:** అదంతా సాంకేతికమైన గొడవ నీకెందుకు చెప్పు? నీ కళ్ళకు పరమఛాందస బ్రాహ్మణ ముండాకొడుకులా కనిపిస్తే కనిపించవచ్చు. కాని బ్రాహ్మీమయ మూర్తిని. నన్నయ్య తరువాత నా అంతవాడు పుట్టలేదు. మళ్ళీ నా అంతవాడు యీ గడ్డమీద జన్మించడానికి ఎంతకాలం పడుతుందో?

**మధుర:** ఏమీ అహంకారం?

**విశ్వనాథ:** నీకు తెలియదు పిల్లా! అహంకారం లేకపోతే అణచివేస్తారు పాతాళానికి. భారతదేశ నాగరికత గ్రీసు దేశ నాగరికతకు అనుకరణ అనే వాదం ఇంగ్లీషు వాళ్ళు తెలివిగా లేవదీశారు. ఇది చాలా అసత్యవాదం. గ్రీసు నాగరికతలో భారతీయ నాగరికత ప్రభావం వుంది. మనుస్మృతి ప్రభావం, ఈజిప్ట్, క్రెటి, సుమేరియా, ఇరాన్, బాబిలోన్, రోమ్ మొదలైన అన్ని దేశాలమీద వుంది. ఇవన్నీ నేను వేయిపడగలు రాయడానికి ఆవిర్భావ హేతువులు.

**మధుర:** మీకూ రంగనాయకమ్మకూ ఏమిటి గొడవ?

**విశ్వనాథ:** ఆవిడకు తగని బ్రాహ్మణ ద్వేషం. రామాయణ విషవృక్షమని రాసింది. కమ్యూనిస్టులంతా తెగపొగిడారామెను. శ్రీశ్రీ కొడవగంటి కుటుంబరావులు ఎత్తేశారామెను. రామాయణం యిలా కాదు జరిగింది అని ఆమె పరపరా పుస్తకాలు రాసేసింది. తగిలించి తమాషా చూసే వాళ్ళెప్పుడూ వుంటారు కదా!

**మధుర:** మీరామెకు సమాధానం రాశారా?

**విశ్వనాథ:** సమాధానం కాదు గాని ఓ నవల రాశాను జయశ్రీ అనే మాసపత్రికలో ఇదే నా ఆఖరి నవల. అచ్చు కాలేదు.

**మధుర:** మీకూ కుటుంబరావుగారికీ పడదా?

**విశ్వనాథ:** అబ్బే, అలాంటి దేమీ లేదు. పైగా నేను చందమామకు అభిమాన పాఠకుడ్ని. రాగానే కొని చదవకపోతే

నాకు నిద్ర పట్టేదికాదు. నేను నానా చెత్త చదువుతాను. అద్దెకు తెచ్చి ఎన్ని ఇంగ్లీషు నవల్లు చదివే వాడినో...

**మధుర:** బెజవాడ కాలేజీలో పనిచేసినపుడు మీ జీతం ఎంత?

**విశ్వనాథ:** ఎంతా? నూట యాభై. ఆ రోజుల్లో అంతే శాలరీ. మా యింట్లో ఏడాదికి పదిహేను తద్దినాలు వచ్చేవి సుమారుగా. ప్రతి తద్దినం పెట్టాల్సిందే విధాయకంగా. తద్దినానికి పదిహేను రూపాయలయ్యేది. అయినా రోజులు వెళ్ళిపోయాయి.

**మధుర:** అడివి బాపిరాజు గారు మీకు తెలుసా?

**విశ్వనాథ:** తెలుసా? వాడు మా బాపి బావ. కిన్నెరసానికి బొమ్మలు వేసింది వాడే. వీధిలో కనపడ్డ వాళ్ళందరినీ భోజనానికి పిలిచేవాడు దర్జాగా. ఇంట్లో చెప్పేవాడు కాదు అతిథుల్ని తీసుకుని భోజనానికి తయారయే వాడు. అప్పుడుండేది వాడి పెళ్ళాం అవస్థ. ఇంట్లో చెప్పకుండా మమ్మల్ని అందరినీ ఓ యిరవై మందిని పిల్చేశాడు ఓసారి. అప్పుడు అన్నగారూ అంటూ నన్ను పిల్చి ఆవిడ యిబ్బంది చెప్పుకుంది. నేను చూస్తాలే నువ్వు కానీయ్ అన్నా.

**మధుర:** ఏం చేశారు?

**విశ్వనాథ:** నా రామాయణ కల్పవృక్షంలో కైకేయి వృత్తాంతం చదువుతూ వ్యాఖ్యానిస్తూ సర్వం మరిపించా.

**మధుర:** ఇంతలో ఆవిడ వంటా పూర్తయి వుంటుంది. రామాయణం మీరు ఒకందుకు రాస్తే అది మరొకందుకు పనికివచ్చింది. అవునూ, మిమ్మల్ని కవిసామ్రాట్ అని ఎవరన్నారు మొట్ట మొదట?

**విశ్వనాథ:** శ్రీ భావరాజు నరసింహారావు గారి ఆధ్వర్యంలో బందరు సారస్వత మండలి వారు. మా గురువు గారు నా గురించేమన్నారో నీకు తెలుసా? విను.

**నా మార్గంబును గాదు వీనిదరయన్ నాతాత ముత్తాతలం**
**దేమార్గంబును గాదు మార్గమెదియో యింకొక్కడట్లొటచే**
**సామాన్యుండనరాదు వీని; కవితా సమ్రాట్వు మా హేతువై**
**యీ మచ్ఛిష్యుని దావరించినది నేనెంతో ముదంబందగన్**

**మధుర:** జాషువా గార్ని గూర్చి మీరేమంటారు?

**విశ్వనాథ:** ఏమంటాను. జాషువా వలె తెలుగు నుడికారంతో రచన చేయటం నాకు కూడా సాధ్యం కాదు. నిజమే.

**మధుర:** శ్రీశ్రీ గురించి ఏవంటారు?

**విశ్వనాథ:** ఈ నాడు మహాకవి అని చెప్పదగిన వాడు యీయనే. వీడమ్మ కడుపు మాడ ఏమీరాశాడు 'కవితా ఓ కవితా' అంటూ. వాడి కమ్యూనిజం నాకు గిట్టదనుకో. (ఇంతలో ఎవరో వచ్చి తిరపతి ప్రసాదం అని లడ్డూ చేతిలో పెట్టి పోతారు నమస్కరించి)

**మధుర:** నాకు పెట్టకుండా అంతా మీరే తినేస్తున్నారే?

**విశ్వనాథ:** తినేశానే – ఏం చెయ్యను. వీడమ్మ కడుపు మాడ వీడు వూరంతా అప్పులు చేస్తాడు. నా దగ్గర కూడా – వుంటే లేదనను. ఏడాదికి రెండు మూడు సార్లు తిరుపతి పోయొస్తాడు. అక్కడే ముంది? వీడి బొంద – వూళ్ళో అందర్నీ వీడు గొరుగుతాడు. వీడ్ని తిరపతిలో వాడు గొరుగుతాడు.

**మధుర:** మీకు తిరుపతి వేంకటేశ్వరస్వామి అంటే పడదా?

**విశ్వనాథ:** చంపావ్ ఫో. అస్తమానం బుడుంగు బుడుంగున అప్పులు చేసి వూళ్ళో వాళ్ళని ముంచి తిరుపతి వెళ్ళకపోతే నేం? వుండు (వెళ్ళి వాళ్ళని అడిగి మరో లడ్డుతెచ్చి మధురవాణి కిస్తాడు) తిను. నాకు మొదట్నుంచీ తీపి సరుకు యిష్టం లేదు. కారపు వస్తువులంటే పడిచస్తా – నా జీవితంలో ట్రాజిడీ ఏవిటో తెలుసా?

**మధుర:** చెప్పండి

**విశ్వనాథ:** బందరులో రెండు తినుబండారములు కలవు. ఆంధ్రదేశములో మహా ప్రసిద్ధి పొందినవి. ఒకటి బందరు తొక్కుడు లడ్డు. దీనిని ఢిల్లీలో లక్నోలో రావల్పిండిలో నున్న యాంధ్రులు కూడా తెప్పించుకు తిందురు. దీని నెరిగిన వారు అమెరికా కాని, లండను కాని వెళ్ళినచో కొని తీసికొని పోదురు. అయినను దానిమీద నాకంత యిష్టము లేదు. నాకు కారపు వస్తువలు మీద నిష్టము. ఆ రెండవ వస్తువు కారపు వస్తువు. అందులో కారముండదు. కారమును నంజుకొని తినవలయును. దాని పేరు పునుకులు. పెసరపునుకులు. వాని రుచి చెప్పుటకు వీలులేదు. అందులో పచ్చిమిరపకాయల కారము నంజుకొని తిన్నచో స్వర్గానికి బెత్తెడెడము కాదు. స్వర్గానికి పైన బెత్తెడు.

**మధుర:** చెప్పకండి... నే.. నాగలేను.

**విశ్వనాథ:** పొద్దుటి పూట యివి తినని వాడు బందరులో అణాకు గతిలేని వాడు. అణా చెల్లగా అణా. నీవు పావలా

పునుకులు తిన్నచో కనీసము వారము దినములు నీకాకలి కాదు. పునుకులు తినుట ఆకలి కొరకు కాదు వట్టి రుచి కొరకు.

**మధుర:** ఇప్పుడు వెళ్దామా?

**విశ్వనాథ:** ముట్నూరి కృష్ణారావుగారంతటి ఎడిటర్ చాటుగా వానిని తెప్పించుకొని తినుట నేనేరుగుదును. నేను రెండేండ్లు అవి తిని నా ఆరోగ్యం పాడు చేసుకొన్నాను. ఇంతకీ ట్రాజిడీ ఏవిటంటే – నా దగ్గర డబ్బు లేనప్పుడు నాకు చచ్చేటంత ఆకలి. దరిద్రుడికి ఆకలెక్కువ అన్నట్లు. ఇప్పుడు డబ్బులికి తడుము కోనక్కర్లేదంటే జీర్ణశక్తి లేదు. తినలేను. అరాయించుకోలేను. నాకు మొదట్నుంచీ అవీ యివీ చిరుతిళ్ళు తినడం మీద ధ్యాసెక్కువ. నాకున్నంత జిహ్వా చాపల్యం సృష్టిలో మరెవ్వరికీ వుండదేమో.

**మధుర:** మీకు బందరులో పెసర పునుకులు ఎల్లాగో మాకు విశాఖపట్నం, విజయనగరాల్లో పుల్లట్లు అల్లాగ. పుల్లట్లు తినే రావిశాస్త్రి 'రాజు–మహిషి' నవలా రచయితయ్యాడు.

**విశ్వనాథ:** ఆరు సారా కథలు వ్రాసి సాహిత్యమునకు సారా రుచి యంటించిన వాడా?

**మధుర:** అవును పులుసటుకులని మరొక భక్ష్య విశేషం వుంది. అది తింటేనే కన్యాశుల్కం రుచి తెలిసేది.

**విశ్వనాథ:** అప్పారావుకి పులుసటుకులిష్టమా?

**మధుర:** కాదు కాదు. పులుసటుకులు వెంకటేశానికి. అప్పారావు పంతులుగారికి ద్రావిడుల యింట్లో కాల్చిన దిబ్బరొట్టె అంటే చాలా యిష్టం. చనిపోయే ముందు నారాయణదాసు గారింట్లో కాల్చిన దిబ్బరొట్టె తెప్పించుకుని తిన్నారు పంతులుగారు.

**విశ్వనాథ:** శ్రీశ్రీ కేమిష్టం?

**మధుర:** గరం గరం పొంగరాలు. రంగ రంగ పొంగరాలు. మీరు కిళ్ళీలు బాగా నములుతారా?

**విశ్వనాథ:** నాకు రాగము సత్యనారాయణ అని ఒక స్నేహితుడుండే వాడు. అప్పుడు క్లాసుకి మానిటర్ని నేను. చిన్న క్లాసులనించీ కూడా. తాను బడికి రాకపోయినా హాజరు వేయించుకోవచ్చును నాకు లంచం పెట్టి. కాపులు అనుకుంటా వారు. ధనవంతులు. ఒక యేడా రెండేండ్లా? నాలుగేండ్ల లంచము.

**మధుర:** ఏవిటీ?

**విశ్వనాథ:** సత్యనారాయణ నాకు తమలపాకు కిల్లీలు లంచం పెట్టేవాడు. తర్వాత నా భార్య నేను నాల్గవ ఫారం చదువుతుండంగా కాపురానికి వచ్చింది. తమలపాకులు కొనేవాడ్ని. తాంబూలం వాజీకరణం కదా!

**మధుర:** చదువుకునే రోజులలో మీ వేషం ఎలా వుండేది?

**విశ్వనాథ:** నీకు నవ్వు వస్తుంది. ఒక చొక్కా –చేతులకు మురుగులు – కాళ్ళకు కడియాలు, నెత్తిమీద జుట్టు బండి గూడు కత్తిరింపు, జుట్టు ముడి వెనుక గిరజాలు, ముందు సన్నని గిరజాలు. ఇది నా వేషము.

**మధుర:** కొంచెం యించు మించుగా పాండురంగ మహత్మ్యంలోని నిగమశర్మ లా వుండే వారన్న మాట. (నవ్వు) మీకు చిన్నప్పుడు దయ్యాల భయం అదీ వుండేదా?

**విశ్వనాథ:** భూతములు మా యూరిలో నుండెడివి. ప్రయోగములు చేసెడి వారు కలరు. మా యింటి వెనుక రావిచెట్టు కలదు దానిమీద దయ్యము లుండెడివి. మా యింటి వెనుక నొక యిల్లున్నది. ఆ గృహస్తు ప్రయోగములు చేయుట యందు ప్రవీణుడని ప్రసిద్ధి. దానికి సాక్ష్యములున్నవి. నేను ప్రత్యక్షముగా చూచినవి. నాకనుభవములోనున్నవి.

**మధుర:** కన్యాల్కంలో మీరు రామప్పంతులు వేశారు కద. అసిరి గాడు పూజారి గవరయ్య అదంతా మీకనుభవమే. రామప్పంతులు క్కూడా దయ్యాలంటే భయం.

**విశ్వనాథ:** గిరీశం తరవాత నిన్ను చేరదీసింది ఎవరు? వాడే కదా! కన్యాశుల్కంలో నీకు ఎవరంటే ఎక్కువిష్టం?

**మధుర:** కరటకశాస్త్రి శిష్యుడు. ఎందుకంటే గొంతు మార్చి వాడు నన్నే మాయచేశాడు.

**విశ్వనాథ:** నాకు నువ్వంటే యిష్టం. నిండు మనమ్ము నవ్య నవనీత సమానము.

**మధుర:** ఆగండాగండి. మీ చిన్న కథల్లో మీరు చాలా మంచి పూలమొక్కల్నినాటారు. మీ రెక్కిన మెట్లు ఎవరూ అందుకోలేరు. ముఖ్యంగా మాక్సీ దుర్గంలో కుక్క, ఏమి సంబంధం. నీ ఋణం తీర్చుకున్నా చదివితే–

**విశ్వనాథ:** చదివితే...

**మధుర:** అస్తమానూ వేయిపడగల్ని మాత్రమే పొగిడే వారు

కళ్ళు తెరుచుకుంటారు. మీ నవలలన్నీ ఒక ఎత్తూ వాటి మీద మీ కథలు మరో ఎత్తూను.

**విశ్వనాథ:** ఐయామ్ బెటర్ దేన్ గురజాడ.

**మధుర:** సృష్టిలో పరిచయాలు ఎందుకు కలుగుతాయి? అవి ఏవిధంగా పర్యవసిస్తాయి? చివరికి ఏమవుతుంది?

**విశ్వనాథ:** తన జీవితంలో ఏమీ సంబంధం లేకపోయినా ఏ విధంగా తన మనసుతో ఆడుకొన్నదో చిత్రంగా వుంటుంది. సామాన్యంగా కొన్ని కథలు "ఏమి సంబంధం" లాటివి ఎవరు పడితే వారు వ్రాయలేరు. "జననాంతర సౌహృదాని" అన్నాడు కాళిదాసు.

**మధుర:** వేయి పడగలు చివరలో చాలా చిన్న పిల్లకు కథా నాయకుడితో పెళ్ళి జరిపించారేమి? అదీ సాంకేతిక విషయమేనా?

**విశ్వనాథ:** కొందరి బుద్ధిలో అది పెండ్లికానిచో, వయసు తారతమ్యము కింద గొప్ప చేయబడి వివాహమన్నచో తప్పుగా పరిగణింపబడుచున్నది. ఇది యాధునికుల నాగరికతా సంపత్తి.

**మధుర:** గురువుగారూ బద్దన్న సేనానిలో మీరు పంచములకు లేని వర్ణప్రతిష్టను యిచ్చి వాళ్ళకి బానిసత్వ వృత్తిని స్థాపించారంటున్నారు. అంటరాని తనాన్ని మహత్తర ఆదర్శంగా కీర్తించారంటున్నారు. పైగా ఆధునికులు చెప్పే సిద్ధాంతాన్ని పంచమకుల సిద్ధాంతంగా వికృతీకరించా రంటున్నారు. మీరేమంటారు?

**విశ్వనాథ:** ఆనాటి వ్యవస్థని యిప్పటి కళ్ళజోళ్ళతో చూస్తే అలాగే కనిపిస్తుంది. ఆ కాలంలో అంటరానితనం వుంది. దాన్ని బద్దన్న విశ్వసించి పాటిస్తానంటే మధ్యనన్నెందుకు తిట్టడం? ఎవరికేది వెతుక్కుంటే వారికది కనిపిస్తుంది. 12వ శతాబ్దపు ఆంధ్ర ప్రాంత రాజకీయాలు నీకు తెలుసా?

**మధుర:** భారతీయ సంప్రదాయాన్నీ సంస్కృతినీ గాక మనుధర్మాన్ని మాత్రమే మీరు సమర్థించడానికి రచనలు చేశారని విరసం వారంటున్నారు?

**విశ్వనాథ:** వారా? వారు తుపాకీ గొట్టంలోంచి మాత్రమే విప్లవం వస్తుందని నమ్మే చైనాభక్తులు. మావో మా ఛైర్మన్ అని గంతులేసే వాళ్ళు. వాళ్ళు దేశభక్తులే కారు. భారతీయ సంస్కృతి వారికి మ్రింగుడు పడదు. పాకిస్తాన్‌తోను తమిళ టైగర్లతోనూ స్నేహం చేసి ఆయుధాలు తెచ్చుకునే వీళ్ళా ఏది సంప్రదాయమో ఏది భారతీయ సంస్కృతో కాదో చెప్పేది? వింటే ఎవరైనా నవ్వుతారు!

**మధుర:** మీవి ఫాసిస్టు భావాలంటున్నారు. ది గ్రేటు విరసం కవులు?

**విశ్వనాథ:** పీరుసాయిబుకి గోకులాష్టమి ఎప్పుడంటే అర్థం కానట్లు యీ విప్లవ కమ్యూనిస్టులకు ప్రాచీన భారతీయ సంస్కృతీ మనుధర్మం ఎట్లా అర్థమవుతాయి.

**మధుర:** వారు ఏ రకంగా చెప్పినా అవి కాలం చెల్లినవి, ఈ నాటికి వర్తించవు అనే. మీరు ఫ్యూడల్ సాంఘిక సాంస్కృతిక శక్తుల్ని ఆదర్శీకరించి సాంప్రదాయక కుటుంబాలనించి వచ్చిన అనేకమంది యువపండిత కవుల్ని తప్పుడు తోవకి మళ్ళించారంటున్నారు?

**విశ్వనాథ:** పోనీ వాళ్ళని సరైన దారికి మళ్ళించమను. నేను వద్దనలేదే? మన సంస్కృతి చాలా బలమైనది. దాని పునాదులు ఎక్కడ వున్నాయి భారతీయ జీవనంలో? వాళ్ళంతా యిళ్ల దగ్గర ఫ్యూడల్ పద్ధతుల్నే అవలంబిస్తున్నారని రా.రా. అన్నాయన కమ్యూనిస్టుల్ని వేళాకోళం చేశాడు. అయినా ఆ తుపాకీ గొట్టం గాళ్ళతో మనకెందుకు పోనిస్తూ.

**మధుర:** నయా ఫ్యూడల్ విమర్శకులు బయల్దేరి విశ్వనాథ సాహిత్యాన్ని మళ్ళీ పైకెత్తి విరసాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారంటారు. అది నిజమా?

**విశ్వనాథ:** వాళ్ళను చూసి అంతా హడిలిపోతున్నారని సాహిత్య నక్సలైట్లు అలా ప్రచారం చేసుకుంటూ వుంటారు. పైగా రివిజనిజం మీద పోరాటం విస్మరించావంటున్నారు.

**మధుర:** మీరు బ్రాకెట్లాడే వారట గదా న్యూయార్క్ కాటన్, కర్లీ వీ కార్టూన్లు...

**విశ్వనాథ:** అవును జూదం ఒక వ్యసనం. ఓపెనింగూ క్లోజింగూ ఆ చార్టు అంతా నా దగ్గరుండేది. నేనేవిటి కథక చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కూడా ఆడేవాడు.

**మధుర:** మీకు విజయవాడలో శిలావిగ్రహం లేకపోవడం లోటే అనుకుంటాను.

**విశ్వనాథ:** నాకు విగ్రహాలెందుకు నా పుస్తకాలున్నాయిగా. అవి చదువుకుని మంచి చెడ్డలు తర్కించుకుంటారు. నా పుస్తకాలున్నన్నాళ్ళు నేనుంటాను.

**మధుర:** తెలుగుభాష వున్నంత కాలం మీరుంటారు. మీచేత తిట్టించుకోవడం ఓ సరదా. విశ్వనాథ తర్కం అని మీతో బాటు మీ తర్కం కూడా చిరంజీవి. మి

# గెలీలియో

ఆరోహణ-7

- ముక్తవరం పార్థసారథి

*అరబ్బులు అంకెలనైతే కనిపెట్టారుగాని, ఈ అంకెల విలువను నిర్ణయించే క్రమం దశాంశాలతో ప్రారంభమవుతుంది. ఇందుకు అవసరమైంది సున్నా (శూన్యం). జీరో, సైఫర్‌లు అరబ్బీపదాలే. (అల్‌జీబ్రా, అల్మనాక్, 'జెనిత్'లు కూడా అరబ్బీ భాషకు చెందినవే.) క్రీ.శ.750 ప్రాంతంలో ఇండియా నుండి అరబ్బులకు చేరింది దశాంశపద్ధతి. అయినా మరో అయిదు వందల సంవత్సరాల దాకా, యూరోప్‌లో దీనికి గుర్తింపు రాలేదు.*



జె. బ్రోనోస్కి

ఇస్లాం, మతమార్పిడులను ప్రోత్సహించినా, యితర మతాల జ్ఞానాన్ని మాత్రం నిరసించలేదు. పెర్షియాలోని ఇస్ఫాహన్, దక్షిణస్పెయిన్‌లోని అల్హాంబ్రా ఆనాటి విజ్ఞాన కేంద్రాలు. ముఖ్యంగా అల్హాంబ్రా అత్యంత సుందర నగరం వారి మతగ్రంథంలో వర్ణించిన స్వర్గం యిదేనేమోననిపిస్తుంది. అరబ్ నాగరికతా వైభవమంతా యిక్కడే దర్శనమిస్తుంది. అద్భుతమైన రాజప్రాసాదాలు, భవ్యహర్మ్యాలే ఈ నగరానికి కీర్తిపతాకలు. రాజుల విలాస జీవితానికి అవసరమైన హంగులన్నీ వున్నాయిక్కడ.

మానవాకృతిని చిత్రించటం ఇస్లాంలో నిషిద్ధం. శరీరశాస్త్ర (అనాటమీ) అధ్యయనాన్ని కూడా అంగీకరించదీ మతం. సైన్సు అభివృద్ధిలో వాళ్ల పాత్ర తక్కువగా వుండటానికి యిదే ముఖ్య కారణం. అరబ్బులకు అలంకరణలంటే మోజు. రేఖలతో, రంగులతో డిజైన్లు సృష్టించటం వాళ్ల ప్రత్యేకత. అయితే, దక్షిణ స్పెయిన్‌లోని సాంటిలానా గ్రామంలో ఎద్దు, గాడిద, మేకలాంటి జంతువుల చిత్రాలు కనిపిస్తాయి. ముస్లింలు ఆకారాలను ఆరాధించరని మనకు తెలుసు.

క్రీ.శ. 1000 ప్రాంతంలో, క్రైస్తవ మతం స్పెయిన్‌లో ప్రాచుర్యం పొందటమే దీనికి కారణం. ఈ కాలంలో, గణిత శాస్త్రాన్ని ప్రభావితం చేసిన ముఖ్యుడు అల్హాజెన్. (ALHAZEN) మనకళ్లలోని కాంతి వస్తువుల మీద ప్రసరించటం వల్ల అవి మనకు కనిపిస్తాయిని నమ్మారు గ్రీకులు. వస్తువుల మీద పడిన కాంతి మనకు చేరటం వల్లనే వాటిని మనం చూడగలుగుతున్నామని ప్రకటించాడు అల్హాజెన్. ఈలాగ రాసిన గ్రంథం 'ఆప్టిక్స్' ఇటాలియన్ అనువాదం వాటికన్ గ్రంథాలయంలో వుంది. దృశ్యాలను చిత్రించటానికి దృక్కోణం అవసరం. ఈ 'దృక్కోణం' రహస్యాన్ని తెలుసుకోవటానికి జర్మన్ కళాకారుడు ఆల్బ్రెక్ట్ డ్యూరర్ 1506లో ఇటలీకెళ్లాడు. దృశ్యంలో 'కదలిక'ను చూపించాలని అతని ప్రయత్నం. ఈ 'కదలిక'లోని నాటకీయక్షణాన్ని పట్టుకోవాలి. చిత్రకారునికి 'కదలిక' అంటే ఒక నిశ్చలమైన క్షణంకాదు. అది ఒక ప్రక్రియ. ఆకాశంలో గ్రహాలు, నక్షత్రాలు ఎప్పుడూ ఒకే స్థానంలో మనకు కనిపించవు. ఇది అధ్యయనం చెయ్యటానికి ఖగోళశాస్త్ర పరిజ్ఞానం అవసరం. వినువీథి చలనసూత్రాలు, గణితశాస్త్రం తెలిస్తే తప్ప అర్థం కావు.

గ్రీకులూ, అరబ్బులూ 'చలనం' గురించి విశ్లేషించలేదు. వాళ్ల దృష్టిలో సూర్యచంద్రులు వగైరా రూపాలన్నీ నిర్చలమే. ఇవన్నీ ఒక వృత్తాకారంలో వున్నాయని నమ్మారు. (టాలమీ సిద్ధాంతం కూడా ఈ విశ్వాసం మీదే ఆధారపడింది.) యూరోపియన్ పునర్వికాసకాలంలో, అంటే 1600 తర్వాత, జోహాన్స్ కెప్లర్, గ్రహాల చలనం అండాకారంలో (Eliptical) జరుగుతుందని ఆవిష్కరించాడు. అంటే, యిక నిశ్చల రూపాలకు అవసరమైన గణితశాస్త్రాల కాలం చెల్లింది. ఈ కొత్త గణిత శకానికి ఆద్యుడు ఐజాక్ న్యూటన్, గాట్‌ఫ్రీడ్

తెలుగు : ముక్తవరం పార్థసారథి, ఫోన్: 9177618708

విల్‌హెల్మ్ లీబ్నిజ్. ప్రకృతి స్వభావాన్ని విశ్లేషిస్తున్నప్పుడు, కాలం అందులో ఒక అంశమని మనం సహజంగా అంగీకరిస్తాం. కాని అది కేవలం యిటీవల ఏర్పడిన అవగాహనే. ఈ కాల స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి డిఫరెన్షల్ కాల్కులస్ అవసరమవుతుంది. న్యూటన్ దీన్ని FLUXIONS అన్నాడు. గణితశాస్త్రం, ఈ చర్చలో, మరింత సంక్లిష్టమవుతుంది. అంటే మన 'మానవారోహణ'లో యిది మరో మెట్టు. శాస్త్రాధ్యయనమంటే అనంతంగా మెట్లెక్కుతూ పోవడమే. ఇవన్నీ సాంకేతిక విషయాలు. ప్రస్తుతం మనకది చర్చనీయం కాదు.

* * *

మధ్యధరాతీర నాగరికతలో, అభివృద్ధి చెందిన ఆధునిక విజ్ఞానమంతా ఖగోళశాస్త్రానికి సంబంధించిందే. గణిత పరిభాషలో ఖగోళశాస్త్రాన్ని గురించి వివరించటం చాలా సులభం. (ఖగోళశాస్త్రమంటేనే అంకెలు.) నిజానికి, అన్ని నాగరికతల్లోనూ ఖగోళశాస్త్ర మూలాలను దర్శించవచ్చు. అదిమానవులు కూడా ఆకాశంలోని పరిణామాల నుంచి ఆలోచించారు. దీనికొక ముఖ్యకారణం-రుతువుల మార్పునకు, వాతావరణంలో (ఇవి ఖగోళ సంబంధమైనవి) వచ్చే మార్పులే కారణమని వాళ్లకు తెలుసు. నాట్లువెయ్యటం, పంటకోయటం, నూర్పిళ్ళు, పశువులమేతకు అనువైనకాలం వగైరా రుతువుల ఆధారంగానే నిర్ణయించారు. ఈ విషయంలో మాత్రం బాబిలోన్, ఈజిప్షుల ప్రాచీన వ్యవసాయ సాంప్రదాయానికీ, ఆధునిక వ్యవసాయ పద్ధతులకూ తేడాలేదు.

క్రీ.శ. 1000 నాటి మాయన్ నాగరికతే యిందుకో వుదాహరణ. అమెరికా నాగరికతల్లో యిది వుచ్ఛస్థితి. అప్పటికి లిపి ఏర్పడింది. ఇంజనీరింగ్ అభివృద్ధి చెందింది. కళారంగంలో గణనీయమైన కృషి జరిగింది. ఎత్తైన పిరమిడ్ల రూపంలో కట్టిన మాయన్ దేవాలయాల్లో ఖగోళశాస్త్రజ్ఞులు నివసించారు. క్రీ.శ.776 నాటి ఒక కుడ్యచిత్రంలో, 16మంది గణితశాస్త్రజ్ఞులు, ఒక ఖగోళ సదస్సుకోసం సమావేశమైన దృశ్యం కనిపిస్తుంది. ఆ కాలంలో, యూరోపియన్ గణితం కన్నా, నూతన గణితం ఎక్కువ అభివృద్ధి చెందిన దశలో వుంది. ఉదాహరణకు 'సున్నా' కోసం వాళ్లు ఒక గుర్తు ఏర్పాటు చేసుకున్నారు. నక్షత్ర చలనాన్ని వాళ్ళు ఖచ్చితంగా పసిగట్ట లేకపోయినా, కాలగమనాన్ని మాత్రం లోతుగా అధ్యయనం చేశారు. మాయన్ కావ్యాలలో, గాథల్లో కూడా ఈ విషయం గమనించవచ్చు. క్రీ.శ.776లో (మాయన్ నగరం) కోపాన్ లో జరిగిన సదస్సు వుద్దేశం మాయన్ కాలెండర్‌లో కొన్ని సవరణలు చేయటానికి వుద్దేశించిందే. అయితే, నక్షత్ర గమనం గురించి మాత్రమే తప్ప, వాటి నిర్మాణం అధ్యయనం చేయలేదు మాయన్లు.

ఖగోళాధ్యయనం, కేవలం కాలెండర్లకే కాదు, ప్రయాణీకులకు దారి చూపించటానికి కంపాస్ లాగకూడా వుపయోగ పడుతుంది. భూగోళ స్వరూపాన్నీ, సముద్రాల వైశాల్యాన్ని తెలుసుకోవాలన్నా, ఖగోళజ్ఞానం అవసరమే. కొత్త లోకాన్ని ఆవిష్కరించటానికి బయల్దేరిన కొలంబస్ కూడా తనకు తెలిసిన ఖగోళ సమాచారం మీదే ఆధారపడ్డాడు.

ఈస్టర్ ఐలండ్‌లో మనకో వింత కనిపిస్తుంది. ఒకే రూపంలో ఒకే సైజులోవున్న అనేక శిల్పాలున్నాయక్కడ. వీటిని చూడగానే అందరూ అడిగే ప్రశ్నలు-ఎందుకిలా చెక్కారు? ఇక్కడికెలా తీసుకొచ్చారు? కానీ ప్రధాన సమస్య యిదికాదు.

ఆకాశంకేసి చూస్తున్న బొమ్మలవి. డచ్ సాహసికులు, ఈ ద్వీపాల్ని 1722లో ఈస్టర్ ఆదివారంనాడు కనుగొన్నప్పుడు, ఇదే భూతలస్వర్గమన్నారు. అతి సమీపంగా వున్న పిట్‌కేర్న్ ద్వీపం కూడా దీన్నుండి వెయ్యిమైళ్ల దూరంలో వుంది. మరో ద్వీపసముదాయం 'యువాన్‌ఫెర్నాండెజ్' పదిహేనువందల మైళ్లదూరంలో వుంది. ప్రముఖ ఇంగ్లీష్ రచయిత డేనియల్ డీఫో రాసిన 'రాబిన్‌సన్ క్రూసో' పాత్రకు ఆధారమైన అలెగ్జాండర్ సెల్‌కర్క్ 1704లో యిక్కడే ఒంటరి జీవితం గడిపాడు. ఇంతింత దూరాలు ప్రయాణం చెయ్యాలంటే దారి చూపటానికి ఆకాశంలో ఏ నక్షత్రమైనా అవసరం. అందరూవేసే ప్రశ్న : అసలు, తొలి ప్రయాణీకులు యిక్కడికెలా చేరుకున్నారు అని? ఈస్టర్ ఐలండ్ గమ్యంగా ఎవరూ యాత్ర ప్రారంభించలేదు. వాళ్లక్కడికి చేరుకోవడం కేవలం యాదృచ్ఛికమే. అసలు ప్రశ్న: వాళ్ళక్కడి నుండి ఎందుకు తిరిగివెళ్లలేదు? దారి తెలియక పోవటమే (మహాసముద్రాల మీద, ఏ ఆధారం లేకుండా దారి తెలుసుకోవటం అసాధ్యం!) సాధారణంగా ధృవనక్షత్రం ప్రయాణీకులకు దారి చూపుతుంది. కాని అది భూమి ఉత్తరార్థంలోనే. (దక్షిణంలో ధృవతార కనిపించదు.) పక్షుల



వలసలకు కూడా యిదే ఆధారం. అందువల్లనే, వుత్తరాన జరిగినన్ని పక్షులవలసలు దక్షిణాన జరగవు. మళ్లీ ప్రశ్న మొదటికొస్తుంది. భూమధ్యరేఖకు వుత్తరాన వున్న దేశాలన్నింటిలో ఖగోళవిజ్ఞానం అభివృద్ధి చెందిందా? సెంట్రల్ అమెరికా, మెక్సికోలాంటి దేశాలలో ఆ ఆనవాళ్ళు కానరావు. దీనికొకటేకారణం ప్రాచీనులు ఎప్పుడో ఆవిష్కరించిన చక్రం గురించి వీళ్లకు తెలియదు. వలయాకారంలో నక్షత్రగమనమున్నదనే భావనే 1492లో కొలంబస్‌ను 1492లో ప్రయాణానికి ప్రేరేపించింది. అంటే నక్షత్రాల ఆధారంగా భూమి చుట్టూ తిరగొచ్చు!

ఇక నికొలస్ కాపర్నికస్ గురించి. ఈ పోలిష్ ఖగోళ శాస్త్రజ్ఞుడు 1473లో జన్మించాడు. ఇటలీలో న్యాయశాస్త్రం, వైద్యం అభ్యసించాడు. ప్రభుత్వానికి కరెన్సీసంస్కరణల గురించి సలహాలిచ్చాడు. కాలెండర్‌ను సంస్కరించమని పోప్ నుండి ఆహ్వానం అందుకున్నాడు. ఇరవయ్యేళ్ళు పరిశోధన చేసి, గ్రహ సముదాయానికి కేంద్రం భూమికాదు సూర్యుడని ప్రకటించాడు. సూర్యుడిచుట్టే గ్రహాలు పరిభ్రమిస్తున్నాయి. 1543లో, తన ప్రామాణిక గ్రంథం 'ది రివల్యూషన్ ఆఫ్ ది హెవెన్లీ ఆర్బ్స్' ప్రచురించి మరీ మరణించాడు. (రివల్యూషన్ అనే పదం పరిభ్రమణానికి సంబంధించిందే అయినా, అప్పుడూ, ఇప్పుడూ కూడా దాన్ని 'మరో' అర్థంలో వాడుతున్నారు. ఆనాటి మతఛాందసులకు ఆ పదం విపరీతార్థంలో ధ్వనించటం సహజమే) మరణశయ్య మీద, తుదిశ్వాస విడవటానికి కాసేపు ముందే పుస్తకం తొలిప్రతి ఆయన చూడగలిగాడట! పునర్వికాస (రెనాసాన్స్) కాలంలో-మతం, కళలు, సాహిత్యం, సంగీతం, శాస్త్రాధ్యయనం వగైరా అన్ని రంగాలలోనూ గుణాత్మకమైన మార్పువచ్చింది.

గ్రహాలు, వృత్తాకారంలో పరిభ్రమిస్తాయన్న కొపర్నికస్ ప్రతిపాదన ఆనాటి అధికారులకు అసహజంగా కనిపించింది. (నిజానికవి వృత్తాకారంలోకాక, అండాకారంలో తిరుగుతాయని జొహాన్స్ కెప్లర్ నిరూపించాడు.) అసలు, భూమి కేంద్రం కాదన్న భావననే ఎవరూ అంగీకరించే పరిస్థితిలోలేరు ఆరోజుల్లో. శాస్త్రజ్ఞుల వాదనల్ని కాదు, మతాధికారుల సూక్తులనే ప్రజలు విశ్వసించేవారు. గ్రీకులు, టాలెమీ చెప్పారు-భూమి కేంద్రమని. అదే నిజం! మరో డెభ్భైఏళ్లకుగాని వెనిస్‌నగరంలో ఈ సమస్యకు పరిష్కారం లభించ లేదు! 1564లో యిద్దరు మహాపురుషులు జన్మించారు ఇంగ్లడులో షేక్స్‌పియర్, ఇటలీలో గెలీలియో గెలిలి. షేక్స్‌పియర్ నాటకాలు, కవిత్వం జగత్ప్రసిద్ధం. ప్రపంచసాహిత్యంలో అంతటి ప్రతిభావంతుడు మళ్లీ పుట్టలేదంటారు. గెలీలియో తొలుత పిసా (ఇటలీ)లో శాస్త్రపరిశోధనలు ప్రారంభించాడు. తరువాత పదువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ఆచార్యుడిగా నియమితుడయ్యాడు.

కొత్త విషయాలను, వస్తువులను ఆవిష్కరించటంలో ఈయన అందెవేసిన చెయ్యి. మొదట థెర్మోమీటర్ లాంటి ఒక పరికరం కనిపెట్టాడు. తరువాత 'మిలిటరీ కంపాస్' అనబడే ఒక స్లైడ్‌రూల్ తయారు చేశాడు. ఈ పరికరాలను చేసి లాభసాటిగా అమ్మటంలో ఆయన వ్యాపార దక్షత కూడా వుంది. మరి కొన్నాళ్లకు టెలిస్కోప్ కూడా తయారు చేసి అధికారుల మెప్పు పొందాడు. (సుమారు యిరవై మైళ్ళు చూడగలిగిన శక్తివంతమైన పరికరం యిది!) దీని సాయంతోనే ఆయన ఖగోళ అధ్యయనం చేసి The Starry Messenger అనబడే శాస్త్ర గ్రంథం ప్రచురించాడు. చంద్రుడి గురించి తొట్టతొలిగా చిత్రపటాలు తయారు చేశాడు. శాస్త్రరంగంలో యిదో అద్భుతమే అయినా, మతాధికారులకు కోపం తెప్పించింది. (విశ్వానికి భూమి కేంద్రం కాదన్న వాదన 'మతవ్యతిరేకం') నిజానికి, కోపర్నికస్ ప్రతిపాదన సరైనదే అని చెప్పటమే గెలీలియో వుద్దేశం. శాస్త్ర జ్ఞానానికీ, విశ్వాసానికీ మధ్యవున్న వైరుధ్యం ఎప్పుడూ పరిష్కరించలేరని అర్థం చేసుకోలేని అమాయకుడు గెలీలియో.

# కొండ కింది కవిత్వ రాయుడు వాడు

- జూలూరు గౌరీ శంకర్



యంగ్ 'మో'

ఆయన ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసీ చేసీ దేశ దేశాల కవిత్వ వీధుల్లో తెగ తిరిగినవాడు. ఎవరికీ ఎక్కడా ఎప్పుడూ అంతుపట్టని మాటేదైనా ఉంటే..! పలుకేదైనా ఉంటే!? అది అక్షరాల 'మో' దే. వేగుంట మోహనప్రసాద్‌దే. అసలు ఎవరికో అర్థం కావటం కోసం అక్షరాలు పుట్టవు. అర్థం చేసుకునే క్రమంలో ఆ అక్షరాలు అందరికీ అర్థమౌతాయి. 'మో' కవిత్వంలో మనిషిని, కన్నీళ్ళను, తన చుట్టూ అల్లుకున్న తనకిష్టమైన అక్షరాల పందిరిని చూశాను. 'మో' అక్షరాల ఆధునిక కవిత్వ శిఖరం. ఆయన గొప్ప కవి కావొచ్చును. కాని మంచి మనసున్న మనిషి తత్త్వం ఆయనను, నన్ను దగ్గర చేసింది. బెజవాడలో నేను ఓ రెండున్నర సంవత్సరాలు జర్నలిస్టుగా పని చేశాను. చాలా రాత్రులు నన్ను భరించి మోసినవాడు మోహనప్రసాద్. అందరికీ 'మో' అంటే భయం. 'మో' కు మాత్రం నొనొస్తుంటే చాలు. అగో వాడొస్తున్నాడు జాగ్రత్త అనేవాడు. మందులో సోడా కలిపినంత సులభంగా 'మో' మదించిన సాహిత్యాన్నంతా ఆయా సందర్భాల్ని బట్టి రాత్రి పాఠశాలల్లో నాకు వివరించేవాడు. ఆయన చితి-చింత రాసినపుడు నేను ఆరేళ్ళ పిల్లగాణ్ణి. నా కంటే ఓ ఇరవైయేళ్ళ పెద్దవానితో అతి చనువుగా కలిసిపోయి పకపకమని నవ్వుకుంటూ కేరింతలు కొట్టుకుంటూ, నవాళ్ళు విసురుకుంటూ నువ్వెంతంటే నువ్వెంత అనుకోవటం దాకా జరిగిందంటే ఇద్దర్ని కలిసిన ఒకే ఒక ఏకాంశం కవిత్వమే కదా! నాలుగు కవితల గీతలు గీయటమే 'మో' అంబుల పొదిలోకి నేను వెళ్లటానికి కారణమైంది. నేను 1998లో బెజవాడకు వెళ్లేసరికి అప్పటికే విజయవాడ దినపత్రికల్లో ఉండే సాహిత్య పేజీలన్నీ హైద్రాబాదుకు వెళ్లాయి. సాహిత్యపరంగా వేడి వేడి ఇడ్లీ సాంబారులా ఉండే బెజవాడ కేంద్రం నుంచి సాహిత్యమంతా క్రమంగా రాష్ట్ర రాజధానికి చేరింది. ఇక మాలాంటి కొత్తతరంకు చెందిన కవులు బెజవాడ పోతే ఇక మిగిలిన ఏకైక ఆధునిక సాహిత్య మఱ్ఱివృక్షం 'మో' చెట్టే. మా సీతారాం, ప్రసేన్, అఫ్సర్, వంశీలు ఎప్పుడూ 'మో' గురించి చెబుతుండేవాళ్లు. చనిపోయిన త్రిపురనేని శ్రీనివాస్ 'మో'ను మా కోదాడకొచ్చి విశ్లేషించేవాడు. బెజవాడ వెళ్లిన చాలామంది లబ్ధ ప్రతిష్ఠులైన 'మో' ప్రేమికులు కిందరాయి రప్పా చూసుకోకుండా ధబేల్‌మని కాళ్లమీద పడేవార్ని చూశాను. ఆయన కాళ్లకు నమస్కరించి ఆంగ్లానువాదాలు చేయించుకున్నవారు కొందరున్నారు. ఆయనను ప్రసన్నం చేసుకోవటానికి ఇంటి ముందుకొచ్చి ఆ గేటు బైట నుంచే వెళ్లిన వారున్నారు. 'మో' అంటే చాలా మందికి హడలే. సిద్ధార్థ కాలేజీ గేటు కెదురుగా కుడిచేతివైపున సన్న సందులో ఓ ఐదారిళ్ల తర్వాత కొండకింద ఇల్లు 'మో' ది. ఆ ఇంటికి ఆ తరం నుంచి ఈ తరం కవుల వరకు తరలివచ్చేవారు. నేను వృత్తిరీత్యా అక్కడకు వెళ్ళిన తర్వాత 'మో'ను కలిశాను. నేను ఆ ఇంటికి వెళ్లకముందే ఆ ఇల్లు నాకు తెలుసు. జుగాష్, పివి రమణ, తిరుపతిరావులు కలిసి తెనాలి నుంచి "సంతకాలు" అనే సాహిత్య పత్రికను తెచ్చారు. నా "పాదముద్ర" ఆ పొయిట్రీ ఫోరమే పబ్లిష్ చేసింది. ఆ పుస్తకానికి కవర్ పేజీ కోసం 'మో' ఇంట్లో తన్నుకులాడుతుంటే 'మో' బిడ్డ మమతే ట్రేసీ చాప్‌మెన్ బొమ్మనిచ్చింది. అట్లా ఆ ఇంటికి నేను వెళ్లకముందే నేను తెలిసినవాణ్ణి. ఇక నేను బెజవాడలో వున్న కాలంలో దాదాపుగా ఎక్కువ కాలం నన్ను మోసింది, భరాయించింది మాత్రం 'మో'నే. కాలేజీ నుంచి ఇంటికి రాగానే ఆయనకు ఫోన్ చేసేవాణ్ణి. 'గురువుగారు' అనేవాణ్ణి. 8 గంటలకల్లా నువ్వు వచ్చేయ్. నువ్వు రోజు బాగా గొడవ చేస్తున్నావురా? గొడవ చేయకుండా తొందరగా ముగించేద్దాం వచ్చేయ్ అని చెప్పేవాడు.

విజయవాడలో వున్నప్పుడే ఆయన సిద్ధార్థ అకాడమీలోని కాలేజీ నుంచి పదవి విరమణ పొందారు. ఆ సందర్భంగా ఆయనపైన ఒక సావనీర్, "చితి-చింత" పునర్ముద్రణ. "సాంధ్య భాష" పుస్తకాలను వేయటం జరిగింది. ఆ

జూలూరు గౌరీశంకర్ (ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల వేదిక) ఫోన్: 9440169896

సందర్భంగా సభ నిర్వహించటంలో నేను ఉత్సాహంగా భాగస్వామిగా పాల్గొన్నాను. హైద్రాబాద్ నుంచి ఎన్.గోపి, శిఖామణి, యాకూబ్ తదితరులు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి, విశాఖ నుంచి సాహితీ మిత్రులు బాగా వచ్చారు. ఖమ్మం నుంచి సీతారాం, ప్రసేన్, రమణల బృందం వచ్చింది. సభ ముగియగానే బెజవాడలో కొత్తగా నిర్మించిన మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో కవుల కవి సమ్మేళనం మొదలయ్యింది. ఎంతో సంతోషంగా ఉత్సాహంగా ఆ కార్యక్రమంలో అందరం ఆత్మీయంగా పాలుపంచుకున్నాం.

సావనీర్‌కు సంబంధించిన పనినంతా తిరుపతిరావు, సిద్ధార్థ కాలేజీ లెక్చరర్ల బృందం, సీతారాం, జూలూరి తదితరులు చూస్తున్నారు. ఆ సందర్భంగా 'మో' నేను ఇద్దరం కలిసి స్వర్ణలోక్ కాంప్లెక్స్ బార్‌లో కూర్చున్నాం. 'మో'ను చూస్తూ నేప్‌కిన్ పేపర్‌పై చిన్న కవిత రాశాను. వీడో గరళకంఠుడు/ సగం తాగిన దేవదాసు/కల్‌నాయక్ ముఖమేసుకున్న మేక/ అన్ని వాదాలు నడుచుకుంటూ పోతున్నా/పాదాలతో దుఃఖం వాకిలి ముందు కూర్చుంటాడు/ఆ అరుగుముందే కూర్చుని/ 'యగళ్ళ'ని, 'కాళ్ల'ని మరెక్కడైనా ఉరేసుకోమంటాడు/ఇతనొక మాయల మరాఠి/వీడి మాటలకు విఠలాచార్య సినిమాలో/ మంత్రాలు గజగజా వణుకుతాయి/ఆ పగిలిన జూదో గాజుముక్కల తత్త్వాన్ని విప్పితే/మనిషి గాయం కట్లు పొరలు పొరలుగా../ వీడ్ని ఏమనాలి/మనలో మనం ఏదో అనుకుంటామనుకో/ఎవడుగానీ ఏమంటాడు/ఇతగాడు ప్రశ్న కొసకు వేలాడిన అశ్రువు/మనిషి తనం కోసం కర్చీఫ్‌తో/ కళ్లని నొక్కి చెరపేస్తాడు/ఎన్ని గ్లాసులు పగలకొట్టినా/ఎన్ని సిగరెట్ల చివర్లు నాలుకలు తెరిచినా/రాత్రిని చీరి కౌగలించుకున్న కళ్లవి/దేన్ని దాచుకోలేని తలుపులవి. అంటూ ఏవో కొన్ని పిచ్చిగీతలు గీశాను. దాన్ని ఆంధ్రజ్యోతి సాహిత్యపేజీకి పంపాను. అప్పుడు హైద్రాబాదులో ఆ పేజీని పొనుగోటి కృష్ణారెడ్డి చూస్తున్నాడు. ఆ కవిత చదివి పొనుగోటి 'మో'కు ఫోను చేశాడు. 'మో'ను పట్టుకుని వాడు వీడు అని రాస్తాడా?ఆ కవితను అచ్చువేయనని చెప్పాడు. భగవంతుణ్ణి కూడా భక్తుడు ప్రేమతో 'రా' అంటాడు. కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు అని అన్నమయ్య అనలేదా? అని 'మో' చెప్పాడు. అది ఆయన సంస్కారం. మో కొండ కింద రాయుడు వాడు. బెజవాడ వీధుల్లో 'మో', నేను కలిసి స్కూటీపై తిరిగాం. సున్నపుబట్టీల సెంటర్, విశాలాంధ్ర ఆఫీసు దగ్గర వైన్ షాపు పక్కన రాత్రి ఒంటిగంటకు 'మో' డ్రైవరు పైన కవిత చెప్పాడు. ఆయన చెప్పేదాన్ని రాసుకుని వెంటనే చదివి వినిపించాను. మా పక్కనే ఇదంతా వింటున్న ఓ ముగ్గురు లారీ డ్రైవర్లు వచ్చి 'మో' కాళ్లకు నమస్కరించి వెళ్లారు. 'మో' ఇలా ఆసువుగా ఎన్నో కవితలు చెప్పేవాడు. వాటన్నింటిని భద్రపరిచే లక్షణం ఆయనలో లేదు. 'మో'తో సంభాషణే ఒక కవిత్వం. 'మో' తో మొహమాటం లేకుండా మాట్లాడటం తెగని సాహిత్య విమర్శ. 'మో' దుఃఖబాగులోడు. 'మో' తన మనుమడితో పిల్లాడిలా ఆడుకునే వాడు. సుజాత మేడం ముందు మాత్రం మెసలకుండా ఉండేవాడు. మమతంటే ప్రాణం. తన మనుమడు అన్నీ బొమ్మల చొక్కాలు కావాలని అడుగుతున్నాడు అని చెప్పేవాడు. "పొక్కిలి" కవిత్వ సంకలనం చూసి పొక్కిలి అంటే ఏమిటి అని అడిగాడు. "మత్తడి" అంటే ఏమిటి? 'పాతాళగరిగె' అని జూకంటి కవిత్వ పుస్తకానికి ఎంత మంచి పేరు పెట్టుకున్నాడో చూడు అని చెప్పాడు. ఇటీవల ***మిసిమి***కి దీర్ఘ కవితలపై వ్యాసం రాస్తున్నానని కొత్తగా వచ్చిన దీర్ఘకవితల లిస్టు కావాలని అడిగాడు. ఇందుకు నాకంటే ఎక్కువ సమాచారం నాళేశ్వరం శంకరం ఇస్తాడని ఆయన ఫోన్ నెంబర్ ఇచ్చాను. చివరిసారిగా ఆయన ఫోన్ చేసింది హైద్రాబాద్ నుంచి. రవీంద్రభారతిలో, తనికెళ్ల భరణి పుట్టిన రోజు సందర్భంగా 'మో' "నిషాదం" కవితా సంకలనానికి సన్మానం. ఆ సభకు రమ్మని పిలిచాడు. కార్డు పంపుతాను అడ్రస్ చెప్పు అన్నాడు. కార్డెందుకు సార్ మీ మాట చాలు కదా అన్నాను. అయినా ఆయన కార్డు పంపాడు. నేను ఆ సభకు వెళ్లలేకపోయాను. చివరిసారిగా ఆయనను చూడలేక పోయాను. 'మో'తో చర్చలు ఆత్మీయ సంభాషణలు మాత్రం చెరిగిపోనివి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో 'మో' తో తెగేసి చర్చించటం జరిగింది. తెలంగాణ ప్రజాస్వామిక డిమాండన్న విషయంపై బుద్ధి జీవులకు భిన్నాభిప్రాయలెందుకు? అన్న అంశంపై 'మో'తో చాలాసార్లు చర్చించటం జరిగింది. 'మో' కున్న ఆలోచనలు వేరుకావొచ్చును. కానీ కవిత్వం దగ్గరికొస్తే మాత్రం ఆధునిక కవిత్వ కుంపట్లు రాజేసినవాడు. 'మో' తెలంగాణ రాష్ట్రాన్ని సమర్థించలేదు. ఆ విషయంలో ఆయనను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ తెలుగు సాహిత్యానికి ఆధునిక ఆద్యుడుగా ఆయనను మరిచిపోలేం. తెలంగాణ విషయంలో 'మో' కొందరివాడే, కాని ఆధునిక కవిత్వానికి అక్షర మాలలల్లిన అందరివాడు. మి

# చదవండి...




✦ **పౌలస్త్యహృదయం-దాశరథివిజయం:** రాసిలోను వాసిలోను ఆచార్య చతుర్‌సేన్ శాస్త్రి ప్రసిద్ధుడైన హిందీ రచయిత. ఆయన వ్రాసిన వయం రక్షమః కు తెలుగు సేత చేసిన వారు శోభిరాల బాలాత్రిపుర సుందరి. సమస్త వేద, పురాణ దర్శన, బ్రాహ్మణ, ఇతిహాసాల్లో లభ్యమయ్యే విషయాలన్నింటితో క్రోడీకరించి ఐతిహాసిక చిత్రం రావణునకు ప్రాధాన్యతనిచ్చినా కడకు ధర్మానిదే విజయమని చెప్పారు రచయిత. బాపు ముఖచిత్రం. *వెల :* ₹ 120, ప్రతులకు 8897177409.




✦ **కృష్ణాభిసారిక-మీరా:** రచయిత కోడూరు పుల్లారెడ్డి – మేడత రాజపుత్రి – మేవాడ కోడలయిన భక్త మీరాబాయి వ్రాసిన 50 భక్తి గీతాలకిది తెలుగు సేత. మీరా ఆశువుగా పాడిన ఈ గీతాలు ఆమె మరణానంతరం వంద సంవత్సరాల తర్వాత గ్రంథస్థంకావింపబడ్డాయి.

ప్రథమ ముద్రణ వ్రాసిన ముప్పై పదాలు ప్రజాదరణ పొందటంతో వాటికి మరొక ఇరవై చేర్చి మొత్తం యాభై గీతాలు ద్వితీయ ముద్రణలో ప్రచురించారు. ప్రతి పాటకు హిందీమూలం, తెలుగు తాత్పర్యం, ఇతర ప్రత్యేకతల వివరాలను ఇచ్చారు. మీరాకు సంబంధించిన చారిత్రిక విషయాలు కూడా చర్చించబడ్డాయి. ఈ రచనకు ఐదుగురు వ్యక్తులు ముందుమాట వ్రాశారు. ఖరీదు 150 కొంచం ఎక్కువనిపించినా కవి (రచయిత) కృషికి అది అనల్పమే అనిపిస్తుంది. విశాలాంధ్ర బుక్ హౌస్, నవోదయ బుక్ స్టోర్సులో లభిస్తుంది.




✦ **పోతన భాగవత సమాలోచన :** కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంవారి జాతీయ సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రాల సంచిక. పై చిరునామాలో పుస్తకాలు లభిస్తాయి. విలువ : ₹120/– ఇందులో సుమారు 17 తులనాత్మక వ్యాసాలున్నాయి.




✦ **సాహిత్య ప్రస్థానం :** ప్రతి సంవత్సరం 'సాహిత్య ప్రస్థానం' వార్షిక సంచికగా వస్తూ ఎందరో సాహిత్యాభి మానులను అలరిస్తుంది. ఈ సంవత్సరం దిక్సూచి పేరుతో ప్రసిద్ధుల ప్రత్యేక సంచికగా విడుదలయింది. రెండేళ్ళ విరామం తరువాత వచ్చిన ఈ సంచికలో తెలుగు కవులు, రచయితల గురించే కాక, జాతీయ, అంతర్జాతీయ కవులు, రచయితలకు సంబంధించిన రచనలతో విస్తృత భావజాలంతో ప్రచురితమయ్యాయి. సంపాదకులు "ఇప్పుడు తెలుగునాట మనం చూస్తున్న రాజకీయ సామాజిక సాంస్కృతిక అనిశ్చితిలో మార్గదర్శకం చేయగల మహారచయితలను, కవులనూ తేరిపార చూడటం అవసరమనిపించిన ఫలితమే ఈ ప్రత్యేక సంకలనం... అదే దీని ప్రత్యేకత" అన్నారు. దీని ఖరీదుతో పోల్చితే విషయం ఎక్కువనే చెప్పాలి. వెల ₹ 30లు, ప్రతులకు 27660013, 9490099059.




✦ **తడినిప్పు :** ఇప్పుడీ ఎర్రబారిన హృదయం మునపటి లేత తమలపాకే. ఓ మృదుల మనో ముద్రయే హృదయ ఉద్యమ స్ఫూర్తితో రగులుకున్న తడినిప్పుకి మరింత స్ఫూర్తిని రగల్చండి ఈ సైబరాంకిత పేక మేడల్ని చూచి భ్రమయకండి. హృదయ సీమలలోకే నడవండి, హృదయీకరణకే ఉపక్రమించండి. నేనంటారా... కవిని కాకుండా మరేమి అయినా నావల్ల చారిత్రక తప్పిదమే జరిగేది. అని ధైర్యంగా చెప్పగలిన కవి. బోజంకి వెంకట రవి. ఈ 'తడినిప్పు' వేడి మీకు తగలకుండా వుండదు. వెల ₹ 60, ప్రతులకు : 9885425145



❖ **తెలుగు సాహిత్యంలో మాండలిక ప్రయోగం :** తెలుగు భాషా సుసంపన్నతకు మాండలీకాలు ఒక గొప్ప ప్రతీక. సమకాలీన సమాజంలో వివిధ సాహిత్య ప్రక్రియల్లో మాండలీక ప్రయోగాలు ఈనాడు విరివిగా చోటుచేసుకుంటున్నాయి. ఇది వచన రచనా రీతుల్లోనే కాకుండా, కవితా రచనా రీతులలో కూడ ఇబ్బడి ముబ్బడిగా దర్శన మిస్తున్నాయి. ఈ మాండలిక ఉపయోగాలకు అవలోకనం చేస్తూ వ్రాయబడ్డ 25 వ్యాసాలు, 5 మాండలిక కథలను కలుపుకుని వేసిన ఈ పుస్తకం భాషా ప్రియులు ఇష్టపడతారు. *సంపాదకులు ఆచార్య మైనేని కేశవ దుర్గాప్రసాద్- వెల : ₹ 225, ప్రతులకు : 08672-225963.*




❖ **ఆధర్శ అధ్యాపకుడు - కొండా మునిరెడ్డి :** రచయిత సి. వేణు. బొమ్మ సముద్రంలో జన్మించి అంచలంచలుగా ఎదిగి ఆచార్యత్వమేగాక, పాఠశాల నిర్మాణంలోనూ పాలుపంచుకున్న ఆదర్శనీయమైన వ్యక్తి యొక్క జీవిత చరిత్ర ఈ రచన. *వెల : ₹ 30. ప్రతులు లభించు స్థలం: సి. వేణుగోపాలరెడ్డి, మంది కృష్ణాపురం, నంగమంగళం పోస్ట్, గుడిపాల మండలం, చిత్తూరు జిల్లా.*



❖ తెలుగు జాతి రత్నాలు పేరుతో సి.పి. బ్రౌన్ అకాడమీ హైదరాబాదు వారు ప్రచురించిన నాలుగు పుస్తకాలు. ఒక్కో పుస్తకం విలువ : ₹ 95/-, ప్రతులు లభించు స్థలం : సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ - 500 082.

**1. డా. బెజవాడ గోపాలరెడ్డి :** రచయిత ఆర్. అనంత పద్మనాభరావు.

**2. దాశరథి :** రచయిత డా॥ ద్వా.నా. శాస్త్రి.

**3. జిడ్డు కృష్ణమూర్తి :** రచయిత అబ్బూరి ఛాయాదేవి. సుమారు 149 పేజీలతో వారి జీవితాలను సంగ్రహంగా నయినా సమూలంగా మన ముందుంచటంలో రచయిత కృషి ఫలించిందని చెప్పవచ్చు.

**4. దామెర్ల రామారావు :** నవ్యాంధ్ర చిత్రకళా వైతాళికుడు దామెర్ల రామారావుపై విపర్తి కలికావతారం రచన. రామారావు జీవిత చిత్రణలో ఆయన వేసిన చిత్రాలతో పాటు ఆయన గురువు కూల్డ్రే, భార్య సత్యవాణి, సోదరి బుచ్చి కృష్ణమ్మ వేసిన చిత్రాలను కూడా ప్రచురించారు. చిత్రకళా ప్రేమికుల వద్ద తప్పక ఉండదగ్గ పుస్తకం.




❖ **నీతి చంద్రిక :** రచయిత మల్లాది హనుమంతరావు. విష్ణుశర్మ వ్రాసిన పంచతంత్రం ఆధారంగా 14వ శతాబ్దంలో నారాయణ పండితుడనే కవి సంస్కృతంలో హితోపదేశం వ్రాశాడు. దానియొక్క సరళాంధ్రీకరణమిది. ఇందులో కథలతో పాటు బొమ్మలులు కూడా ఉన్నాయి. వెల: ₹ 95/-, ప్రతులు లభించు స్థలం : సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ - 500 082.




❖ **చారిత్రక మంజరి :** మల్లంపల్లి సోమశేఖర శర్మగారు వ్రాసిన చరిత్రకు సంబంధించిన ఎంపిక చేయబడిన 19 వ్యాసాల సంపుటిది. సంకలన కర్త మోదుగుల రవికృష్ణ. శర్మగారి చారిత్రక అవగాహన శాస్త్రీయమైనదే కాదు, ఆధునికమైనది కూడా. "చరిత్రంటే మనుష్యుడు చేసిన కృషి, అనుభవజ్ఞానం" అని ఉటంకించిన మల్లంపల్లి వ్యాసాలు *విజ్ఞాన భాండాగారం. వెల : ₹160/-, ప్రతులకు విశాలాంధ్ర పబ్లికేషన్స్.*

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 7. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 8. | అమాహా | " " | 60.00 |
| 9. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 10. | సిద్ధార్థ | " " | 50.00 |
| 11 | నాలో నేను | " " | 30.00 |
| 12. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 13. | కథాంజలి-2 | " " | 110.00 |
| 14. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 15. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 16. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 17. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 18. | గురవాయణం | డాక్టర్ *గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హా : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంద్రమా? - వాగరి | 40.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి.
బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

1. **పేరు :** ........................................

2. **చిరునామా :**
   - ఇం.నెం. ........................................
   - వీధి ........................................
   - పేట ........................................
   - ఊరు ........................................
   - పిన్ ........................................
   - సెల్ ........................................

3. **సంతకం :** ........................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



దిక్కుతోచని రైతు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



ఎదురుచూపు ఎవరికోసమో